అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదివారం 23-06-2024
సంపుటి : 10 సంచిక : 174
Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar
16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

సెమీస్‌లో అడుగు!

- సూపర్‌8లో వరుసగా రెండో విక్టరీ
- బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం
- కుల్దీప్ మాయ, బుమ్రా బూమ్ బూమ్
- హార్దిక్ పాండ్య అజేయ అర్థ సెంచరీ
- భారత్ 196/5, బంగ్లాదేశ్ 146/8



వివరాలు 8లో..

నిద్రొస్తలే...

పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
నిద్ర నాణ్యత, ఆరోగ్యంపై ప్రభావం
పలు మెట్రో నగరాల్లో అధిక మార్పులు

దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలలు ఆందోళన కలిగిస్తున్నాయి. వేసవి కాలంలో ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే రాత్రి ఉష్ణోగ్రతలు వేగంగా పెరగటం దేశ ప్రజలను మరింత కలవరపెడుతున్నది. రాత్రిళ్లు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మానవుల నిద్ర నాణ్యత, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఒక అధ్యయనం వెల్లడించింది.



న్యూఢిల్లీ : వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు తారుమారయ్యాయి. దీంతో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు నిద్రకరువైంది. క్లైమేట్ సెంట్రల్ అండ్ క్లైమేట్ ట్రెండ్స్ విశ్లేషణ ప్రకారం.. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో రాత్రిపూట ఉష్ణోగ్రతలలో అత్యధిక మార్పులు కనిపిస్తున్నాయి. భారత్ తీవ్రమైన హీట్‌వేవ్‌ను ఎదుర్కొంటున్నది. ప్రతి సంవత్సరం ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్‌ను మించిపోయింది. ఇది నిద్ర, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలను చూపుతోంది. వాతావరణ మార్పు రాత్రిపూట వేడెక్కటం ఈ పరిణామానికి దారితీస్తున్నది. ఇది భారత్ మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా నిద్ర నాణ్యత, మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. ప్రధానంగా బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను కాల్చడం వల్ల ఏర్పడే వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచం వేడెక్కుతున్నది. దీంతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పగటి ఉష్ణోగ్రతల కంటే మరింత వేగంగా పెరిగాయి. వాతావరణ సంక్షోభ ప్రభావాలకు అత్యంత హాని కలిగించే దేశాలలో ఒకటిగా, వాతావరణ మార్పుల కారణంగా గత దశాబ్దంలో భారత్ కనిష్ట రాత్రిపూట ఉష్ణోగ్రతలలో గణనీయమైన పెరుగుదలను చూసింది.

జూన్ 18న దేశ రాజధాని గత 12 ఏండ్లలో ఎన్నడూ లేనంత వేడి రాత్రిని చూసింది. ఉష్ణోగ్రత 35.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది. 1969 తర్వాత నగరంలో ఇదే అత్యధిక కనిష్ట ఉష్ణోగ్రత కావటం గమనార్హం. 2018 నుంచి 2023 మధ్య ఏపీ, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, జమ్మూ కాశ్మీర్‌లలోని నగరాల్లో వాతావరణ మార్పులు ప్రతి సంవత్సరం ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. మెట్రో నగరాల్లో, ముఖ్యంగా ముంబయి రాత్రిపూట ఉష్ణోగ్రతలలో అత్యధిక మార్పులను చూసింది. పశ్చిమ బెంగాల్, అసోంలలో ఎక్కువగా ప్రభావితమైన ప్రాంతాలుగా జల్‌పైగురి, గౌహతి, సిల్చార్, దిబ్రూగఢ్, సిలిగురిలు ఉన్నాయి. భారత్ అంతటా రాత్రిపూట వేసవి ఉష్ణోగ్రతలు మొత్తం వేసవి కాలంలో తరచుగా 20 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నాయి.

తగ్గుతున్న ఆయుష్షు

రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ, ఇది నిద్ర నాణ్యతను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనటానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెప్పారు. పేలవమైన నిద్ర.. శారీరక, మానసిక ఆరోగ్యం, మెదడు పనితీరు, ఆయుర్దాయాన్ని కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. వేడి రాత్రులు వృద్ధులపై అసమాన ప్రభావాలను కలిగిస్తాయి.

సహకారం మరింత బలోపేతం

హసీనా, మోడీ చర్చలు



న్యూఢిల్లీ : భారత్‌లో పర్యటిస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం చర్చలు జరిపారు. వాణిజ్యం, ...16లో

ఆగని నరమేధం



ఇజ్రాయిల్ దాడుల్లో 42 మంది పాలస్తీనియన్లు మృతి

వివరాలు 16లో

గురువులకు సముచిత గౌరవం

- చరిత్రలో లేని విధంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు
- చట్టపరమైన వివాదాలను పరిష్కరించిన ప్రభుత్వం
- 18 వేల పైచిలుకు మంది టీచర్లకు ప్రయోజనం
- మల్టీజోన్-1లో 10,083 మంది, మల్టీజోన్-2లో 768 మందికి ప్రమోషన్లు
- వారంరోజుల్లో మరో 8 వేల మందికి పదోన్నతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గురువులను సముచిత రీతిలో గౌరవించింది. రెండు దశాబ్దాలుగా సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), భాషా పండితులు (ఎల్పీ), వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు (పీఈటీ)లు ఎదురుచూస్తున్న పదోన్నతుల కలను ఈ ప్రభుత్వం నెరవేర్చింది. పదోన్నతులకు ఆటంకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఉన్న పలు చట్టపరమైన అడ్డంకులను పరిష్కరించడంతో మార్గం సుగమమైంది. ఫలితంగా 8,630 మంది భాషా పండితులు, 1,849 మంది పీఈటీలు పదోన్నతులు పొందారు. వారు నూతన స్థానాల్లో పోస్టింగులు దక్కించుకున్నారు. మల్టీజోన్-1 పరిధిలో 10,083 మంది, మల్టీజోన్-2 పరిధిలో 768 మంది కలిపి ఇప్పటివరకు 10,851 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. మల్టీజోన్-2లో మరో ఎనిమిది వేల మందికి వారం రోజుల్లో పదోన్నతులు రానున్నాయి.

పారదర్శకంగా ప్రక్రియ...

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులను కల్పించింది. ఇంత పెద్ద సంఖ్యలో పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకతతో నిర్వహించింది. భాషా పండితులు, పీఈటీలు, ఇతరులకు కలిపి మొత్తం 10,851 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. ఈ నెల 30 నాటికి మరో ఎనిమిది వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించడంతో పాటు బదిలీల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయనుంది.

ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవ

గత ప్రభుత్వ హయాంలోనే భాషా పండితులు, పీఈటీల పదోన్నతుల ఉత్తర్వులు సిద్ధం చేసినప్పటికీ కోర్టుల్లో పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఆ ఉత్తర్వులను జారీ చేయలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపడంతో హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఫలితంగా చట్టపరమైన అడ్డంకులను అధిగమించి పదోన్నతులకు బాట పడింది. ఉపాధ్యాయుల అర్హతకు తగినట్టు పదోన్నతులు దక్కడంతో ప్రభుత్వ, స్థానిక సంస్థల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన జరగనుంది.

ఉపాధ్యాయ పదోన్నతుల వివరాలు

స్కూల్ అసిసెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులు	768
ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లు	10,083
మొత్తం	10,851

జిల్లాల వారీగా మల్టీజోన్-2లో ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు

జిల్లా	పదోన్నతుల సంఖ్య
జనగాం	64
జోగులాంబ గద్వాల	30
మహబూబ్‌నగర్	16
మేడ్చల్ మల్కాజిగిరి	6
నాగర్ కర్నూల్	76
నల్లగొండ	109
నారాయణపేట	49
రంగారెడ్డి	19
సంగారెడ్డి	69
సూర్యాపేట	102
వికారాబాద్	94
వనపర్తి	51
యదాద్రి భువనగిరి	83
మొత్తం	768

జిల్లాల వారీగా మల్టీజోన్-1లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు

జిల్లా	పదోన్నతుల సంఖ్య
ఆదిలాబాద్	445
కొమరం భీమ్ ఆసిఫాబాద్	340
మంచిర్యాల	458
నిర్మల్	416
నిజామాబాద్	833
జగిత్యాల	682
పెద్దపల్లి	368
జయశంకర్ భూపాలపల్లి	277
భద్రాద్రి కొత్తగూడెం	694
మహబూబాబాద్	517
వరంగల్	434
హన్మకొండ	475
కరీంనగర్	504
రాజన్న సిరిసిల్ల	394
కామారెడ్డి	787
మెదక్	597
సిద్దిపేట	679
ఖమ్మం	954
ములుగు	229
మొత్తం	10,083



కండ్లకు గంతలతో జూడాల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీస్‌ను అందజేసినా.. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో జూనియర్ డాక్టర్లు నిరసన బాట పట్టారు. శనివారం రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో నల్లరిబ్బన్లతో కండ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్దేశిత సమయంలో ఉపకార వేతనాల విడుదల, పెండింగ్ స్టయిఫండ్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టయిఫండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్, , ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం తదితర డిమాండ్లపై వారు ఆందోళన కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే.



ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీఎస్ఎంఐడీసీ, ఐపీఎం, బ్లడ్ బ్యాంకులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాల్సిన అవసరముందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లోని హాస్టళ్లు, క్యాంటీన్లతో పాటు ఆస్పత్రుల క్యాంటీన్లపై నిరంతర నిఘా పెట్టాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా తనిఖీలు, ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నేషనల్ హెల్త్ మిషన్ నిధుల విడుదలకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివ లీల తదితరులు పాల్గొన్నారు.

ఉపా చట్టాన్ని ఎత్తివేయాలి

- అరుంధతిరాయ్‌పై పెట్టిన అక్రమ కేసు తొలగించాలి
- ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని ఈ చట్టం కింద వేధిస్తున్నారు
- సుప్రీంకోర్టు న్యాయవాది నరీం నవేద్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్‌తో పాటు కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై పెట్టిన "ఉపా" కేసులను ఎత్తి వేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది నరీం నవేద్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఉపా చట్టంపై పున:పరిశీలన అవసరమా?" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. పదేండ్ల క్రితం ఆజాదీ అనే నినాదాలు చేసినందుకు ఉపా కేసు ఎలా పెడతారని ఆయన ప్రశ్నించారు. నినాదాల వల్ల దేశం ఎలా విచ్ఛిన్నమవుతుందో చెప్పాలన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇలాంటి కేసుల్లో ఇచ్చిన తీర్పులను కాదని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలివ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. టాడా, పోటా లాంటి చట్టాల స్థానంలో తీసుకువచ్చిన ఉపా చట్టం అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తికి ఆరు నెలల వరకు బెయిల్ ఉండదని, ఎన్ని సంవత్సరాలైనా కేసు కొనసాగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల్లో అరెస్టయిన వందలాది మంది ఏండ్లుగా జైళ్లలో మగ్గుతున్నారని గుర్తు చేశారు. ఫాసిస్టు విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై వామపక్ష తీవ్రవాదులుగా ముద్రవేసి అక్రమంగా నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిపై కక్ష సాధించేందుకు పాలక పక్షాలు ఉపా చట్టాన్ని పావుగా వాడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం వల్ల కలిగే అనర్థాలపై జనబాహుళ్యంలో విస్తృతమైన సైద్ధాంతిక చర్చ జరగాలని ఆకాంక్షించారు. దేశంలో పోలీసులు బాధ్యతగా వ్యవహరించే విధంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో కొండూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసరా , చేయూత పింఛన్ల పెంపు ఇంకెప్పుడు?

- ఆరు నెల్లు గడుస్తున్నా ఊసెత్తని ప్రభుత్వం : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆసరా, చేయూత పింఛన్ల పెంపు ఇంకెప్పుడని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నెల్లు గడుస్తున్నా పింఛన్ల పెంపు విషయంపై ప్రభుత్వం మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి కోసం లబ్ధిదారులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా, చేయూత పింఛన్లను రూ. ఆరు వేలకు పెంచుతామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అది ఎప్పటినుంచి వస్తుందో నని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే జూన్ నాటికి వృద్ధులు 16,36,604, వితంతువులు 15,73,050, వికలాంగులు 5,14,422 , నేత కార్మికులు 37,296, గీత కార్మికులు 65,668 , హెచ్ఐవీ 6396, ఫైలేరియా 18041, బీడీ కార్మికులు 4,24,834, ఒంటరి మహిళలు 1,43,456 మంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 44,49,767 మందికి తొమ్మిది రకాల పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజపాలనలో పింఛన్ల కోసం సుమారు 24.84 లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారంతా ఆరు నెల్ల నుంచి ఎదురు చూస్తున్నారని తెలిపారు. వాటిని పెండింగ్‌లో లేకుండా రెగ్యులర్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2024 జనవరి నుంచే పెరిగిన పింఛన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జనవరి నుండి జూన్ వరకు ఏరియర్స్ కలిపి జులై నెలలో చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

రేపటినుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాతపరీక్షలు

అరగంట ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్, మ్యాట్రన్, మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి సోమవారం నుంచి కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు (సీబీఆర్టీ) విధానంలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 29 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత రాతపరీక్షలుంటాయని వివరించారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకే పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తామని పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్ టేబుళ్లు, లాగ్ బుక్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్‌లు పరికరాలు, గడియారాలు, లాగ్ టేబుళ్లు, హ్యాండ్ బ్యాగ్‌లు, ప్యాడ్‌లు, నోట్లు, చార్టులు, కాగితాలు, ఇతర గాడ్జెట్లు పరీక్షా కేంద్రాల్లోకి తేవడాన్ని నిషేధించామని వివరించారు. చెప్పులతోనే హాజరుకావాలని సూచించారు. ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాలను సందర్శించాలని కోరారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను, ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మూడు నెలల ముందు దిగిన పాస్‌పోర్టు సైజ్ ఫొటోను హాల్‌టికెట్‌పై అంటించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1 పోస్టులు ఐదు, అదే శాఖలో గ్రేడ్-2 పోస్టులు 106, ఎస్సీ అభివృద్ధి శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 (మహిళ) పోస్టులు 70, అదే శాఖలో గ్రేడ్-2 (పురుషులు) పోస్టులు 228, బీసీ సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులు 140, వికలాంగులు, వయోవృద్ధుల శాఖలో వార్డెన్ గ్రేడ్-1 పోస్టులు ఐదు, అదే శాఖలో మ్యాట్రన్ గ్రేడ్-1 పోస్టులు మూడు, వార్డెన్ గ్రేడ్-2 పోస్టులు మూడు, మ్యాట్రన్ గ్రేడ్-2 పోస్టులు రెండు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో మహిళా సూపరింటెండెంట్ పోస్టులు 19 చొప్పున మొత్తం 581 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 23న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. నార్మలైజేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓటమిపై కాంగ్రెస్ మేథోమధనం

- సీరియస్‌గా తీసుకున్న ఏఐసీసీ
- కురియన్ నేతృత్వంలో పోస్టుమర్టమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో ఓటమిపై మేథోమథనం చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. రాష్ట్రంలో పార్టీకి ఎనిమిది సీట్లే రావడంతో ఇంతకు ముందున్న ఉత్సాహం కనిపించడం లేదు. అధికారంలో ఉండి కూడా పార్లమెంటు ఎన్నికల్లో ఎందుకిలా జరిగిందనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లలో కనీసం 14 సీట్లను సాధించాలనే లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ విషయాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అందుకనుగుణంగా ఓటమిపై పోస్టుమార్టమ్ చేయాలని అధిష్టానం భావిస్తోంది. అందులో భాగంగా పార్టీ సీనియర్ నేత కురియన్ నేతృత్వంలో రఖిబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ ఈ నెలాఖరులో రాష్ట్రానికి రానున్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం, ఓటర్ల మనోభావాలు తెలుసుకోవడం, బూత్ కమిటీల పనితీరును పరిశీలించడం... తద్వారా నిజనిర్ధారణ చేసి ఆ కమిటీ అధిష్టానానికి నివేదిక ఇవ్వనుంది. ఓడిపోయిన అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జి మంత్రులు, బాధ్యుల పనితీరుపై ప్రత్యేక ఫోకస్ చేయనుంది. పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషించిన తర్వాత రాష్ట్రంలో మేథోమథన సభ నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. అందులో పార్టీ బలోపేతంపై చర్చిస్తారు. మరోవైపు అధికారంలో ఉండటం వల్ల ప్రభుత్వానికి, పార్టీకి మధ్య బలమైన బంధాన్ని ఏర్పాటు చేసుకోవాలని సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈ రెండు జోడెద్దుల్లా పని చేయడం ద్వారా పార్టీ బలోపేతమవుతుందని అధిష్టానం పెద్దలు సూచిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మేథోమథనం సభలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి, పార్టీ సహకరించిందని సీనియర్ నేతలు గుర్తు చేసుకుంటున్నారు. అదే విధానాన్ని ఇప్పుడు కొనసాగించాలని అధిష్టానం భావిస్తున్నది. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది.

పాలసీదారులు ప్రతిపాదన పత్రాలు సమర్పించాలి

టీజీఎల్ఐ శాఖ సంచాలకులు శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐ) పాలసీదారులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతిపాదన పత్రాలను సమర్పించాలని టీజీఎల్ఐ శాఖ సంచాలకులు వి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. 56 ఏండ్లలోపు ఉండి వారి జీతభత్యాల నుంచి ప్రతిపాదన పత్రాలను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాల్లో సమర్పించి తగిన విధంగా పాలసీలు పొందాలనీ, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులవుతారని పేర్కొన్నారు. అయితే కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బీమా అర్హత 56 ఏండ్లలోపు ఉండి ప్రీమియంలు క్రమంతప్పకుండా తగ్గించుకున్నప్పటికీ సంబంధిత జిల్లా బీమా కార్యాలయాల్లో ప్రతిపాదన పత్రాలను సమర్పించకపోవడంతో నేటికీ ఆ పాలసీలు పొందలేదని వివరించారు. అలాంటి వారు అన్ని రకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారని తెలిపారు.

అందువల్ల వారు, డీడీఓలు తగిన చొరవ తీసుకుని వారి జీతభత్యాల నుంచి మినహాయించే మొత్తం ప్రీమియంకు సరిపేడే విధంగా పూరించిన ప్రతిపాదన పత్రాలను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు. వాటికి తగిన విధంగా పాలసీలను పొంది వాటి నెంబర్లను సమగ్ర ఆర్థిక నిర్వహణ, సమాచార విధానం (ఐఎఫ్ఎంఎస్) పోర్టల్‌లో ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. లేకుంటే వారి నెలసరి ప్రీమియం మొత్తం అనామతు ఖాతాలోకి వెళ్లే అవకాశముంటుందని తెలిపారు. తద్వారా అన్ని రకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని బీమా ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందాలని కోరారు.

ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి: ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి నియమించారు. ప్రస్తుతం గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశాఖ జేసీకి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రిసెల్వి నియమించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత బదిలీ అయ్యారు. అక్కడకు దినేష్‌కుమార్‌ను నియమించారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రశాంతిని బదిలీ చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బి.ఆర్.అంబేద్కర్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి, చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్, కాకినాడ జిల్లా కలెక్టర్‌గా సగలి షణ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.సృజన, ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా, కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్ బాషా, బాపట్ల కలెక్టర్‌గా ఆ జిల్లా జేసీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 23-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 174

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

లాభసాటి లేని మద్దతు ధరలు

రైతుల్ని అపహాస్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం : ఎస్కేఎం

న్యూఢిల్లీ : పండించిన పంటకు మద్దతు ధర కోసం రైతులు దేశ రాజధానిలో ఏడాదికి పైగా నిరసనలు చేసిన సంగతి తెలిసిందే. వరుసగా మూడోసారి మోడీ ప్రధాని అయిన తర్వాత 14 పంటలకు మద్దతు ధరను పెంచుతున్నట్టు రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం.. వరికి పెంచిన మద్దతు ధర పెంపు రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మరోసారి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ...7లో

పరీక్ష కాదు..శిక్షే

ఐదేండ్లలో 41 ప్రశ్నాపత్రాలు లీక్

విశ్వసనీయత కోల్పోయిన ఎన్‌టీఏ

విద్యార్థుల్లో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం, అసహనం



ఎలాంటి లోపాలు, అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రవేశ పరీక్షలను నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని ఏర్పాటు చేశారు. అయితే ఏ లక్ష్యంతో అయితే ఈ సంస్థ ఏర్పడిందో దానిని నెరవేర్చడంలో మాత్రం పదే పదే విఫలమవుతోంది. ఇందుకు తాజా ఉదాహరణే సీఎస్ఐఆర్-యూజీసీ-నెట్ పరీక్ష వాయిదా. ఈ పరీక్షను శుక్రవారం రాత్రి వాయిదా వేశారు. ఈ నెల 25-27 తేదీల మధ్య జరగాల్సిన ఈ పరీక్షను 'వనరుల కొరత' కారణంగా వాయిదా వేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఈ పరిణామం ఎన్టీఏ విశ్వసనీయత, సామర్థ్యంపై విద్యార్థుల్లో అనుమానాలను పెంచుతోంది. పరీక్షల పట్ల విశ్వాసాన్ని పెంచడానికి ఏర్పడిన సంస్థ ఇలా విశ్వసనీయతను కోల్పోవడానికి కారకులెవరన్న ప్రశ్న తలెత్తుతోంది.

న్యూఢిల్లీ : విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. గత ఐదు సంవత్సరాల కాలంలో ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, బీహార్, జార్ఖండ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్...ఇలా పదిహేను రాష్ట్రాల్లో 41 నియామకాలకు సంబంధించిన పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి. పరీక్షా పత్రాల లేకేజీలో ఇది ఓ విపత్తు వంటిది. ఈ లీకేజీల కారణంగా పెద్ద రాష్ట్రాలకు చెందిన కోట్లాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. నీట్ పరీక్షకు సంబంధించి జరుగుతున్న నిరసనలు విద్యార్థుల ఆగ్రహానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

విద్యార్థుల ఆగ్రహం

సంవత్సరమంతా కష్టపడి, ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనై పరీక్షలకు సిద్ధమైతే తీరా అవి లీక్ కావడం విద్యార్థులు, ఉద్యోగార్థుల్లో ఆగ్రహాన్ని, అసహనాన్ని పెంచుతోంది. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం నష్టం చేస్తున్నప్పటికీ ఈ తంతు కొనసాగుతూనే ఉంది. ఒకసారి పొరబాటు జరిగితే దానిని దిద్దుకోవాల్సింది పోయి పదే పదే పునరావృతం చేయడం ఏమిటని విద్యార్థులు నిలదీస్తున్నారు. పేపర్ లీకేజీల కారణంగా అన్ని రాష్ట్రాల విద్యార్థులు నష్టపోతూనే ఉన్నారు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే కోట్లాది మంది విద్యార్థులకు అన్యాయం చేసినవారు అవుతారు. నీట్ పరీక్ష జరిగిన 47 రోజుల తర్వాత ఎన్టీఏ పనితీరును మెరుగుపరచేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అసలు సమస్యకు మూలం ఎక్కడ ఉన్నదో దానిని గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ...6లో

నీట్-పీజీ ప్రవేశ పరీక్ష వాయిదా

త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తాం..
కేంద్ర వైద్యారోగ్యశాఖ

జూన్ 23న (ఆదివారం) నేడు దేశవ్యాప్తంగా జరగాల్సిన నీట్-పీజీ ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పరీక్ష వాయిదా పడినట్టు తెలుస్తోంది. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కేంద్ర వైద్యారోగ్యశాఖ తెలిపింది.

లీకుల వేళ నిపుణుల కమిటీ



ఇస్రో మాజీ చైర్మెన్ కె రాధాకృష్ణన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు
రెండు నెలల్లో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు నివేదిక 15లో..

పేపర్ లీక్‌కు పాల్పడితే..



పదేండ్ల జైలు.. రూ.కోటి జరిమానా
అమల్లోకి కఠిన చట్టం
గెజిట్ నోటిఫికేషన్ విడుదల 15లో..

ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌పై వేటు

సుబోధ్ కుమార్ తొలగింపు..
రిటైర్డ్ ఐఏఎస్ ప్రదీప్ సింగ్ ఖరోలాకు బాధ్యతలు 15లో..



ప్రదీప్ సింగ్ ఖరోలా



గోల్కొండ చౌరస్తాలో ధర్నాలో సీఐటీయూ నేతలు

బొగ్గు బావుల ప్రయివేటీకరణ ఆపాలి

సింగరేణికి కేటాయించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్
హైదరాబాద్ గోల్కొండ చౌరస్తా వద్ద ధర్నా
బొగ్గు గనుల వేలంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

నవతెలంగాణ - ముషీరాబాద్/విలేకరులు

బొగ్గు బావుల ప్రయివేటీకరణ ఆపి వాటిని సింగరేణికి కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలం, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడంపై శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పథకాన్ని అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయాలని, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ముందుకెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు కార్పొరేటు శక్తులకు కట్టబెట్టడానికి పదో విడత బొగ్గు బావుల వేలం ప్రక్రియ మొదలు పెట్టారని, రాష్ట్రానికి చెందిన ఎంపీ కిషన్ రెడ్డి కేంద్ర గనుల శాఖ మంత్రి పదవి చేపట్టగానే తెలంగాణకు తీరని అన్యాయం చేయబోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60 గనులను వేలం వేసి బహిరంగంగా ప్రయివేటు కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ ...6లో

బొగ్గుబ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలి

వేలంపాటకు వ్యతిరేకంగా 28,29 తేదీల్లో ధర్నాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు 6లో..



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సింగరేణిని ముంచింది

బీఆర్ఎస్సే

కేసీఆర్ కుటుంబం వల్లే సంస్థ దివాళా

వివరాలు 6లో

పదేండ్లలో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి
సంస్థను ప్రయివేటీకరిస్తున్నారనే ప్రచారం పచ్చి అబద్ధం : కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

చంద్రబాబుతో పోటీపడతా

అందుకు నాతోపాటు...అధికారులూ కష్టపడాల్సిందే



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న బాలకృష్ణ, తదితరులు

- శంషాబాద్‌లో హెల్త్ హబ్
- 500 నుంచి వెయ్యి ఎకరాల కేటాయింపు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పోటీ పడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 24వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు రోజుకు 18 గంటలు పని చేస్తారనీ, తాను 12 గంటలు పని చేస్తే సరిపోదని తెలిపారు. అందుకే ఇక మీదట తానూ 18 గంటలు పని చేస్తాననీ, రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందేనన్నారు. మనలో ఉన్న నైపుణ్యం బయటికి రావాలంటే నైపుణ్యమున్న ఆటగాడితో పోటీ పడాలని వ్యాఖ్యానించారు. అభివృద్ధిలో రెండు తెలుగు రాష్ట్రాలు పోటీపడి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

క్యాన్సర్ రోగులకు సేవలందించాలన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆలోచనలకు చంద్రబాబు సహకారం తోడై కోట్లాది మందికి సేవలందించారని రేవంత్ ఈ సందర్భంగా కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక పట్టుదలతో నాటి ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయ్‌ను ...15లో

కేంద్ర మంత్రికి నీట్ సెగ

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ అరవింద్ ఇండ్ల ముట్టడి
విద్యార్థి, యువజన సంఘాల నాయకుల అరెస్ట్
నిజామాబాద్‌లో విద్యార్థులపై లాఠీచార్జి
మహబూబ్‌నగర్‌లో భారీ ప్రదర్శన



నవతెలంగాణ-అంబర్‌పేట/నిజామాబాద్ సిటీ

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం సెగ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, బీజేపీ ఎంపీ అరవింద్‌ను తాకింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం వారి ఇండ్లను ...7లో

జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ !

- కేంద్ర ప్రభుత్వ యోచన
- కొన్నింటిపై టాక్స్ తగ్గింపు

53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం



డిప్యూటీ సీఎం భట్టితో మాట్లాడుతున్న కేంద్రమంత్రి నిర్మల

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే విషయం ఆలోచిస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పన్ను రేటు ఎంత ఉండాలనేది రాష్ట్రాలు సూచిస్తే , దీనిపై ముందుకెళ్తామని ఆమె తెలిపారు. జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ తీసుకురావడాన్ని చాలా రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న తరుణంలో కేంద్ర ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గోవా, మేఘాలయ ముఖ్యమంత్రులు, మధ్యప్రదేశ్, బీహార్, హర్యానా ఉప ...15లో

రాష్ట్రానికి నిధులివ్వండి

కేంద్ర ఆర్థికమంత్రికి రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వినతి

రాష్ట్రానికి నిధులివ్వాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం నాడిక్కడ భారత్ మండపంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ...15లో

రియల్టర్ల మోసాలు..!

అసైన్డ్ భూముల్లో వెంచర్లు

- అమాయక ప్రజలకు అమ్మకాలు
- రిజిస్ట్రేషన్ చెయ్యకుండా నోటరీలతో సరి
- ఇంటి నిర్మాణాలను కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు
- సర్కారు భూముల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకోబోమని హెచ్చరిక
- మోసపోయామని గ్రహించిన వట్టినాగులపల్లి బాధితులు
- వారికి అండగా నిలిచిన వ్యకాస

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

పేదలు ఓ మోసకారి వలకు చిక్కారు.. వాడి మాటలు నమ్మి లక్షలు వెచ్చించి జాగాలు కొన్నారు. ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. అంతా సాఫీగా సాగుతున్న క్రమంలో ప్రభుత్వ అధికారులు వచ్చి ఇండ్లను కూల్చేశారు. ఇది తెలిసి ఆ మోసకారి.. న్యాయం చేస్తానని మళ్లీ బాధితుల వద్ద డబ్బులు వసూలు చేశాడు. పేదలు గుడిసెలు వేయడం.. అధికారులు కూలగొట్టడం.. ఇదే అదనుగా ఆ మోసకారి డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం ...7లో



పేద ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

జి.నాగయ్య, వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు



రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతుల్లో మోసపోయిన అమాయక ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలి. నోటరీ ద్వారా కొనుగోలు చేసిన ఇంటి జాగాలకు.. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచన ...7లో

రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

వెంకట్రాములు, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పేదలను మోసం చేసి సొమ్ము చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి జావేద్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బాధితులకు న్యాయం చేయాలి.

ఏపీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభాపతిగా సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ...15లో



కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు

వనరులను దోచుకోవటంలో దొందూ దొందే : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 7లో..



సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకపోతే
రాజకీయ ప్రజాస్వామ్యానికి మనుగడ లేదు - డా॥ బి.ఆర్.అంబేద్కర్

సంపాదకీయం

మోడీ హయాంలో పరీక్షలు అభాసుపాలవుతున్నాయి. ఇది నేడొక జాతీయ సమస్యగా మారింది. విద్యాసంబంధ పరీక్షలను కేంద్రీకృతం చేసుకుని, రాష్ట్రాల హక్కులను హరించిన ఫలితమే ఈ పర్యవసానాలు. విద్యారంగాన్ని వ్యాపారమయం చేసే ప్రయివేటీ కరణే ఈ అనర్థాలకు మూల కారణం. కాషాయీకరణ, ప్రయివేటీ కరణ కోసం కేంద్రం తహతహలాడుతున్నది. పరీక్షలను సైతం నిఖార్సుగా నిర్వహించలేని ప్రభుత్వం ఇంకా అభివృద్ధిని ఎలా సాధించగలదు! ఇప్పటికైనా ప్రధాని పరీక్షపై చర్చ చేయాలి. ఈ లీకులకు బాధ్యత వహిస్తూ విద్యామంత్రి రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేసి, విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్రీకృత పరీక్షల విధానాన్ని ఉపసంహరించాలని ప్రతి పక్షాలు చేస్తున్న డిమాండ్లు సహేతుకమైనవి.

నిద్రాయోగ

మనసును కుదుటపరచుకోవాలి. ఏ వైపునకూ పరుగెత్తకుండా నిలుపుకోవాలి. మనధ్యాసంతా శ్వాస మీదకు రావాలి. కండ్లు మూసుకోవాలి. చెవులకు ఏ అరుపూ పిలుపూ సోకకూడదు. శరీరం మనసూ అంతా నీ ఆధీనంలో లోపలే ఇమిడి పోవాలి. ధ్యానం చేయాలి. యోగానే నేటి జ్ఞానం. యోగా సాధన చేస్తే ఆందోళనలుండవు. ఎన్ని విపత్తులు, సవాళ్లు ఎదురైనా కండ్లు మూసుకొని పరిష్కరించుకోవచ్చు. అవన్నీ తేలికయినవి, విలువలేనివి వదిలేయాలి. ఇప్పుడు మన నాయకులు చేస్తున్నపని అదే. నిన్న ప్రపంచ యోగా దినాన్ని




జరుపుకొన్నాం. శారీరకమైన వ్యాయామం చాలా అవసరమైనదే. ప్రాణాయామమూ ఊపిరిశక్తిని పెంచేసాధనమే ఇవన్నీ చేయవచ్చు.వాటినేమీ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ దానిచుట్టూ ఒక తాత్వికజ్ఞానంగా బోధిస్తున్న విషయాలే మూఢత్వంలోకి నెడుతాయి. ఆరోగ్య మంతా యోగాతోనే సాధ్యమనే ప్రచారం అందులో ఒకటి. ఇక ప్రశాంతంగా కూర్చుంటే సవాళ్లు, సమస్యలు పరిష్కారం కావు. బతుకు ప్రశ్నార్థకమయ్యే సమస్య ఎదురైనపుడు మనుషులకు ధ్యానం పరిష్కారమివ్వదు. దాన్ని అధిగమించే ప్రయత్నానికి పూనుకోవాల్సిందే. అనేక విధాల ఆలోచించాల్సిందే. ఇదే మానవ ప్రగతికి దారులు వేసింది.

దేశంలో ముప్పయి లక్షల మంది యువత, తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతూ, న్యాయం చేయాలంటూ రోడ్ల మీదికొచ్చి నినదిస్తుంటే, అడుగుతుంటే, ఒక్క మాటా బదులు చెప్పకుండా, మాట్లాడకుండా నిద్రాయోగ చేస్తారా నాయకుడు! కండ్లు మూసుకుని అన్యాయాలను చూడ నిరాకరించే ఆసనాలు నిజమైన ఆరోగ్య ఆసనాలు కాదు. తప్పించుకు తిరిగే ఆసనాలు మాత్రమే. పరీక్షా పేపర్లు లీకయినా, అవి లక్షల రూపాయలకు అమ్ముడుపోయి, తమ విద్యా భవిష్యత్తు అంధకారమయ మౌతుంటే విద్యార్థులు ప్రశాంతంగా ధ్యానంలో ఆసనాలు వేయాలా? తమ కలల్ని దోచుకుపోతున్న దృశ్యాల్ని చూసీ కండ్లు మూసుకోవాలా? నాయకునికి బాధ్యతలేదా!మన్‌కీ బాత్‌లో ఎన్నో మాటలు పొర్లించే వాక్చతురుడు ఒక్క మాటా ఎందుకు మాట్లాడటం లేదు? మూడోసారి అధికారంలోకి వచ్చి మాసమూ దాటలేదు. ప్రజా సమస్యలపై ఎందుకీ అశ్రద్ధ. ఎందుకీ నిర్లక్ష్యం! ప్రధాని మోడీ నిదానంగా ఆసనాలు వేస్తారు. యోగా ప్రాధాన్యాన్నీ వివరిస్తారు. కానీ, ఈ దేశ భవిష్యత్ తరాల సమస్య ప్రాధాన్యాన్ని పట్టించుకోరా? ఇది అందరూ ఆలోచించాల్సిన విషయం.

నీట్ పరీక్షా పత్రం లీకైన విషయం నిర్ధారణ అయింది. బీహార్‌లో అరెస్టయిన విద్యార్థులే చెబుతున్నారు. ఇంకో వైపు యు.జి.సి. నెట్ ప్రశ్నాపత్రం లీకైందని హోం మంత్రిత్వశాఖ పరిధిలోని సైబర్‌క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటరే తేల్చేసింది. లక్షల రూపాయలకు ప్రశ్నపత్రాలు అమ్ముడు పోయాయన్నదీ రుజువవుతున్నది. ఇన్ని లక్షల మంది విద్యార్థులూ, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటే వైఫల్యానికి బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఎన్‌టీఏపై నేరాన్ని తోసి, తాను తప్పుకోవాలని ప్రయత్నిస్తుండటం క్షమించకూడనిది. గడిచిన ఏడేండ్లలో 70 పరీక్షా పేపర్లు లీకయ్యాయి. రెండు కోట్ల మంది యువత, ఆ లీకుల వల్ల నష్టపోయారు. మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లోనే 2015-2023 మధ్య ఈ లీకులకు సంబంధించి 14 కేసులు నమోదయ్యాయి. యూపీలోనూ జరిగాయి. ఇపుడు ఎన్డీయే ప్రభుత్వం ఉన్న బీహార్‌లోనే నీట్ వ్యవహారం బయటకొచ్చింది.

మోడీ హయాంలో పరీక్షలు అభాసుపాలవుతున్నాయి. ఇది నేడొక జాతీయ సమస్యగా మారింది. విద్యాసంబంధ పరీక్షలను కేంద్రీకృతం చేసుకుని, రాష్ట్రాల హక్కులను హరించిన ఫలితమే ఈ పర్యవసానాలు. విద్యారంగాన్ని వ్యాపారమయం చేసే ప్రయివేటీకరణే ఈ అనర్థాలకు మూలకారణం. కాషాయీకరణ, ప్రయివేటీకరణ కోసం కేంద్రం తహతహలాడుతున్నది. పరీక్షలను సైతం నిఖార్సుగా నిర్వహించలేని ప్రభుత్వం ఇంకా అభివృద్ధిని ఎలా సాధించగలదు! ఇప్పటికైనా ప్రధాని పరీక్షపై చర్చ చేయాలి. ఈ లీకులకు బాధ్యత వహిస్తూ విద్యామంత్రి రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేసి, విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్రీకృత పరీక్షల విధానాన్ని ఉపసంహ రించాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లు సహేతుకమైనవి. మూడోసారి అధికారం, అమ్మకాలూ, అక్రమాలతో ఆరంభమైంది. ఈ వ్యవహారంపై ఎన్డీయే పక్షాలూ నోరువిప్పాలి. బాధ్యత వహించాలి. తెలంగాణలో కొత్తగా కేంద్ర మంత్రులయినవాళ్లూ, బీజేపీ ఎంపీలు కనీసం ఒక్కమాటా మాట్లాడటం లేదు. ఇదేమీ ప్రజల సమస్య కాదా? ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించకపోతే భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారవుతుంది. నిద్రాయోగాలిక చెల్లవని చెప్పి కండ్లు తెరిపించాలి.

రాజకీయ తీర్పు తర్వాత రాజ్యాంగ తీర్పులు?


తెలకపల్లి రవి

లోకసభకూ, ఏపీతో సహా నాలుగు శాసనసభలకూ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. అప్రతిహతంగా సాగిపోతుందనుకున్న నరేంద్రమోడీ హవాకు బ్రేకులు వేశారు ఓటర్లు. మిశ్రమ కూటమిగానే ఆయన అధికారం చేపట్టవలసి వచ్చింది.మోడీ సర్కారు ఏకపక్ష పోకడలకు ఇకనైనా కొంత పగ్గాలు పడతాయని ప్రజాస్వామిక లౌకిక వాదులు ఎదురుచూస్తున్నారు. ప్రజా న్యాయస్థానంలో పరిస్థితి ఇదైతే రాజ్యాంగ న్యాయస్థానాల్లో అంటే న్యాయవ్యవస్థలో ఏమైనా మార్పులు రావడానికి ఇది దారితీస్తుందా అనే చర్చ న్యాయవర్గాల్లో సాగుతున్నది. ఎందుకంటే సంపూర్ణమైన ఆధిక్యత లేదంటే అంతకు మించిన సంఖ్యాబలం కలిగిన ఏకపార్టీ ప్రభుత్వాలున్నప్పుడు న్యాయవ్యవస్థ ఒకింత ఆలోచించి అడుగు వేస్తుందనేది ఇన్నేళ్ల అనుభవం.నిజానికి రాజ్యాంగం న్యాయవ్యవస్థకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికీ రాజకీయ వాస్తవాలు దృష్టిలో పెట్టుకుని ఇలా జరుగుతుంటుందని అంటుంటారు.

వివాదాలు, ఆరోపణలు

రాజ్యాంగ సంబంధమైన అంశాలలో కూడా సుప్రీంకోర్టు తీర్పులు, ఆదేశాలు, ఆలస్యాలు, రకరకాల వ్యాఖ్యలకు విమర్శలకు దారితీశాయి. తెలుగు రాష్ట్రాలలోనూ వేర్వేరు ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు తమ తమ అనుకూలతలను బట్టి కోర్టులపై వ్యాఖ్యలు చేయడం తెలిసిన విషయమే. కేరళ, పశ్చిమ బెంగాల్, కర్నాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలోనూ కోర్టులపై వివాదాస్పద సన్నివేశాలు చూశాం. 1991-1996 మధ్య కాంగ్రెస్ మెజార్టీ కోల్పోయిన పరిస్థితి,తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఉన్నప్పుడే న్యాయవ్యవస్థ క్రియాశీలత వంటి పదాలు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును కూడా విచారించిన ఘట్టం అప్పుడే చూశాం.మళ్లీ 2004-14 మధ్య మన్మోహన్‌సింగ్ హయాంలో మరీ ముఖ్యంగా మలిదఫా పాలనలో 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం, కామన్వెల్త్ క్రీడలు ప్రతిదీ సుప్రీంకోర్టు ముందుకు రావడం దేశ రాజకీయాలపై ఎంతో ప్రభావం చూపింది.అదే మోడీ హయాంలో రఫేల్ కుంభకోణం వంటివి కూడా కోర్టులలో తేలిపోయాయి. అయోధ్య తీర్పు, శబరిమల వివాదం, కాశ్మీర్ 370 అధికరణం ప్రతిపత్తి, పౌరసత్వ సవరణ చట్టం, ఈవిఎంలు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేక అంశాల్లో అత్యున్నత న్యాయస్థానం తీరు అసంతృప్తిని మిగిల్చింది.రాజకీయ నేతలు, మీడియా ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ఆఖరుకు ముఖ్యమంత్రుల వంటివారిపై కేసుల్లోనూ భిన్న ప్రమాణాలు పాటించడం ప్రశ్నార్థకమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పదవులలో పునరావసం పొందిన తీరు మరో వివాదమైంది. ఈ నేపథ్యంలో బీజేపీకి స్వంతంగా మెజార్టీ లేని ప్రస్తుత పరిస్థితి న్యాయవ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఇది ఇప్పుడు,అనేకమందిని ఆలోచింపచేస్తున్న అంశం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ స్వయంగా ఈ మాటన్నారు. బలమైన కార్యనిర్వాహక వర్గం (ఎగ్జిక్యూటివ్) ఉంటే న్యాయవ్యవస్థ గట్టి వైఖరి తీసుకోవడానికి కాస్త తటపటాయిస్తుందని ఆయన అన్నారు.

సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు

సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలం ఈ నవంబర్ నెలతో ముగుస్తుంది. ఇటీవలి కాలంలో అత్యధిక కాలం పదవిలో వుంటున్న సిజెఐ ఆయనే. స్వలింగ వివాహాల వంటి సామాజికాంశాల్లో సంచలన తీర్పులకు ఆధ్వర్యం వహించిన సిజెఐ చంద్రచూడ్ రాజకీయ రాజ్యాంగ అంశాల్లో ఒక విధంగా... మిశ్రమ వ్యాఖ్యలే మూటకట్టుకున్నారు. ఇటీవలనే ఎన్నికల బాండ్లపై వెలువడిన తీర్పు ఇటీవలి కాలంలో ప్రత్యేకించి చెప్పుకోవాలి. నవంబర్ రెండవ వారంలో పదవీ విరమణ చేసేముందు ఆయన ఆరు రాజ్యాంగ సమస్యలపై తీర్పులు ఇవ్వాల్సి వుంటుంది. సిజెఐతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాల ముందున్న తీర్పులు వాయిదా పడితే మళ్లీ కొత్తవారు రావడం, వీటిని పునర్వ్యవస్థీకరించడం పెద్ద ప్రక్రియ. ఆలస్యానికి దారితీయొచ్చు.అందుకే వేగంగా పూర్తి చేస్తుంటారు.

ఎస్సీ,ఎస్టీ మైనార్టీ ప్రతిపత్తి

రాజ్యాంగం 16వ అధికరణం కింద వున్న ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణ ఉప వర్గీకరణ చెల్లుతుందా? అనే అంశాన్ని ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఫిబ్రవరిలో విచారించింది. 2010లో పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు 2004 ఏపీ వర్గీకరణ అంశంలో ఇచ్చిన తీర్పు తర్వాత పంజాబ్ విధానం అమలు కాకుండా పోయింది. అయితే ఈ విధంగా కొట్టివేయడం ఇందిరాసహానీ కేసులో1992లో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుకు విరుద్ధమని పంజాబ్ వాదిస్తున్నది. ఆ కేసు తర్వాత చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఉప వర్గీకరణ కుదరదని చెప్పింది.ఇప్పుడు దీనిపై తుది తీర్పు వెలువడవలసి వుంది.

ప్రతిష్టాత్మకమైన ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటీ రాజ్యాంగం 30వ అధికరణం ప్రకారం మైనార్టీ సంస్థ కిందకు వస్తుందా లేదా అనే అంశంలోనూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాల్సి వుంది. 2006లో అలహాబాద్ హైకోర్టు మైనార్టీ ప్రతిపత్తి కొట్టివేస్తూ ఇచ్చినతీర్పును ఎంఎయు సుప్రీంలో సవాలు చేసింది. తమ మైనార్టీ ప్రతిపత్తికి ముప్పు తెచ్చేలా ఎఎంయు చట్టానికి చేసిన వివిధ సవరణలు చెల్లవని వాదించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. రంజన్ గోగోయ్ సిజెఐగా వుండగా ఈ కేసును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించారు. ఫిబ్రవరిలో ఈ కేసు విచారణ ముగించిన ధర్మాసనం తీర్పు రిజర్వులో వుంచింది. ఈ కేసులో తీర్పు దేశవ్యాపితంగా మైనార్టీ సంస్థల హక్కులకు సంబంధించి చాలా ప్రభావం చూపనుంది.

ఆస్తుల పునఃపంపిణీ తప్పా?

మూడో కేసుకు మరింత కీలకమైన రాజకీయ ప్రాధాన్యత వుంది. నిజానికి ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో దాన్ని వివాదాస్పదం చేశారు కూడా. సంపద పునఃపంపిణీ జరగాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు.ఒక దశలో మతం రంగు కూడా పులిమారు. వాస్తవం ఏమంటే రాజ్యాంగం 39వ అధికరణం సమాజ భౌతిక వనరులను సమిష్టి ప్రయోజనం కోసం ఉపయోగించాలని చెబుతున్నది.సమాజ భౌతిక వనరులను ఉమ్మడి ప్రయోజనం కోసం పునఃపంపిణీ చేయాలని ఈ అధికరణం(బి) పేర్కొంటున్నది.అయితే వ్యక్తిగత ఆస్తిని సమాజానికి చెందిన భౌతిక సంపదగా పరిగణించవచ్చునా? అనే అంశంపై సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. ముంబాయిలోని ఆస్తి యజమానుల సంఘం పేరుతో 20వేల మంది భూయజమానులు 1991లో మొదటి పిటిషన్ వేశారు. కొన్ని ఆస్తులను తీసుకోవచ్చునని మహారాష్ట్ర శాసనసభ చేసిన సవరణను వారు సవాల్ చేశారు. ఇది ఇలా వుండగానే 2019లో మళ్లీ మహారాష్ట్ర ప్రభుత్వమే గృహ చట్టానికి సవరణ చేస్తూ నిర్ణీత గడువులోపల ఆస్తి యజమానులు గనక ఆస్తిని పునరుద్ధరించకపోతే ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకోవచ్చని నిర్ణయించింది. ఈ సవరణ వల్ల నివాస గృహ సముదాయాలను హస్తగతం చేసుకోవడానికి మహారాష్ట్ర భవన మరమ్మతులు పునరుద్ధరణ బోర్డుకు నిర్నిబంధమైన అధికారాలు సంక్రమిస్తాయంటూ వారు ఆరోపించారు. ప్రయివేటు ఆస్తులు నిజంగా 39(ఎ) అధికరణం కింద పునఃపంపిణీ చేయడానికి అవకాశం వుంటుందా అనే అంశంపై ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వాల్సివుంది. ఇక్కడ మౌలికమైన అంశం ఏమంటే రాజ్యాంగం, సంక్షేమ రాజ్యభావనలో ఆర్థిక అసమానతల తొలగింపు కీలకాంశం.మోడీ వంటి వారు మాత్రం ఇదేదో వ్యక్తిగత ఆస్తి హక్కుకు భంగకరమన్నట్టు ప్రచారం చేసి అదరగొట్టడానికి ప్రయత్నించారు. మన దేశంలో కూడా ఇటీవలి వరకూ ఈ సంపద పన్ను,వారసత్వ ఆస్తి పన్ను వుండేవి. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ముంబాయి కేసుకే గాక దేశ విధానాలకే గీటురాయి కానుంది.

గనులు, ఆల్కహాలు

ఇక మిగిలిన రెండు రాజ్యాంగ కేసులు రాష్ట్ర, కేంద్ర హక్కులకు ఆదాయాలకు సంబంధించినవి. పారిశ్రామిక ఆల్కహాలు,మద్యపానం పరిధి గురించిన చర్చ ఇది. పారిశ్రామిక ఆల్కహాలుపై నియంత్రణ ఎవరిదనేది ప్రశ్న. ఇవి రెండూ స్పిరిట్ నుంచే తయారవుతాయి. మరిన్ని రసాయన ప్రక్రియల తర్వాత అది పారిశ్రామిక ఆల్కహాలుగా మారుతుంది. ఏడవ షెడ్యూలులో ఈ రెంటినీ వుంచడం పరస్పర విరుద్ధ వ్యాఖ్యానాలకు దారితీస్తున్నది. ప్రజా క్షేమం రీత్యా పరిశ్రమలపై నియంత్రణ చేసే హక్కు కేంద్రానికి వుంది. మరోవైపున ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే విషపదార్థాల నియంత్రణ రాష్ట్ర అధికారంగా వుంది. దాంతో ఎవరు అదుపు చేయాలనే దానిపై వివాదం కొనసాగుతున్నది. సిజెఐ చంద్రచూడ్ ధర్మాసనం దీన్ని విచారించి తేల్చవలసి వుంది.

గనుల నుంచి లోహాల తవ్వకంపై చెల్లించే రాయల్టీ పన్ను కిందకు వస్తుందా అనేది కూడా 25 ఏళ్ల కాలంగా వివాదంగా వుంది. గనులు లోహాల చట్టం సెక్షన్9 వాటిని తవ్వుకునేవారు కేంద్రానికి రాయల్టీ చెల్లించాలని నిర్దేశిస్తుంది. దాన్ని గనక పన్నుగా పరిగణించేట్టయితే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పన్ను విధించవచ్చు. 1963లో తమిళనాడు ప్రభుత్వం ఇండియా సిమెంట్స్‌పై రాయల్టీ గాక అదనపు పన్ను విధించడంతో ఈ వివాదం మొదలైంది. దానిమీద వరుసగా విచారణలు జరిపిన అనంతరం 1989లో సుప్రీం కోర్టు రాయల్టీ ఒక పన్ను అని నిర్ధారించింది. ఈ నిర్ణయం గనుల కాంట్రాక్టర్లకు పారిశ్రామిక వేత్తలకు మింగుడు పడలేదు. వారు అనేక హైకోర్టులలోనూ సుప్రీంలోనూ సవాలు చేయగా అదేదో అనుకోకుండా జరిగిన అచ్చుతప్పు వంటిదని అభిప్రాయం వెలిబుచ్చాయి. అదనపు పన్నును గురించి మాత్రమే కోర్టు పరిశీలించింది తప్ప రాయల్టీని ఉద్దేశించి తీర్పు చెప్పలేదని వివిధ కోర్టులు వ్యాఖ్యానించాయి. ఇది పన్ను అని తేలిస్తే రాష్ట్రాలు దాన్ని పెంచి ఆదాయం పెంచుకోవడానికి వీలవుతుంది.అసలే వనరుల కొరతతో ఇబ్బంది పడే రాష్ట్ర ప్రభుత్వాలకు కాస్త వెసులుబాటు దక్కుతుంది. కొంతకాలం కిందట దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది ధర్మాసనం తీర్పు రిజర్వు చేసి వుంచింది.

మరింత జటిలం

వీటన్నిటిపై ప్రజాస్వామిక పరిష్కారాలు వస్తాయా అని ఎదురు చూస్తుంటే పులిమీద పుట్రలా కొత్త వివాదాలు బయలుదేరాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను లిక్కర్ కేసులో కింద కోర్టు బెయిలుపై విడుదల చేస్తే ఢిల్లీ హైకోర్టు విడుదల ఆపింది.కానీ పాస్కో కేసులో కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పను అరెస్టు చేయాలని కింద కోర్టు ఉత్తర్వులిస్తే మాజీ ముఖ్యమంత్రి విషయంలో అలా ఎలా చెప్తారని హైకోర్టు ఆపేసింది. ఈ ద్వంద్వనీతిని న్యాయ నిపుణులు తీవ్రంగా ప్రశ్నించారు.లోక్‌సభ ఫలితాలు వచ్చాకనే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్‌పై రాజద్రోహ నేరారోపణ విచారణ జరపాలని అనుమతినివ్వడం కూడా నిరసనకు గురైంది. నేరచట్టాలను ఇష్టానుసారం మార్చి అమలు కోసం హడావుడి పడటం కూడా ఆక్షేపణకు దారితీస్తున్నది. అందుకే రానున్న రోజుల్లో ఈ అంశాలు దేశంలో మరింత చర్చనీయం కానున్నాయి. కార్యాచరణకూ దారితీస్తాయి. ■



1991-1996 మధ్య కాంగ్రెస్ మెజార్టీ కోల్పోయిన పరిస్థితి,తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఉన్నప్పుడే న్యాయవ్యవస్థ క్రియాశీలత వంటి పదాలు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును కూడా విచారించిన ఘట్టం అప్పుడే చూశాం.మళ్లీ 2004-14 మధ్య మన్మోహన్‌సింగ్ హయాంలో మరీ ముఖ్యంగా మలిదఫా పాలనలో 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం, కామన్వెల్త్ క్రీడలు ప్రతిదీ సుప్రీంకోర్టు ముందుకు రావడం దేశ రాజకీయాలపై ఎంతో ప్రభావం చూపింది.అదే మోడీ హయాంలో రఫేల్ కుంభకోణం వంటివి కూడా కోర్టులలో తేలిపోయాయి. అయోధ్య తీర్పు, శబరిమల వివాదం, కాశ్మీర్ 370 అధికరణం ప్రతిపత్తి, పౌరసత్వ సవరణ చట్టం, ఈవిఎంలు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేక అంశాల్లో అత్యున్నత న్యాయస్థానం తీరు అసంతృప్తిని మిగిల్చింది.

మూడో కేసుకు మరింత కీలకమైన రాజకీయ ప్రాధాన్యత వుంది. నిజానికి ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో దాన్ని వివాదాస్పదం చేశారు కూడా. సంపద పునఃపంపిణీ జరగాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు.ఒక దశలో మతం రంగు కూడా పులిమారు. వాస్తవం ఏమంటే రాజ్యాంగం 39వ అధికరణం సమాజ భౌతిక వనరులను సమిష్టి ప్రయోజనం కోసం ఉపయోగించాలని చెబుతున్నది.సమాజ భౌతిక వనరులను ఉమ్మడి ప్రయోజనం కోసం పునఃపంపిణీ చేయాలని ఈ అధికరణం(బి) పేర్కొంటున్నది.అయితే వ్యక్తిగత ఆస్తిని సమాజానికి చెందిన భౌతిక సంపదగా పరిగణించవచ్చునా? అనే అంశంపై సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి.

నీవు నేర్పిన విద్యయే కదా..?

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ముందు నేతల గోడ దూకుళ్లు, జంప్ జిలానీలు ఓ రేంజ్‌లో కొనసాగాయి. హమ్మయ్య... ఈ రెండు ఎలక్షన్లు అయిపోయాయి కాబట్టి, ఏ గూటిలో పక్షి ఆ గూటిలో ఉంటుందనుకుంటే ఇప్పుడు అంతకు మించిన స్పీడుతో లీడర్లు పార్టీలను ఫిరాయిస్తుండటం సదరు నాయకాగ్రేసురులపై నమ్మకం పెట్టుకున్న నేతలకు మింగుడు పడటం లేదు. తాజాగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఉదంతమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఆయనతోపాటు మరికొంత మంది గులాబీ ఎమ్మెల్యేలు గోడ దూకేం దుకు రెడీగా ఉండటం నిజంగా ఆ పార్టీకి చేదు గుళికే. అయితే అలాంటోళ్లను చేర్చుకుంటున్న అధికార కాంగ్రెస్ మాత్రం.. ఈ చేరికలకు మాకు స్ఫూర్తి ప్రదాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని చెబుతోంది. ఈ విషయంలో ఆయనే మాకు మార్గదర్శి అంటూ వేనోళ్ల పొగడ్తలతో ముంచెత్తుతోంది. గత పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో 2014లో ప్రజలు ఆ పార్టీకి 63 సీట్లిచ్చి అధికారాన్ని కట్టబెట్టారు. 2018లో ముందస్తు ఎన్నికల్లో 88 సీట్ల దాకా ఇచ్చి గద్దెనెక్కించారు. కానీ ఆ సంఖ్యాబలం చాలదన్నట్టు ఆ పార్టీ బాస్... కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఇబ్బడి ముబ్బడిగా ఎమ్మెల్యేలను తీసుకుని 'కారె'క్కించారు. ఆయన గారి దెబ్బకు ఆఖరికి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఆ హోదా దక్కకుండా పోయింది. 'ఫ్రెండ్లీ పార్టీ...' (ఇప్పుడు ప్లేటు ఫిరాయించి కాంగ్రెస్‌తో జతకట్టింది అనుకోండి...) అయిన ఎంఐఎం ఆ స్థానాన్ని ఆక్రమించింది. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఇతర పార్టీల నుంచి అరువొచ్చిన లీడర్లతో కారుకు ఓవర్‌లోడ్ అయ్యింది. ఆ బరువును మోయలేక మొన్నటి అసెంబ్లీ, నిన్నటి పార్లమెంటు ఎన్నికల్లో కారు బోల్తా కొట్టింది. ఇవన్నీ గుర్తుచేస్తూ ఓ లీడర్ అన్నమాటేంటంటే.. 'నీవు నేర్పిన విద్యయే కదా.. నీరజాక్షా..? అన్న చందాన అప్పుడు కేసీఆర్ ప్రతి పక్షాలు లేకుండా చేయాలని అనుకున్నారు..ఇప్పుడు రేవంత్ అదే బాటలో నడుస్తున్నారు...' అని...

-బి.వి.యన్.పద్మరాజు

తప్పెవరిది?

ఈ మధ్యన సోషల్ మీడియాలో కనిపించిన ఓ పోస్ట్ నన్ను బాగా ఆకట్టుకుంది. 'బిచ్చగాళ్లకు డబ్బులివ్వకండి. ఆహారం బట్టలు మాత్రమే ఇవ్వండి. డబ్బులిస్తే బిచ్చగాళ్లు పెరిగిపోతారు. అనాథలు, దురలవాట్లకు బానిసలైన వారిని చేరదీసి బిచ్చగాళ్లుగా తయారు చేస్తున్నారు. ఇలాంటి ముఠాలు దేశ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను కొనసాగిస్తున్నాయి. తస్మాత్ జాగ్రత్త...' అని ఆ పోస్ట్ సారాంశం. 'ముంబాయి, ఢిల్లీ లాంటి మహా నగరా ల్లో ఈ ప్రచారం ఊపందుకుంది. మీరు కూడా సామాజిక బాధ్యతగా మరింతగా ప్రచారంలోకి తెచ్చి బిచ్చగాళ్లను తయారు చేసే ముఠాల ఆట కట్టించే ఉద్య మంలో బాగస్వామ్యంకండి'అనే ఈ పోస్ట్ ఆసక్తిగా, ఆలోచన రేకెత్తించేదిగా ఉంది. అదే సందర్భంలో నా మస్తిష్కంలో అనేక ప్రశ్నలు తలెత్తాయి. బిచ్చగాళ్లెందుకు తయారవుతున్నారు? నిజంగానే వారిని తయారు చేస్తున్నారా? విధి వంచితులై తయారవుతున్నారా? ఈ సమస్య పట్ల క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నాకనిపించింది. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో జైళ్ల శాఖ డీజీగా ఉన్న వినయ కుమార్ సింగ్ అనే ఓ ఐపీఎస్ అధికారి హైదరాబాద్‌లో బిచ్చగాళ్ల పునరావాసానికి పెద్ద ఎత్తున కృషి చేశారు. జైళ్ల శాఖ తరపున ఆనందా శ్రమం పెట్టి వారిని చేరదీసారు. కుటుంబాలు తమకు భారమయ్యారని నెట్టేసిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని తిరిగి ఇండ్లకు పంపించారు. ముక్కు సూటిగా ఉండే ఆయన్ను గత సర్కార్ భరించలేక.. స్వతహాగా వీఆర్ఎస్ తీసుకుని వెళ్లేలా చేసింది. ఆ తర్వాత ఆయన ప్రారంభించిన ఆనందాశ్రమం ఆగిపోయింది. నగరంలోని రోడ్లపై బిచ్చగాళ్ల తాకిడి మళ్లీ ఎక్కు వైంది. కారణం ఏదైనా కాని, ఆ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన బాధ్యత ఎవరిది. సమాజానిదా? ప్రభుత్వానిదా? తప్పెవరిది? ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- ఊరగొండ మల్లేశం

ఇన్‌సైడర్

'తెల్లనివన్నీ పాలు కాదు...చెప్పేవన్నీ నిజాలు కావు' అనే నానుడి సాధారణంగా వినే ఉంటాం. ఇది కచ్చితంగా రాజకీయ నాయకులకు సరిపోతుంది. పైకి బల్లగుద్ది చెప్పినా...లోపల రాజకీయం ఎవరికి అర్థం కాకుండా ఉంటుంది. ఎన్నికల్లోనైతే అంతు పట్టని ఎత్తులు వేస్తారు. అది జరిగాక ముక్కమీద వేలుసుకుంటాం. కానీ కాంగ్రెస్ మార్క్ రాజకీయం అంతుచిక్కని విధంగా ఉంటుంది. ప్రజలకు ఎన్ని ఉపన్యాసాలు దంచినా, రాజకీయ శత్రువు నిర్మూలన పక్కా వ్యూహాత్మంగా చేస్తుందని పేరుంది. కాలం కలిసి రాక, బీజేపీ ప్రమాదాన్ని గుర్తించక బొక్కబోర్ల పడింది కానీ ముందు చూపు ఉంటే బీజేపీని తొక్కిపెట్టేదని కొంతమంది పెద్దలు చెబుతున్నారు. అందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నప్పటికీ అప్పట్లో రాజకీయ సంచలనంగా మారిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాల్సి ఉంటుంది. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మర్రి చెన్నారెడ్డి కాంగ్రెస్‌తో విభేదించి తెలంగాణ ప్రజా సమితి ఏర్పాటు చేశారు. అప్పట్లో కాంగ్రెస్‌ను వ్యతిరేకించడమంటే సాదాసీదా విషయం కానేకాదు. అటువంటిది మర్రి చెన్నారెడ్డి పెద్ద తురుంకాడు అన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలిస్తున్న వారి కోసం త్యాగధనుడిగా నిలబడ్డాడు అని వేనోళ్ల పొగిడారు. దీని వెనకాల ఇన్‌సైడర్ ఇందిరా గాంధీ అన్ని అప్పట్లో ఎవరికి తెలియదు. ఇందిరాగాంధీ, మర్రి చెన్నారెడ్డి ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌పై ఆయన తిరుగు బాటు జెండా ఎగురవేశారని తర్వాత తెలిసింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ పెట్టి పదహారు మంది ఎంపీలు గెలువగానే కాంగ్రెస్‌లో కలిపారు. ఆ తర్వాత తెలంగాణ కల సాధించేం దుకు తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుచేసిన కేసీఆర్... ఉద్యమ పార్టీ అని చెప్పి నమ్మించి, రాష్ట్రం ఏర్పడగానే దాన్ని రాజకీయ పార్టీగా మార్చారు.మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు కలరింగ్ ఇచ్చారు. కానీ ఇన్‌సైడర్ అది కాదు. తన వయసు అయిపోతుంది. కుమారుడికి మంచి రాజకీయ భవిష్యత్తు ఇచ్చి పుత్రోత్సవాన్ని చాటుకునేందుకు హస్తం గూటికి చేరాడు. రాజకీయాల్లో ఒక్కొక్క ఘటన వెనకాల ఏదో ఒక బలమైన కారణం ఉంటుంది. లోతుగా పరిశీలిస్తేనే వాస్తవాలు తెలుస్తాయి.

- గుడిగ రఘు

మోడీ 3.0

నజర్

"చూశావా! నా మోడీ పవర్! 3.0 అప్‌డేటేడ్!" అన్నాడు చారి. భార్య అందించిన చాయి కప్పు అందుకుంటూ.

"3.0. అంటే ఏమిటీ? ఆప్‌డేటెడెట్ ఏమిటీ? నాకేమీ అర్థం కావటం లేదు!" అన్నది వాణి తానూ చాయి కప్పు అందుకొని.

"నా మోడీ మూడోసారి వరసగా గెలవటమే కాదు. మూడోసారి ప్రధాని కూడా అయ్యి రికార్డు స్థాపించాడు. అందుకే 3.0. అంటున్నాం. ఇది కూడా అర్థం కావటం లేదంటే నీవెంత వెనకపడి ఉన్నావో అర్థం అవుతూనే ఉంది!" అన్నాడు చారి నవ్వుతూ.

"నేను వెనకపడ్డ మాట నిజమే! కాని దానికి కారణము ఎవరో మీకే బాగా తెలుసు! అది తర్వాత మాట్లాడుదాం! ఇంతకీ 3.0. ప్రత్యేకత ఏమిటో కాస్త చెప్పండీ!" అడిగింది వాణి.

"3.0. స్పెషల్ ఏమిటో ఇప్పటికే ఫస్ట్‌రీల్ చూపించాడు. నువ్వింకా చూడలేదా? అందుకే నిన్ను వెనకబడ్డావని అనేది! సర్లే

"నా మోడీ ఎన్నికలు కాగానే ఇటలీ వెళ్లి అక్కడ జీ7 నాయకులతో కలిసి ఫొటోలు దిగాడు తెలుసా? అన్నాడు చారి గర్వంగా.

"అదేంటీ ఎన్నికలు కాగానే యువరాజు రాహుల్ ఇటలీ వెళతాడని మోడీనే ఎడంచేత్తో చప్పట్లు కొట్టి మరీ చెప్పాడు. ఇప్పుడేమో తానే వెళ్లాడా? పోన్లెండి వెళ్లనైతే వెళ్ళాడుగాని, జీ7లో భారత్‌కు సభ్యత్వం లేదు కదా! మీరు చెప్పినట్లు జీ7 నాయకులు దిగిన గ్రూప్‌ఫొటోలో మోడీ లేరు కదా!" అడిగింది వాణి.

"ఆహ్హాహ్హా! మోడీ అంటే విశ్వగురు, ప్రపంచ నాయకుడు. ఆయనతో ఫొటోలు దిగాలంటే అదృష్టం ఉండాలి! అందుకే ఒక్కో దేశ నాయకుడిని పిలిచి విడివిడిగా ఫొటోలు దిగి, వారిని సంతోష పెట్టాడు. అందుకే గ్రూప్‌ఫొటోలో ఆయన లేరు! ఆయన గొప్పతనం అర్థం చేసుకో!" అన్నాడు దిలాసాగా చారి.

"నిజమేనండి! మోడీ గొప్పతనం అర్థం చేసుకోవాలంటే చాలా కష్టం! అవునూ.. ఇలా విదేశీ పర్యటనలు చేసినపుడు, దేశ నాయకులను కలసినపుడు ఏవో ఒప్పందాలు రాసుకుని వాటిలో సంతకాలు చేస్తూ, వాటిని పరస్పరం ఇచ్చుకుంటూ, గత సాదా, సీదా ప్రధానులు ఫొటోలు దిగేవారు! ఇప్పుడేమో ఖాళీ చేతులు ఊపుకుంటూ ఫొటోలు దిగారు! మోడీ 3.0లో ఒప్పందాలు లేవా?" అమాయకంగా అడిగింది వాణి.

"అదే చెబుతున్నా! మోడీతో ఒప్పందాలు చేసుకోవాలంటే కూడా ఆయా దేశాధినేతలకు కూడా అదృష్టం ఉండాలి! జీ7 దేశాల అధినేతల దురదృష్టానికి నేనేం చేయలేను!" అన్నాడు చారీ గంభీరంగా.

"నిజమే! వారి ఖర్మకు మీరు మాత్రం ఏం చేస్తారు! ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయుల పిల్లలను భారత్‌కు తీసుకుని రావటానికి, ఉక్రెయిన్, రష్యా అధినేతలతో మాట్లాడి యుద్ధాన్ని ఆపించి మరీ పిల్లల్ని భారత్‌కు మోడీ రప్పించారట కదండీ!" అడిగింది వాణి.



"చూశావా! నాలుగుసార్లు మోడీ నామస్మరణ చేశావు. నీ జ్ఞాపకశక్తే పెరిగింది! ఉక్రెయిన్-రష్యా యుద్ధమే కాదు! ఏ యుద్ధమైనా సరే మోడీ ఆపగలడు. అసలింతకూ మూడవ ప్రపంచ యుద్ధం 2014 నుండీ ఇప్పటి వరకు జరగలేదంటే కారణం మోడీ! ఇది తెలుసుకో!" అన్నారు చారి ఛాతి ఉప్పొంగుతుండగా.

"అవునండీ! మోడీ అంత సమర్థుడే! కానీ నాదో డౌటు తీర్చండి!" అంది వాణి.

"అడుగు!" అన్నాడు చిద్విలాసంగా చారి.

"ఎక్కడో జరుగుతున్న పెద్ద పెద్ద యుద్ధాలు ఆపగల సామర్థ్య మున్న మోడీ, భారత్‌లో జరుగుతున్న నీట్, నెట్ లీకేజీలను ఆపలేక పోతున్నా రెందుకు?" అడిగింది వాణి.

"మోడీ అంతటి నాయకుడికి ఇదేం పెద్ద లెక్కకానే కాదు!" అన్నాడు చారీ బింకంగా.

"నీట్‌లో 23 లక్షల 33 వేల మంది పిల్లలు పరీక్ష రాశారు. మరో పదొకొండు లక్షల మంది నెట్ పరీక్ష రాశారు. మొత్తం కలిసి 34 లక్షల మంది భవిష్యత్ సంబంధించిన విషయం లెక్కలోకి రావటం లేదా?" అందుకేనా ఇంత వరకు ప్రధాని నోరెత్తి మాట్లాడలేదు?" అడిగింది వాణి.

"మంత్రులు చర్య తీసుకుంటామని ప్రకటించారు కదా!" అన్నాడు బింకంగా చారి.

"మంత్రులా! వారంతా మట్టి బొమ్మలు! వారి మాటలు నీటిమీది రాతలు! పదో తరగతి పరీక్షలు ఎలా రాయాలో పరీక్షాపై చర్చ జరుపుతారు!(a+b)2లో 2ab ఎట్లా వస్తుందో వివరంగా తెలుపుతారు! కాని నీట్, నెట్ పేపర్లు లీకై లక్షలాది మంది రోడ్ల మీద పడితే మాత్రం నోరెత్తి మాట్లాడరు! ఎందుకు?" ప్రశ్నించింది వాణి.

భార్య మాటలకు చారి బుర్ర గిర్రున తిరిగింది!

"మన్‌కీ బాత్ అనీ, చర్చా అనీ మైకుల ముందు ఒంటరిగా గంటలకొద్దీ ప్రసంగించే మోడీ శవాలు గంగలో కొట్టుకొని పోయినప్పుడు నోరెత్తలేదు. ఒడిషాలో మూడు రైళ్లు ఢీకొంటే మాట్లాడలేదు. ఇప్పుడు నీట్, నెట్ పేపర్లు లీకైతే నోరెత్తి మాట్లాడరు! కాని నలంద విశ్వవిద్యాలయంలో పుస్తకాలు ఎవరు తగలబెట్టారో దగ్గరుండి చూసినట్లు ఉపన్యసిస్తారు! ఇదేనా అప్‌గ్రేడెడ్ వెర్షన్!" నిలదీసింది వాణి.

భార్య జ్ఞాపకశక్తికి, విజ్ఞానానికి చారికి నోరు పెగలటం లేదు!

"ఎవరైనా ఒక పదవిలో ఉన్నప్పుడు, బాధ్యతగా వ్యవహరించాలి! మోడీ 1.0లో, 2.0లో, ఇప్పుడు 3,0లోగాని బాధ్యత అన్నది ఏ కోశాన కనబడటం లేదు! ఇంతపెద్ద దేశానిక ప్రధానిగా ఉన్న వ్యక్తి సరైన నిర్ణయాలు తీసుకోవాలి, సక్రమంగా అమలు చేయాలి! ఒక్కటైనా సరైన నిర్ణయం తీసుకున్నారా? పెద్దనోట్ల రద్దు, కోవిడ్ లాక్‌డౌన్, బ్లాక్‌మనీ, చట్టాల మార్పు ఇలా ఒక్కటీ సరైన నిర్ణయం కాదు! కేంద్ర సంస్థలన్నీ 2014 నుండి ఒక్కోటీ శక్తులుడిపోతున్నాయి. ఈడితో మొదలు పెడితే నీట్, నెట్ వరకు వచ్చాయి! ఇంకా ఎన్ని సంస్థలు నాశనం చేస్తారు? బాధ్యతుండక్కర్లా?" గద్దించింది వాణి.

చారి కండ్లు తిరిగి పడిపోయాడు.

- ఉషాకిరణ్

ఎదురీత తప్పదా?

మోడీకి సవాలు విసురుతున్న ప్రతిపక్షం

- అప్పటి ఆటలు సాగబోవని స్పష్టీకరణ
- లోక్‌సభ సమావేశాల కోసం అస్త్రశస్త్రాలతో సిద్ధం
- కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయం

పదమూడు సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలు ప్రధానిగా తిరుగులేని అధికారాన్ని చెలాయించిన నరేంద్ర మోడీ ఇప్పుడు తొలిసారిగా రాజకీయాల్లో పోటీని ఎదుర్కోక తప్పడం లేదు. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతున్న 18వ లోక్‌సభ సమావేశాల్లో ఆయనకు ఈ పోటీ ఎదురు కాబోతోంది. మిత్రపక్షాల పుణ్యమా అని దిగువ సభలో ఎన్డీఏకు మెజారిటీ ఉన్నప్పటికీ సమధికోత్సాహంతో ఉన్న ఇండియా కూటమి మోడీ ప్రభుత్వాన్ని ఢీకొనడానికి సిద్ధమవుతోంది. గతంలో గుజరాత్ శాసనసభలో కానీ లేదా దేశ రాజధానిలో కానీ మోడీ, ఆయన నేతృత్వంలోని బీజేపీ ఎన్నడూ ఇలాంటి సవాలును రుచి చూడలేదు.



ఇక ఆ ఆటలు సాగవు

న్యూఢిల్లీ : గత డిసెంబరులో 146 మంది ప్రతిపక్ష సభ్యులను మూకుమ్మడిగా ఉభయ సభల నుండి సస్పెండ్ చేసో లేదా బహిష్కరించో వారి గొంతుకలను అణచివేశారు. కానీ ఇప్పుడది సాధ్యం కాదు. గతంలో పార్లమెంటులో ప్రతిపక్షాలను లేకుండా చేసి అనేక కీలకమైన బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదింపజేసుకున్నారు. క్రిమినల్ చట్టాలే దీనికి ఉదాహరణ. ఇప్పుడు ఆ మూడు క్రిమినల్ చట్టాలు వచ్చే నెల 1వ తేదీ నుండి అమలులోకి రాబోతున్నాయి. ఇకపై ఆ ఆటలు సాగబోవని ఇండియా కూటమి నేతలు తేల్చి చెబుతున్నారు.

గత పది సంవత్సరాల మోడీ హయాంలో రైతుల ఉద్యమం మినహా అనేక ఆందోళనలు, నిరసనలు విజయం సాధించలేకపోయాయి. వాటన్నింటినీ కేంద్రం ఉక్కుపాదంతో అణచివేసింది. ఇప్పుడు ప్రతిపక్షాలు బలం పుంజుకోవడంతో అలాంటి ఏకపక్ష చర్యలు సాధ్యం కాకపోవచ్చు. ఈ సంవత్సరం చివరలో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌లోనూ, వచ్చే ఏడాది జనవరిలో ఢిల్లీలోనూ, సెప్టెంబరులో బీహార్‌లోనూ జరగబోయే శాసనసభ ఎన్నికలు మోడీకి అగ్నిపరీక్షగా నిలవబోతున్నాయి. మోడీ ప్రతిష్ట మసకబారుతున్న నేథ్యంలో ఈ ఎన్నికలు బీజేపీకి కీలకం కాబోతున్నాయి.

ఆ మాట నిజమే

ఇకపై అన్ని బిల్లులను పూర్తిగా కూలంకషంగా చర్చించిన తర్వాతే ఓటింగుకు పెట్టాల్సి ఉంటుందని ప్రతిపక్షాలు స్పష్టం చేస్తున్నాయి. పార్లమెంటరీ కమిటీలు కూడా నూతన జవసత్వాలు సంతరించుకోబోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నూతన స్పీకర్ నిర్వహించే పాత్ర ఎంతో కీలకమని అర్థమవుతోంది. బీజేపీకి సులభంగా, భారీ మెజారిటీ లభిస్తుందని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వేసిన అంచనా తప్పింది. అయితే ఆయన వేసిన మరో అంచనా నిజం కాబోతోంది. బీజేపీకి భారీ ఆధిక్యత లభించినప్పటికీ ప్రతిపక్షం నుండి తీవ్రమైన వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని ఆయన తెలిపారు.

ఆ మూడు అంశాలపై నిలదీస్తాం

ప్రతిపక్షాలు ఇప్పటికే తమ కత్తులకు పదును పెడుతున్నాయి. పరీక్ష పత్రాల లీకేజీలు, అగ్నిపథ్ పథకం, మణిపూర్ హింస...ఈ మూడు అంశాలపై ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే సూచనప్రాయంగా ఈ విషయాన్ని తెలియజేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందే అగ్నిపథ్ కార్యక్రమాన్ని సమీక్షించిందని వార్తలు వచ్చాయి. అయితే ఈ పథకాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం మినహా తమకు ఏదీ సమ్మతం కాదని ప్రతిపక్షం స్పష్టం చేస్తోంది. ఇక పరీక్ష పత్రాల లీకేజీపై విద్యా శాఖ ఇప్పటికే వెనక్కి తగ్గింది. బాధ్యతను అంగీకరిస్తూ సమీక్షలు, విచారణలకు ఆదేశించింది.

మణిపూర్‌లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. ఆ ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో కన్పించింది. రాష్ట్రంలోని రెండు లోక్‌సభ స్థానాలనూ కాంగ్రెస్ గెలుచుకుంది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మాత్రం తన వైఫల్యాన్ని అంగీకరించడం లేదు. కానీ మోడీ ప్రభుత్వం ఇకపై ఆ రాష్ట్ర వ్యవహారాలపై దృష్టి సారించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రతిపక్ష నేత పదవిని స్వీకరిస్తే...

ఇప్పుడు పార్లమెంట్ విషయానికి వద్దాం. ప్రతిపక్ష నేత పదవిని చేపట్టడానికి రాహుల్ గాంధీ అంగీకరిస్తే కీలక పదవుల్లో నియామకాలకు సంబంధించి ఆయనకు కూడా రాజ్యాంగబద్ధమైన హక్కులు ఉంటాయి. ప్రధాని సరసన కూర్చొని ఆయా అధికారుల ఎంపికలో భాగస్వామి కావచ్చు. సీబీఐ, కేంద్ర విజిలెన్స్ కమిషన్, ఎన్నికల కమిషన్ సహా పలు పదవులకు సంబంధించిన నియామకాల్లో ఆయన మాటకు విలువ ఉంటుంది. మోడీతో కలిసి టీ తాగే అవకాశమూ లభిస్తుంది.

రాజ్యసభలోనూ సవాళ్లు తప్పవా ?

ఇక రాజ్యసభలోనూ బీజేపీకి సవాళ్లు తప్పేలా లేవు. అయితే అవి లోక్‌సభలో ఉన్నంత తీవ్రంగా మాత్రం ఉండకపోవచ్చు. ఇప్పటి వరకూ పెద్దల సభలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ, ఒడిషాకు చెందిన బీజేడీ పార్టీలు బీజేపీకి అవసరం వచ్చినప్పుడల్లా మద్దతు ఇచ్చాయి. వివాదాస్పద బిల్లుల ఆమోదానికి సహకరించాయి. ఢిల్లీలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వ అధికారాలకు కత్తెర వేస్తే సమర్థించాయి. అయితే ఇకపై ఆ పరిస్థితులు ఉండబోవు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇప్పుడు ఎన్డీఏ భాగస్వాములు. ఒడిషాలో బీజేపీ స్వతంత్రంగానే పోటీ చేసింది. నిన్నటి వరకూ ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో ఉన్నాయి. ఇప్పుడు కూడా బీజేపీ వాటి మద్దతు తీసుకుంటుందా లేదా అనేది చూడాల్సి ఉంది. బీజేపీ లేదా దాని మిత్రపక్షాల చేతిలో ఆ పార్టీలు ఓటమి చెందిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయ సమీకరణలు మారిపోయాయి.

వార్తల కోసం సోషల్ మీడియా పైనే ఆధారం

50 శాతం మందికి పైగా భారతీయుల మనోగతం

- ప్రధాన స్రవంతి మీడియాపై క్షీణిస్తున్న నమ్మకం
- 'రాయిటర్స్' నివేదిక



న్యూఢిల్లీ : ఒకప్పుడు వార్తలంటే రేడియో, టీవీలలోని పలు వార్త ఛానెళ్లు, వార్త పత్రికల మీదనే ప్రజలు ఆధారపడేవారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు డిజిటలైజేషన్ రాజ్యమేలుతున్నది. దీంతో ప్రజల్లో సామాజిక మాధ్యమాల వినియోగం క్రమంగా పెరిగిపోయింది. మొదట్లో, సామాజిక మాధ్యమాలను కేవలం ఆటవిడుపు కోసం వాడేవారు. అయితే, ఇప్పుడా సామాజిక మాధ్యమాలు వార్తా ప్రసార మాధ్యమాలుగా మారాయి. ముఖ్యంగా, భారత్ వంటి దేశంలో 50 శాతం మందికి పైగా ప్రజలు వార్తల కోసం సోషల్ మీడియా పైనే ఆధారపడుతుండటం గమనార్హం. భారత్‌లోని ప్రధాన స్రవంతి మీడియాపై ప్రజలలో నమ్మకం క్షీణిస్తున్నది. రాయిటర్స్ ఇన్స్టిట్యూట్ '2024 డిజిటల్ న్యూస్' నివేదిక ఈ విషయాలను కనుగొన్నది. ఇది చాలా మంది భారతీయులను వార్తల కోసం వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, మెసేజింగ్ యాప్‌లపై ఆధారపడేలా ప్రేరేపించిందని వివరించింది.

రాయిటర్స్ ఇన్స్టిట్యూట్ చేసిన సర్వే చేసి రూపొందించిన నివేదిక ప్రకారం.. దాదాపు సగం మంది మంది భారతీయులు యూట్యూబ్ (54 శాతం), వాట్సాప్ (48 శాతం) ఉపయోగిస్తున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్ వంటి ప్రముఖ సామాజిక మాధ్యమాలు కొంత వరకు తమ ఆదరణను కోల్పోతున్నాయి. పెరుగుతున్న తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు, విశ్వసనీయతలో రాజీపడటం, రాజకీయ నాయకులకు లొంగటం, అనిశ్చిత వ్యాపార వాతావరణం వంటి కారణాలతో ప్రధాన స్రవంతి వార్తా మాధ్యమాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సవాలును ఎదుర్కొంటున్నాయి. సోషల్ మీడియా నుంచి వచ్చే తీవ్రమైన పోటీ కారణంగా జర్నలిస్టుల తొలగింపు, మీడియా సంస్థల మూసివేత, పెరుగుతున్న వ్యయాలు, పడిపోతున్న ప్రకటనల ఆదాయాలు వంటి కోతలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి.

అనేక దేశాల్లో, ముఖ్యంగా యూరప్, యునైటెడ్ స్టేట్స్ వెలుపల వార్తల కోసం ఫేస్‌బుక్ వినియోగంలో గణనీయమైన క్షీణత నమోదైంది. ప్రయివేట్ మెసేజింగ్ యాప్‌లు, వీడియో నెట్‌వర్క్‌లతో సహా అనేక రకాల ప్రత్యామ్నాయాలపై ప్రజలు ఆధారపడుతున్నారు. గత సంవత్సరంలో అన్ని దేశాలలో ఫేస్‌బుక్ వార్తల వినియోగం 4 శాతం తగ్గటం గమనార్హం. ఇప్పటివరకు యూట్యూబ్.. వార్తల కోసం ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన వేదికగా అభివృద్ధి చెందుతున్నది. సర్వేలో పాల్గొన్న మూడో వంతు మంది యూట్యూబ్ (31 శాతం), వాట్సాప్ (21 శాతం), టిక్‌టాక్ (13 శాతం)లపై ఆధారపడుతున్నారు. కాగా, 10 శాతం మంది వార్తల కోసం ఎక్స్ (గతంలో దీనిని ట్విట్టర్‌గా పిలిచేవారు)పై ఆధారపడుతున్నామని చెప్పటం గమనార్హం.

ఇక ఫార్మాట్‌కు సంబంధించి, ముఖ్యంగా యువతలో వార్తల కోసం వీడియోను ఎక్కువగా కోరుకుంటున్నారు. దాదాపు మూడింట రెండు వంతుల (66 శాతం) మంది చిన్న వార్తల వీడియోల ద్వారా వార్తలను పొందటానికి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నారు. 51 శాతం పొడవైన వార్తల ఫార్మాట్‌లను ఇష్టపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 10 మందిలో ఆరుగురు (59 శాతం) ఇంటర్నెట్‌లో ఏది అసలైన, నకిలీ అనే దానిపై ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది కాలంలో ఈ సంఖ్య 3 శాతం పెరగటం గమనార్హం. కేవలం 40 శాతం మంది మాత్రమే వార్తలను విశ్వసిస్తున్నారు. ఇక 20 సంపన్న దేశాలలో.. కేవలం 17 శాతం మంది గత సంవత్సరంలో ఏదైనా ఆన్‌లైన్ వార్తల సభ్యత్వానికి చెల్లింపు చేసినట్టు చెప్పారు. ఈ జాబితాలో నార్వే (40 శాతం మంది), స్వీడన్ (31 శాతం) అగ్రస్థానంలో ఉండగా.. జపాన్ (9 శాతం), యునైటెడ్ కింగ్‌డమ్ (8 శాతంతో) దిగువ స్థానాల్లో ఉన్నాయి.

రైళ్లలో సాధారణ ప్రయాణికులకు ఊరట..

జనరల్ కోచ్‌లు నాలుగుకు పెంపు

న్యూఢిల్లీ: సాధారణ ప్రయాణికులకు ఊరట కలగనున్నది. రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెరగనున్నాయి. స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లలో విపరీతమైన రద్దీపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తున్నట్టు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైలు కోచ్‌ల వార్షిక ఉత్పత్తి కంటే అదనంగా 2500 జనరల్ క్లాస్ కోచ్‌లు తయారు చేయనున్నారు. దీంతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేశారు. కాగా, ప్రస్తుతం రెండు జనరల్ కోచ్‌లు ఉన్న రైళ్లలో వాటి సంఖ్య నాలుగుకు రెట్టింపు అవుతుందని సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. జనరల్ కోచ్‌లు లేని రైళ్లకు రెండు సమకూరుతాయని చెప్పారు. ఒక్కో జనరల్ కోచ్‌లో 150 నుంచి 200 మంది ప్రయాణించేలా తయారు చేస్తున్నట్టు వెల్లడించారు. దీంతో ప్రతి రోజూ అదనంగా ఐదు లక్షల మంది జనరల్ కోచ్‌లో ప్రయాణించ వచ్చని అన్నారు.

అంధకారంలో దేశ భవిష్యత్

- బీజేపీ సర్కార్ చరిత్ర చూస్తే స్కాములే
- 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ఏటు వైపు? : ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ : దేశ భవిష్యత్ అంధకారంలోకి వెళ్తోంది.. బీజేపీ ప్రభుత్వం స్కాంలతో నిండిపోయిందని జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. నీట్‌లో చోటుచేసుకున్న అవకతవకల వల్ల 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గురించి ఆమె ఎన్డీఏ ప్రభుత్వాన్ని ట్విట్టర్ వేదికగా నిలదీశారు. బీజేపీ పాలనలో వరుస పేపర్ లీకులు చోటుచేసుకుంటున్నాయని, ఇది యువత భవిష్యత్‌ను నాశనం చేస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నీట్‌లో జరిగిన అవకతవకలు, పరీక్షల రద్దు వంటి వాటిపై ఆమె తీవ్రంగా స్పందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

బీజేపీ హయాంలో ప్రతిభ నియామక అర్హత పరీక్షల్లో, ప్రశ్నాపత్రాల లీక్‌లు వంటివి దేశ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తున్నాయని ప్రియాంక మండిపడ్డారు. గడిచిన ఐదేండ్లలో దేశంలో 43 రిక్రూట్‌మెంట్ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని, ఇది జాతీయ సమస్యగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కోట్లాదిమంది యువత భవిష్యత్‌ను నాశనం చేసిందన్నారు. మన దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, యువతను నైపుణ్యం, సామర్థ్యం కలిగిన వారిగా మార్చకపోగా, బీజేపీ వారిని ఇంకా బలహీనపరుస్తోందని ఆరోపించారు. నీట్ పరీక్ష జరిగి, ఫలితాలు వెలువడిన తర్వాత పేపర్ లీక్‌లు వంటివి వెలుగులోకి వచ్చాయని, వీటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్కూల్ ట్యాంక్‌లోని నీరు తాగి.. 20 మంది విద్యార్థుల అస్వస్థత

రాంచీ: స్కూల్ ట్యాంక్‌లోని నీరు తాగి 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. జార్ఖండ్‌లోని లతేహర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దురులోని అప్‌గ్రేడ్ అయిన ప్రైమరీ స్కూల్‌లో శనివారం మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులు అక్కడి ట్యాంక్‌లోని నీరు తాగారు. కొంత సేపటి తర్వాత విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. సుమారు 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బ్లాక్ అధికారి ఆ ప్రభుత్వ పాఠశాలకు చేరుకున్నారు. నీటి నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

పోలీస్ కస్టడీలో యువకుడి మృతి

- యూపీలో దొంగతనం ఆరోపణలపై అరెస్టు
- అనారోగ్యంతో మృతి
- పోలీసులు చిత్రహింసలకు గురిచేసి చంపారని కుటుంబీకుల ఆరోపణ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో 25 ఏండ్ల దళిత యువకుడు పోలీసు కస్టడీలో మరణించాడన్న ఆరోపణలపై హింస చెలరేగింది. వివరాల ప్రకారం.. దొంగతనం ఆరోపణలపై ఆకాశ్‌ను ఇటీవల అరెస్టు చేశారు. మరుసటి రోజు, నిందితుడు పోలీసు కస్టడీలో అనారోగ్యానికి గురైతే పోలీసులు ప్రాథమిక చికిత్స అందించారు. అతని ఆరోగ్యం క్షీణించడంతో, ఆకాశ్‌ను ఆస్పత్రిలో చేర్చారు, అక్కడ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, కస్టడీలో ఉండగానే పోలీసులు చంపారని మృతిడి కుటుంబీకులు ఆరోపించారు. అయితే ఈ ఘటనపై పోలీసులు స్పందిస్తూ ఆకాశ్‌కు పోస్టుమార్టం నిర్వహించామని, నివేదిక, ఇతర వివరాలను త్వరలో మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు..

జోధ్‌పూర్‌లో మత ఘర్షణలు

- ఇద్దరు పోలీసులకు గాయాలు, దుకాణాలు, వాహనాలు ధ్వంసం

జైపూర్: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఇరు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు లాఠీ ఛార్జీ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. జోధ్‌పూర్ సుర్‌సాగర్ ప్రాంతంలోని రాజారాం సర్కిల్ సమీపంలోని ఈద్గా వద్ద కొత్తగా రెండు గేట్లను ముస్లింలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్నది. కాగా, శుక్రవారం రాత్రి ఈద్గా గేట్ల ప్రారంభంపై స్థానిక హిందువులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత ఘర్షణలు జరిగాయి. రెండు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఉద్రిక్తతలు పెరుగడంతో ఒక సమూహం స్థానిక దుకాణాన్ని తగులబెట్టింది. పోలీస్ వ్యాన్‌తో సహా రెండు కార్లను ధ్వంసం చేసింది.

ఉదయం 9:15 కల్లా ఆఫీసుల్లో ఉండాల్సిందే!

- ఆలస్యంగా వస్తే హాఫ్‌డే లీవ్ కిందే లెక్క..
- కేంద్రం మార్గదర్శకాలు విడుదల



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో టంచన్‌గా ఉదయం 9:15కి ఉద్యోగులు రావాల్సిందే. కాస్త లేటయినా హాఫ్ డే సీఎల్ కింద లెక్కించనున్నది. ఈ మేరకు మోడీ సర్కార్ తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు కేంద్రపాలిత ప్రాంతాలు సహా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులందరూ ఉదయం 9.15 కల్లా విధులకు రావాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ (డీఓపీటీ) ఆదేశాలిచ్చింది. ఇకపై ఉద్యోగులు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను తప్పనిసరిగా వాడాలని సూచించింది. పుస్తకాల్లో సంతకాలు చేస్తే పరిగణలోకి తీసుకోమని తేల్చి చెప్పింది. ఏదైనా కారణంతో ఉద్యోగి ఆఫీసుకు రాలేకపోతే ముందు రోజు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, క్యాజువల్ లీవ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కూడా సూచించింది. చాలా మంది ఉద్యోగులు కోవిడ్ తర్వాత నిబంధనలు పాటించటం లేదని గుర్తించింది. అందువల్ల ఇకపై ప్రతీ శాఖలోనూ హెచ్‌ఓడీలు, ఇతర ఉన్నతాధికారులు ఉద్యోగుల హాజరును తప్పనిసరిగా పరిశీలించాలని డీఓపీటీ ఆదేశాలు ఇచ్చింది. 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి రాగానే బయోమెట్రిక్ హాజరును అమల్లోకి తెచ్చింది. అయితే కోవిడ్ సమయంలో దీనికి మినహాయింపు ఇచ్చింది. ఇదే అదునుగా చాలా మంది ఉద్యోగులు సమయపాలన పాటించక పోవడం, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని కేంద్రం అంటోంది. మరీ ముఖ్యంగా ప్రజానుబంధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆలస్యంగా ఆఫీసులకు రావడం, త్వరగా వెళ్లిపోవడం వల్ల సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, కేంద్రం గుర్రుమంటోంది. అయితే అధికారులు మాత్రం తాము పనివేళల కంటే ఎక్కువగా పనిచేస్తున్నామని, వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నప్పటికీ సెలవుదినాల్లోనూ పనిచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. తాజా మార్గదర్శకాలపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఆ జోడీ గురించి బాబుకు బాగా తెలుసు !

తెలిసీ మోడీ రాజకీయ చదరంగంలో పావుగా మారుతున్నారా?

- నాటి అవమానాలు మరిచిపోయారా?
- ఆ పార్టీలకు ఏ గతి పట్టిందో చూడాలి
- గద్దర్ నుంచి పవన్ స్ఫూర్తి పొందాలి
- రాజకీయ పరిశీలకుల సూచన

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఆయనపై ప్రధాని నరేంద్ర మోడీ ఎంతటి ఆప్యా యత, అనురాగం ప్రదర్శించారో అందరూ చూశారు. ఎన్డీఏ నేతల సమావేశంలో కూడా చంద్రబాబు ప్రధాని పక్కనే కూర్చొని ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తారు. మోడీ కూడా బాబును ఆకాశానికి ఎత్తేశారు. మరి గతంలో జరిగిన అవమానాలను చంద్రబాబు మరచిపోయారా? చంద్రబాబుపై రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసు వెనుక కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక పాత్ర పోషించిందన్న విషయం చంద్రబాబు కంటే వేరెవ్వరికీ బాగా తెలిసి ఉండదు. ఈ కేసు కారణంగానే చంద్రబాబు గత సంవత్సరం అనేక నెలల పాటు జైలు జీవితాన్ని గడపాల్సి వచ్చింది.

ద్దరితోనూ దోబూచులాట



జైలులో ఉన్న చంద్రబాబుపై ఆంధ్రప్రదేశ్ ప్రజల సానుభూతి, మద్దతు అనూహ్యంగా పెరగడాన్ని ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గుర్తించారు. దీంతో సీను మారిపోయింది. ఐదు సంవత్సరాల పాటు తమకు మిత్రుడిగా వ్యవహరించి, అనేక వివాదాస్పద బిల్లులకు పార్లమెంటులో మద్దతు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్మోహనరెడ్డిని దూరం పెట్టి చంద్రబాబుతో జత కట్టారు. ఎన్నికల ప్రచార సమయంలో సైతం జగన్‌పై మోడీ పెద్దగా విమర్శలు చేయలేదు. ఒకవేళ వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే ఆ పార్టీ మద్దతు తనకే ఉంటుందన్న మోడీ ధీమాయే దీనికి కారణమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు.

ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ చంద్రబాబు, జగన్...వీరిద్దరితోనూ మోడీ దోబూచులాట ఆడారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో చంద్రబాబు క్లీన్‌స్వీప్ చేయడంతో బాబును మోడీ అక్కున చేర్చుకున్నారు. పైగా జగన్‌పై అనేక క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నాయి. తనను అకారణంగా జైలుకు పంపిన జగన్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ఇదే సరైన అదను అని చంద్రబాబు భావిస్తూ ఉండవచ్చు. అయితే ఆయన ఓ విషయాన్ని గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. విభజించి పాలించే మోడీ-షా రాజకీయ చదరంగంలో తాను కేవలం ఓ పావుగా మారుతున్నానన్న వాస్తవాన్ని ఆయన మరచిపోకూడదు. మోడీ రాజకీయాలపై 2019లో తాను చేసిన ట్వీట్లను చంద్రబాబు గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. మోడీ రాజకీయాలు అప్పుడు, ఇప్పుడు ఒకేలా ఉన్నాయి. ఎలాంటి మార్పు లేదు.

ఆ పార్టీలకు ఏ గతి పట్టింది?


ఆట ఇప్పుడే మొదలైంది.కానీ చిరుతపులి తన వేటను ఆపబోదని, పంథాను మార్చుకోదని చంద్రబాబు త్వరలోనే గ్రహిస్తారు. మోడీ, షా అదను కోసం వేచి చూస్తారని, తెలుగుదేశం పార్టీతో సంబంధాలు తెంచుకునేందుకు ఎత్తుగడలు వేస్తారని రాజకీయ విశ్లేషకులు హెచ్చరించారు. ఈ విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. మోడీ, షాలు తెలుగుదేశం పార్టీని బతకనివ్వరని తాను భయపడుతున్నానని ఆయన కొన్ని సంవత్సరాల క్రితం రచయిత కపిల్ కొమిరెడ్డికి చెప్పిన మాటలు ఈ సందర్భంగా గమనార్హం. మహారాష్ట్రలో శివసేన, ఒడిషాలో బిజూ జనతాదళ్, బీహార్‌లో జేడీయూ, తమిళనాడులో అన్నా డీఎంకే పార్టీలకు ఏ గతి పట్టిందో ఆయన అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

నాటి బాబు ట్వీట్ ఇదే

మోడీ ఓ పద్ధతి ప్రకారం దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థలను నాశనం చేశారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో సంస్థాగత స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్యం దాడికి గురయ్యాయి' అని చంద్రబాబు ఆనాడు ట్వీట్ చేశారు. దానిని ఆయన ప్రతి రోజూ, ప్రతి క్షణం గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అనేక అంశాలపై ఆయన మోడీతో వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ ప్రతికూల ఫలితాలు రాలేదని మోడీ-షా ద్వయం చెప్పుకుంటోంది. గత విధానాలనే కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం ప్రజలు తీర్పు ఇవ్వలేదని భాగస్వామ్య పక్షాల నేతలైన చంద్రబాబు, నితీష్ కుమార్‌లు ప్రధానికి గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

పవన్ కూడా...



గత సెప్టెంబరులో చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు జనసేనాని పవన్ కల్యాణ్ జైలులో ఆయనను పరామర్శించారు. బాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. దర్యాప్తు సంస్థలు ఏ విధంగా రాజ్యాంగ పద్ధతులను ఉల్లంఘిస్తున్నాయో వివరించారు. ఆయన బీజేపీ భాగస్వామి అయినప్పటికీ కేంద్ర దర్యాప్తు సంస్థలు జరిపిన అరెస్టులను ఖండించారు. షారూఖ్ ఖాన్ కుమారుడిని, అమ్‌ఆద్మీ పార్టీ నేతలను అరెస్ట్ చేసిన తీరును తప్పుపట్టారు. మిత్రపక్షమైన బీజేపీకి చెప్పకుండానే ఆయన టీడీపీతో పొత్తును ప్రకటించారు. పొత్తుపై చివరి క్షణం వరకూ నానుస్తూ వచ్చిన బీజేపీ చివరికి టీడీపీతోనే నడవాలని నిర్ణయించుకుంది. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను విమర్శిస్తూ తాను గతంలో చేసిన ప్రసంగాన్ని పవన్ కల్యాణ్ ఇప్పుడు చంద్రబాబుకు గుర్తు చేయాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

తాను గద్దర్ అభిమానినని చెప్పుకునే పవన్ కల్యాణ్ ఆయన నుంచి కొంత స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కేవలం మోడీతో లావాదేవీలకు సంబంధించిన ఒప్పందానికే పరిమితం కాకుండా పవన్ ప్రయత్నించాల్సి ఉంది. వచ్చే వారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. టీడీపీ నేతలు తమ వైఖరిని స్పష్టం చేయడానికి ఇదే సరైన సమయం. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజలు ఇదే సందేశాన్ని అందించారు కదా !.



బొగ్గు బావుల ప్రయివేటీకరణ ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేయకుండా నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కీలకమైన కోల్‌మైన్ రంగంలో ఈ వేలంపాట ప్రక్రియకు తలుపులు తీయడం మరో విధమైన ప్రయివేటీకరణకు దారి తీసినట్టు అని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మైన్స్ ఇవ్వకపోవడం, ఆ రకంగా నష్టాల్లోకి నెట్టేయడం, ఆ తర్వాత ప్రయివేటుపరం చేయడం మరో రకమైన ప్రక్రియ అని వివరించారు. కాబట్టి దీనికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో కార్మిక సంఘాలు కలిసి రావాలని, ప్రజలు ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నేరుగా బొగ్గు బ్లాక్‌లను ఎలాగైతే అటాచ్ చేసిందో.. అదే విధంగా సింగరేణికి బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా తలపెట్టిన వేలంలో పాల్గొనకుండా నేరుగా సింగరేణికి ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలంలో ఉంచడాన్ని అడ్డుకోవాల్సిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదారాబాద్ వేదికగానే వేలం నిర్ణయం తీసుకోవడం కుట్రలో భాగమన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్.రమ, పి.జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, రమేష్, నాయకులు ఎం.వెంకటేష్, జి.రాములు, మహేందర్, మల్లేష్, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

సూర్యాపేట, యాదాద్రిలో..

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. బొగ్గు గనుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోనే బొగ్గు గనుల వేలం ప్రక్రియ ప్రారంభించటం పట్ల కార్మిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తగూడెంలో..

కేంద్రంలోని బీజేపీ సర్కార్ 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం, కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల అడ్డాల వద్ద కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు మాట్లాడుతూ.. 60 బొగ్గు బ్లాకుల్లో రాష్ట్రంలోని సింగరేణి సంస్థకు చెందిన శ్రావణపల్లి మెగా ప్రాజెక్ట్ కూడా ఉందని చెప్పారు. దీనిని అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాలని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఖమ్మం త్రీటౌన్ ఏరియాలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.

గోదావరిఖని చౌరస్తాలో..

కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల వేలాన్ని విరమించుకోవాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన తెలిపారు. గతంలో రామగుండం బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణలోని బొగ్గు గనులను ప్రయివేటు వారికి అప్పగించబోమని చెప్పి.. ఇప్పుడు వేలం వేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.

భూపాలపల్లిలో..

సింగరేణి బొగ్గు బ్లాక్‌ల ప్రయివేటీకరణను నిలిపివేయాలని, వేలం వేయకుండా సింగరేణికి అప్పగించాలని సీఐటీయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బంధు సాయిలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు.

సింగరేణిని నిండా ముంచింది బీఆర్ఎస్సే

- కేసీఆర్ కుటుంబం వల్లే సంస్థ దివాళా
- పదేండ్లలో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి
- సంస్థను ప్రయివేటీకరిస్తున్నారనే ప్రచారం పచ్చి అబద్ధం : కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకప్పుడు లాభాల బాటలో ఉన్న సింగరేణి సంస్థను నిండా ముంచింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ భూములు, ఆస్తులను దుర్వినియోగం చేసి సింగరేణిని అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్ కుటుంబానికే దక్కుతుందని విమర్శలు గుప్పించారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో ఆ సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని మండిపడ్డారు. సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. గత సర్కార్ తప్పుడు నిర్ణయాల వల్ల కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో రూ. 3500 కోట్ల మిగులుతో ఉన్న సంస్థ నేడు దివాళా తీసిందని చెప్పారు. సింగరేణిని ప్రయివేటీకరిస్తామనే ప్రచారం పచ్చి అబద్ధమని కిషన్‌రెడ్డి కొట్టిపారేశారు. కార్మికులకు అన్యాయం జరగనీయబోమని భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే అత్యంత పారదర్శకంగా బొగ్గుగనుల వేలం జరుగుతోందని వెల్లడించారు.ఈ వేలం ద్వారా వచ్చే ఆదాయంలో ఒక్క పైసా కూడా కేంద్రం తీసుకోదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 9 సార్లు బొగ్గు గనులను వేలం వేశామనీ, తద్వారా వచ్చిన రూ. 37వేల కోట్ల ఆదాయం ఆయా రాష్ట్రాలకే చెందిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణిలో గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమలుగాని హామీలిచ్చి రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వాటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క ఉచిత బస్ ప్రయాణం మినహా మరేది అమలు కాలేదని అన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని కితాబిచ్చారు. 1964 నుంచి 2014 వరకు 48 ఏండ్లలో వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర కేవలం రూ.1,300 పెరగగా, పదేండ్ల బీజేపీ పాలనలో ఏకంగా వెయ్యి రూపాయలు పెరిగిందని గుర్తు చేశారు. దీన్నిబట్టి ఎవరు రైతు పక్షపాతో ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కాలేదనీ, కొన్ని సెంటర్లలో ఒక పేపర్‌కు బదులుగా మరో పేపర్‌ను ఇచ్చారని పేర్కొన్నారు. ఆ పరీక్షలో దక్షిణాదికి నష్టం జరుగుతుందనే వాదన సరికాదన్నారు. మీడియా సమాశంలో బీజేపీ నాయకులు ప్రదీప్‌రావు, రాములు, కాసం వెంకటేశ్వర్లు, ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన టీచర్‌కు పదోన్నతి

- పాఠశాల విద్యాశాఖ నిర్వాకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖ అధికారుల నిర్వాకం మరోసారి బయటపడింది. మరణించిన ఉపాధ్యాయునికి పదోన్నతి కల్పించడమే ఇందుకు నిదర్శనం. ఓపెన్ కేటగిరీలో ఉద్యోగి ఐడీ 1630168 ఏవీ శ్రీనివాసరావు చెలమప్పగూడెం ఎంపీయూపీఎస్‌లో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు కేటాయించారు. ఆయన వెబ్‌ఆప్షన్ నమోదు చేయకపోయినా పదోన్నతి కల్పించడం గమనార్హం. ఆ జిల్లా డీఈవో కార్యా లయ సిబ్బంది సర్వీసులో ఉన్న టీచర్ల వివరాలను పరిశీలించకుండా, అదీ పదోన్నతులను కల్పించేందుకు ఎంత మందికి అర్హత ఉంది అనేది చూడ కుండా మరణించిన ఉపాధ్యాయునికి ప్రమోషన్ ఇవ్వడం పట్ల విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు మల్టీజోన్-1లో 10,083 మంది, మల్టీజోన్-2లో 768 మంది కలిపి మొత్తం 10,851 మంది ఉపాధ్యా యులకు పదోన్నతులు కల్పించారు. మల్టీజోన్-2లో వారం రోజుల్లో మరో ఎనిమిది వేల మందికి పదోన్నతులను కల్పించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కార్పొరేట్లకోసమే ఆ జీవో..



తక్షణమే ఉపసంహరించుకోవాల్సిందే..

- కార్మిక హక్కుల జోలికొస్తే..ఖబడ్దార్
- లేబర్ కోడ్‌లపై కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలి
- బొగ్గు వేలాన్ని నిలిపేసి, అదనంగా గనులు కేటాయించాలి: రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక నేతల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కార్పొరేట్ల ఒత్తిడి, వారి లాభాల కోసమే జీవో నెంబర్ ఐదును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఐటి పరిశ్రమలకు కార్మిక చట్టాలను సడలిస్తూ ఆ జీవోను విడుదల చేయటమంటే..వారితో వెట్టి చాకిరి చేయించాలనుకుంటున్నారా? ఇప్పటికే రాష్ట్రంలో ఐటీఈఎస్ పరిశ్రమల్లో చట్టబద్ధ సౌకర్యాలు అమలు కావటం లేదు. ప్రజా ప్రభుత్వానికి కార్మికుల ప్రయోజనాలు పట్టవా? చట్ట ప్రకారం కార్మికుడు ఎన్ని గంటలు పనిచేయాలి? ఆ పరిశ్రమల్లో ఎంత సమయం పనిచేస్తున్నారు? ఈ విషయాన్ని పరిశీలించాల్సిన కార్మిక శాఖ ఏం చేస్తున్నట్టు? కార్మికుల కష్టాన్ని అప్పనంగా కార్పొరేట్లకు దారబోయాల్సిందేనా?' అని పలువురు కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు అధ్యక్షతన 'ఐటిఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాల మినహాయింపు జీవో నెంబర్5ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ అధ్యక్షులు రెబ్బ రామారావు, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఎంకే బోస్, ఐఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఏఐడీఈఎఫ్ ఉపాధ్యక్షులు తిరుపతి, బీఈఎఫ్ఐ ఉపాధ్యక్షులు సుందర్‌రాం, ఎల్ఐసీ యూనియన్ నాయకులు రవీంద్రనాథ్, సీసీజీఈడబ్ల్యూ నాయకులు అజీజ్, ఆర్‌బీఐ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంవి హరీష్‌బాబు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కాన్ఫడరేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉపాధ్యక్షులు ఏవీరావు, టీఎంఎస్ఆర్‌యూ నాయకులు ముకుంద్‌కులకర్ని, హనుమయ్య తదితర నేతలు మాట్లాడారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఐటిఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలు వర్తించబోవన్నారు. ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేక చర్య అని విమర్శించారు. దీన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవంగా ఆ పరిశ్రమల్లో కూడా కార్మిక చట్టాలు వర్తిస్తాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ ఐదును విడుదల చేయటం ద్వారా కార్మికులకు ఏం మెసేజ్ ఇవ్వాలనుకుందో స్పష్టం చేయాలన్నారు. పని గంటలు పెంచుతామని చెప్పదల్చుకుందా? పని ప్రదేశాల్లో భద్రత ఉండదని చెప్పదల్చుకుందా? అని నిలదీశారు. రవాణా సౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన కొన్ని షరతులను అమలు చేయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వటమంటే..ఈ ప్రభుత్వం పరోక్షంగా కార్మికుల పక్షం కాదు..కార్పొరేట్ల పక్షమేనని చెప్పకనే చెప్పిందని విమర్శించారు. గత అనేక సంవత్సరాలుగా ఐటీ పరిశ్రమలను, కంపెనీలను కార్మిక శాఖ తనిఖీలు చేయటం మానేసిందని గుర్తు చేశారు.రాత్రి షిప్టుల మూలంగా మహిళలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్లనుంచి ఆ పరిశ్రమలు కార్మిక చట్టాల నుంచి మినహాయింపును పొందుతున్నాయనీ, కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్నాయని చెప్పారు.రామారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమన్నారు. లేబర్ డిపార్ట్ మెంట్ లేబుల్ డిపార్ట్‌మెంట్‌గా మారిందని విమర్శించారు. బోస్ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు కాకపోవటంతో కార్మికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని చెప్పారు. ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లలో అంతర్భాగమే జీవో నెం ఐదు అని చెప్పారు.

వెట్టి కూలీల్లాగే ఆ పరి శ్రమల్లో పనిచేసే కార్మికుల కష్టాన్ని దోచుకునేందుకే ఆ జీవో అని విమర్శించారు. హనుమయ్య, సుందర్‌రాం, కులకర్ని, నాగేశ్వరరావు, తిరుపతి తదితరులు మాట్లాడుతూ జీవో నెంబర్ ఐదును ఉపసంహరించుకునే వరకు వివిధ రూపాల్లో ఐక్య పోరాటాలను నిర్వహించాలని సూచించారు. జీవో నెంబర్ 5ను రద్దు చేయాలనీ, బొగ్గు వేలాన్ని నిలిపివేసి, అదనంగా గనులను పెంచాలనీ, లేబర్ కోడ్‌ల విషయంలో కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలనే తార్మానాలను ఎస్ బాలరాజు ప్రవేశ పెట్టగా రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్‌తో పాటు ఇతర సంఘాల నాయకలు పాల్గొన్నారు.

పరీక్ష కాదు..శిక్షే

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నారు.

2018లో ఆవిర్భావం

ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు 2017లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు తావులేకుండా చూసేందుకే దీనిని ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంది. 2018 మార్చి 1న ఎన్టీఏ మనుగడలోకి వచ్చింది. అప్పటి నుండి ఈ సంస్థ పలు ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. కానీ పలు సందర్భాలలో వాటి నిర్వహణ లోపభూయిష్టంగానే ఉంటోంది. పేపర్ లీకేజీలతో పరీక్షలు రద్దవడం. వాయిదా పడడం నిత్యకృత్యంగా మారిపోయింది.

నీట్‌పై గ్యారంటీ ఇస్తారా?

నీట్ పరీక్ష నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. పరీక్ష రద్దయినా కాకపోయినా ఇబ్బంది పడేది మాత్రం విద్యార్థులే కదా. విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని విద్యా శాఖ చెబుతోంది. అయితే ప్రాథమిక విచారణ అనంతరం నెట్ పరీక్షను రద్దు చేసిన విషయాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. నీట్ విషయంలో అలా ఎందుకు జరగకూడదని వారి ప్రశ్న. తదుపరి పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ కాబోదని గ్యారంటీ ఏముందని నెట్‌కు హాజరైన విద్యార్థులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. నియామక పరీక్ష అయినా...ప్రవేశ పరీక్ష అయినా ప్రతి విద్యార్థి పేపర్ లీకేజీ, రిగ్గింగ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నాడు.

ఫిర్యాదులు...ఆరోపణలు

ఎన్టీఏ ఏర్పడిన తర్వాత ప్రతి సంవత్సరం పరీక్షల రిగ్గింగ్‌పై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. 2019లో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్ష సందర్భంగా సర్వర్ వైఫల్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రశ్నాపత్రం ఇవ్వడంలో జరిగిన జాప్యంపై కూడా కొన్ని చోట్ల ఫిర్యాదులు వచ్చాయి. 2020లో జరిగిన నీట్ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ పరీక్షకు సంబంధించి ఎన్టీఏ పనితీరుపై పలు ప్రశ్నలు ఉదయించాయి. ఈ పరీక్షను అనేక సార్లు వాయిదా వేశారు. అవకతవకలపై కూడా పలు ఫిర్యాదులు వచ్చాయి. 2021లో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షకు వచ్చిన కొన్ని తప్పుడు ప్రశ్నలపై గందరగోళం చెలరేగింది. అవాంఛనీయ పద్ధతుల ద్వారా పరీక్షలో ఉతీర్ణత సాధించేందుకు విద్యా మాఫియా ప్రయత్నించిందంటూ ఆరోపణలు కూడా వచ్చాయి. ఆ సంవత్సరంలోనే నీట్ పరీక్షకు సంబంధించి రాజస్థాన్‌లోని భంక్రోటాలో ఓ ముఠా ట్యాంపరింగ్‌కు పాల్పడిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీల్లో ప్రవేశాల కోసం 2022లో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలో సైతం అవకతవకలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువ ఫిర్యాదులు రాజస్థాన్ నుండి వచ్చినవే. ఆ తర్వాత ఎన్టీఏ కొన్ని ప్రాంతాల్లో మళ్లీ పరీక్ష నిర్వహించింది.

ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో కూడా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రేస్ మార్కులపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో బీహార్‌లో పేపర్ లీక్ అయిందన్న వార్త వెలుగు చూసింది. దీంతో ఎన్టీఏ విశ్వసనీయత, జవాబుదారీతనం ప్రశ్నార్థమవుతున్నాయి. ఈ నెల 18న జరిగిన యూజీసీ-నెట్ పరీక్ష రద్దయింది. ఎన్టీఏ ఏర్పడిన తర్వాత 2018, 2023 సంవత్సరాల్లో మాత్రమే పేపర్ లీకేజీలు, అవకతవకలకు సంబంధించి ఆరోపణలు రాలేదు.

లీకేజీపై రాజకీయం

ఓ వైపు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతుంటే మరోవైపు పేపర్ లీకేజీలపై రాజకీయాలు మొదలయ్యాయి. నీట్ ప్రశ్నాపత్రం బీహార్‌లో లీక్ అయింది. నీట్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన అమిత్ ఆనంద్ పేపర్‌ను లీక్ చేయగా రెండో నిందితుడైన సికందర్ యాదవేందు ఆ పేపర్‌ను విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత పలువురు విద్యార్థులు ఆ ప్రశ్నాపత్రాన్ని రూ.40 లక్షలకు కొనుగోలు చేశారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ వ్యక్తిగత కార్యదర్శి ప్రదీప్ కుమార్ నిందితులైన విద్యార్థుల కోసం అతిథి గృహంలో ఓ గదిని బుక్ చేశాడన్న ఆరోపణలు వచ్చాయి. పేపర్ లీకేజీ కేసులో బీహార్ ఉప ముఖ్యమంత్రి తొలుత తేజస్వి యాదవ్ పైనే ఆరోపణలు చేశారు. అయితే నిందితుడిని ప్రభుత్వం రక్షించాల్సిన అవసరం లేదని, తన వ్యక్తిగత సహాయకుడిని పిలిచి విచారించవచ్చునని తేజస్వి స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి సూత్రధారి అయిన అమిత్ ఆనంద్ గతంలో కూడా అనేక ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన ఘనుడు. లీక్ చేసిన ఒక్కో ప్రశ్నాపత్రాన్ని లక్షలాది రూపాయలకు సికందర్‌కు అమ్మేశానని అమిత్ అంగీకరించాడు.

భయపడే పోచారం కాంగ్రెస్‌లోకి..

- బాన్సువాడలోనే ఉంటా
- అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తాం.. : మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)



పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గం కంచుకోటకు కాంగ్రెస్ పార్టీ బీటలు వేసిందని.. అందుకే ఆయన భయపడి కాంగ్రెస్‌లో చేరారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. తాను బాన్సువాడలోనే ఉంటానని కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా జిల్లా బాన్సువాడ పట్టణంలో ఏనుగు రవీందర్‌రెడ్డి నివాసం వద్ద అనుచరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పోచారం ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం వెనుక ఏదో కారణం ఉంటుంది. అందువల్ల పార్టీ అధిష్టానాన్ని అందరం గౌరవించాలి. పార్టీకో, ప్రభుత్వానికో ఏదో లాభం ఉండటం చేతనే ఆయన్ను ఆహ్వానించారు. బాన్సువాడ నియోజకవర్గం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కంచుకోటలాగా ఉండగా, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీటలు వేసింది.. నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీకి భయపడి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీలో చేరారు. ఎవరు వచ్చినా కార్యకర్తలకు నష్టం ఏమీ లేదు' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది, ఇందులో ఎవరైనా రావచ్చని, తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

బొగ్గుబ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలి

- వేలంపాటకు వ్యతిరేకంగా 28,29 తేదీల్లో ధర్నాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాళా తీయించే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాటను ప్రారంభించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేసింది. వేలంపాటను వ్యతిరేకిస్తూ ఈనెల 28,29 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయనున్నట్టు పిలుపునిచ్చింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి, హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియను ప్రారంభించటం ఆందోళనకరమని విమర్శించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనటం ఆశ్చర్యకరంగా ఉందని తెలిపారు. ఒకవైపు బొగ్గు బ్లాకులను వేలం వేస్తూ, మరోవైపు సింగరేణిని ప్రయివేటీకరించబోమంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారని పేర్కొన్నారు. ఇది ఓట్లు వేసి గెలిపించిన తెలంగాణ ప్రజలను మోసం చేయటమేనని విమర్శించారు. వేలంపాటను రద్దు చేయాలనీ, రాష్ట్రంలో బొగ్గు తవ్వే సంస్థగా సింగరేణికే బొగ్గు బ్లాకులను అప్పగించాలని మోడీ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రెండు ప్రయివేటు సంస్థలకు కేంద్రం కట్టబెట్టిన రెండు బొగ్గు బ్లాకులు కూడా తిరిగి సింగరేణికే అప్పగించాలని కోరారు. ఇందుకోసం ఈనెల 28,29 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయాలనీ, వేలాదిగా ప్రజలు పాల్గొని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర సంపదను ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది పార్లమెంటు, ఎనిమిది శాసనసభ స్థానాలిచ్చిన ప్రజలకు వారు ఇస్తున్న బహుమానం ఇదేనా?అని ప్రశ్నించారు.

బొగ్గు బ్లాకులు ప్రయివేటుపరం అయిన తర్వాత సింగరేణి నష్టాలపాలై మూతపడే స్థితికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నెట్టుతున్నదని తమ్మినేని విమర్శించారు. మరోవైపు సింగరేణి కూడా వేలంపాటలో ప్రయివేటు సంస్థలతో పోటీ పడాలట!, ఇందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధపడటం ఆందోళనకరమని తెలిపారు. ఒకవైపు నేరుగా ఈ బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగించాలని చెప్తూనే, మరోవైపు వేలంపాటలో పాల్గొనడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిస్తున్నదని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొన్న తర్వాత, ఆ ప్రక్రియకు తలొగ్గటమే కదా! అని విమర్శించారు. వేలంపాటలో సింగరేణికి బొగ్గు బ్లాకు దక్కవచ్చు, దక్కకపోనూ వచ్చు అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా డిమాండ్ చేయటం తగదని పేర్కొన్నారు. వేలంపాట రద్దు చేయాలనీ, సింగరేణికే బొగ్గు బ్లాకులను నేరుగా అప్పగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మోడీ ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షాన్ని కూడగట్టి కేంద్రంతో చర్చించాలని సూచించారు. తెలంగాణ గుండెకాయ సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రజలను కదిలించాలని కోరారు.

ఏకో టూరిజానికి ప్రణాళికలు

- పర్యావరణానికి హాని కలగకుండా అభివృద్ధి : అటవీ శాఖ మంత్రి మతి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజం (ప్రకతి పర్యాటకం) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నదని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎకో టూరిజంపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి, వన్య ప్రాణులకు హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని తీసుకు రానున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యూట్లలో 40 స్పాట్లను గుర్తించినట్టు తెలిపారు. అడ్వెంచర్, రిక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ, దేవాదాయ, రెవెన్యూ పర్యాటక శాఖలు సమన్వయం చేసుకుని ఆ పాలసీని రూపొందించాలని సూచించారు. ఒడిశా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకుని అత్యుత్తమ పాలసీల రూపకల్పనకు కృషి చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పీపీపీ పద్ధతిలో నిధులను సమీకరించాలని సూచించారు రాష్ట్రంలో ప్రధాన నది అయిన గోదావరి పరీవాహక ప్రాంతంతో పాటు జలపాతాలు, నీటివనరులన్న చోట ఎకో టూరిజం స్పాట్లకు ప్రాధాన్యతని వ్వాలన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా స్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని వెబ్ సైట్లలో పొందుపర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పీపీసీఎఫ్ ఆర్ఎమ్ డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సీఎం పరామర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనకు ధైర్యం చెప్పి పిల్లలను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీఎంతో పాటు ఆయన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు సత్యం కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

నిందితులకు కఠినశిక్ష పడేలా చర్యలు

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ

మంత్రి జూపల్లి కృష్ణారావు • చెంచు మహిళకు పరామర్శ • రూ. 2 లక్షల సహాయం



నవతెలంగాణ- కందనూలు

చెంచు మహిళను హింసించిన నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి తండాకు చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను జూపల్లి శనివారం పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. చెంచు మహిళపై జరిగిన దాడి హేయమైన ఆటవిక చర్యగా అభివర్ణించారు. నలుగురు వ్యక్తులు బాధిత మహిళపై పాశవికంగా దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారని అన్నారు. నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటన వెలుగుజూసిన వెంటనే జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీసు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడానని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. వారి ముగ్గురు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్య అందిస్తామని చెప్పారు. కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని, వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రభుత్వం అండదండగా ఉంటుందని వెల్లడించారు.

టీయూ టిఫిన్‌లో బల్లి

యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌లో ఘటన

- కేర్ టేకర్‌పై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లోని టిఫిన్‌లో బల్లి వచ్చింది. ఇది శుక్రవారం జరగ్గా శనివారం వెలుగులోకొచ్చింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికల హాస్టల్‌లో అల్పాహారం సమయంలో ఓ విద్యార్థిని ప్లేటులో చనిపోయిన బల్లి కనిపించింది. దీంతో విద్యార్థినులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం బయటకు పొక్కకుండా విద్యార్థినులను యూనివర్సిటీ అధికారులు హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం. అయితే ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాల దృష్టికి రావడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వసతి గృహాల్లో విద్యార్థులకు నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని పలుమార్లు విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ బల్లి పడిన ఆహారాన్ని తిని ఉంటే విద్యార్థినుల పరిస్థితి నేడు వేరేరకంగా ఉండేదని, ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమేనని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. అయితే, బాలికల వసతి గృహం అల్పాహారంలో బల్లి వచ్చిన ఘటనలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. హాస్టల్ వంట మనిషి రాజేష్‌ను సస్పెండ్ చేశారు.

కేర్ టేకర్లను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

అల్పాహారంలో శుక్రవారం బల్లి పడితే యూనివర్సిటీ అధికారులు శనివారం వరకు స్పందించరా.. అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మహేష్, విఘ్నేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతవరకు యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ సందీప్‌కుమార్ సుల్తానియా టీయూను సందర్శించలేదని, వెంటనే సందర్శించాలన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించని కేర్ టేకర్లపై ఇప్పటివరకు రిజిస్ట్రార్ యాదగిరి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే వంట మాస్టర్లపై చర్యలు తీసుకొని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వెలవెలబోతున్న మణికొండ 'టెక్స్‌టైల్స్'

- వర్క్ ఆర్డర్లు.. మార్కెటింగ్ లేక కార్మికుల తిప్పలు
- మూలనపడిన దాబీలు.. జకార్డ్‌లు
- నడుస్తున్నవి 20 కంపెనీలే..
- సబ్సిడీలు అందక ఇబ్బందులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హన్మకొండ జిల్లా మడికొండలో ఏర్పడిన కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్‌లోని డాబీలు, జకార్డ్‌లకు పని లేక వెలవెలబోతున్నాయి. రాష్ట్రం నుంచి వలసెళ్లిన కార్మికులను రప్పించిన పాలకులు.. వారికి పని.. మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే బతుకమ్మ చీరల ఆర్డర్ ఇచ్చింది. ఆ తర్వాత ఆర్డర్లు రావడం గగనమై పోయింది. దాంతో పని లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. బ్యాంకు రుణాలకు సంబంధించి కిస్తీలు కట్టడానికి తంటాలు పడుతున్నారు. కొన్ని కంపెనీలు మాత్రమే ఇతర రాష్ట్రాల నుంచి వర్క్ ఆర్డర్లు తెచ్చుకుని పనిచేస్తున్నాయి.

నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం పిలుపుతో 364 మంది నేత కార్మికులు గుజరాత్‌లోని సూరత్ నుంచి తిరిగివచ్చి కాకతీయ టెక్స్‌టైల్స్ వీవర్స్ మాక్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. మడికొండలోని టీఎస్ఐఐసీ వారికి 60 ఎకరాల భూమిని కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయడంతో రోడ్లను ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది షెడ్‌లను నిర్మించుకున్నారు. ఇందులో 164 మందికి బ్యాంకు రుణాలు మంజూరు చేయడంతో చైనా నుంచి మిషనరీని తెప్పించి అమర్చుకున్నారు. మిగతా వాళ్ల సొంతంగా నిర్మించుకున్నారు. రెండేళ్లుగా ఇక్కడ ఉత్పత్తిని ప్రారంభించారు. గతంలో ఒక్కమారు బతుకమ్మ చీరల ఆర్డర్ ఇవ్వగా.. ఇక్కడి కంపెనీలు రెండు షిఫ్టుల్లో పనిచేయడంతో ఈ ప్రాంతం కళకళలాడింది. ఈ ఆర్డర్ ముగిశాక మళ్లీ ఆర్డర్లు రాలేదు. ప్రస్తుతం 20 కంపెనీలలో మాత్రమే వర్క్ ఆర్డర్లు తెచ్చుకొని కార్మికులు పనులు చేస్తున్నారు.

పైపెచ్చు వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాల్సిన సబ్సిడీలు ఇవ్వకపోవడంతో ఇఎంఐలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. కరెంటు సబ్సిడీని 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేసినా ఇప్పటికీ మంజూరు కాలేదు.

దీంతో ఈ సొసైటీ ప్రతినిధులు హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ఈ సొసైటీలోని కంపెనీల్లో ఒక్కో షెడ్‌లో 4 డాబీలు, 4 జకార్డ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. డాబీపై షర్టింగ్, జకార్డ్‌లపై చీరలను తయారు చేస్తారు. 8 మిషన్స్ వీటి కింద పనిచేస్తుంటాయి. ఇందులో ఒక్క షిఫ్ట్‌కు నలుగురు కార్మికులు పనిచేస్తారు. మూడు షిఫ్ట్‌లు పనిచేస్తే 12 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి టెక్స్‌టైల్స్ పార్క్ నేత కార్మికులకు 12.50 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల ఆర్డర్ రావడంతో రెండు, మూడు షిఫ్టుల్లో పని జరిగింది.

ఈ పని ముగిశాక వర్క్ ఆర్డర్లు దొరక్క యూనిట్ యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

స్థానిక నేత కార్మికులకు రేపర్ మిషన్లు, డాబీలు, జకార్డ్‌లపై పనిచేసే అనుభవం లేకపోవడంతో బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు ఈ మిషన్లపై పనిచేస్తున్నారు.

సబ్సిడీలివ్వక..

షెడ్లు, మిషనరీల కోసం ఒక్కో యూనిట్‌కు రూ.1.00 కోటి, రూ.1.40 కోట్ల రుణాలను పొందారు. అయితే, ఇందులో సబ్సిడీ మాత్రం నేటికీ విడుదల చేయలేదు. ఒక్కో యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం, కేంద్ర ప్రభుత్వం 15 శాతం మొత్తంగా 40 శాతం సబ్సిడీని కంపెనీలు పెట్టుకున్న వారికి విడుదల చేయాల్సి వుండగా, ప్రభుత్వాలు నిధులు విడుదల చేయలేదు. దీంతో రుణాలు పొందిన 164 కంపెనీల్లో ప్రస్తుతం 20 కంపెనీలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ 20 కంపెనీల యజమానులు సూరత్, బెంగళూరు, షోలాపూర్‌కు వెళ్లి వర్క్ ఆర్డర్‌లు తెచ్చుకొని మిషనరీని రన్ చేస్తున్నారు.

కరెంటు సబ్సిడీపై వీడని సస్పెన్స్

కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్‌ను ఏర్పాటు చేసే క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని కరెంటుపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని సొసైటీ ప్రతినిధులు కోరారు.ఆ మేరకు ప్రభుత్వం హామీనిచ్చింది. కానీ, ఏండ్లు వుతున్నా కరెంటు సబ్సిడీ ఇవ్వక పోవడంతో బిల్లులు చెల్లించడం కష్టసాధ్యంగా మారింది.

సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలి..

మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల నుంచి 1984లో సూరత్‌కు వెళ్లి, 30 ఏండ్లు అక్కడే పనిచేసినా. 2018లో ఇక్కడికి వచ్చి కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్‌లో యూనిట్ పెట్టుకున్నా.. ఇప్పటి వరకు బ్యాంకు రుణంపై సబ్సిడీ విడుదల చేయలేదు. యూనిట్‌ను రన్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ సబ్సిడీలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలి. రెండేండ్లుగా నా యూనిట్‌లో ఉత్పత్తి చేస్తూ సొంతంగా చీరలు, షర్టింగ్, చద్దర్లను మార్కెటింగ్ చేసుకుంటున్నా. గతంలో బతుకమ్మ చీరల ఆర్డర్ వచ్చినప్పుడు కంపెనీలో రెండు షిఫ్ట్‌లు పనిచేయించినా.. ఇప్పుడు ఆర్డర్‌లు లేవు. సొంతంగానే ఆర్డర్‌లు తెచ్చుకొని ఒకే షిఫ్ట్ నడుపుతున్నా. అదే కష్టమైతాంది. షోలాపూర్ కాటన్ చద్దర్లను నా యూనిట్‌లోనే తయారు చేసినా, మార్కెటింగ్ లేదు. పాలిస్టర్ బెడ్ షీట్స్ తక్కువ ధర (రూ.150) కావడంతో మార్కెట్‌లో సులభంగా అమ్ముడుపో తున్నాయి. నేను తయారు చేసిన కాటన్ చద్దర్లు (రూ.225) ధర ఎక్కువ వుండటంతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఇప్పటికీ చద్దర్లు యూనిట్‌లో నిల్వ ఉన్నాయి. వెంటనే సబ్సిడీలను విడుదల చేసి మమ్మల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.



లకుం సదానందం



పండితులు, పీఈటీ పోస్టులను బ్యాక్‌లాగ్‌లో ఉంచొద్దు

- ఖాళీలను అర్హులైన వారితో భర్తీ చేయాలి :

టీఎస్‌టీటీఎఫ్ అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భాషాపండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పిస్తున్నారనీ, ఆ పోస్టులను బ్యాక్‌లాగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పండితులు, పీఈటీలతో ఆ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అప్‌గ్రేడ్ అయిన భాషాపండితులు, పీఈటీల పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని కోరుతూ టీఎస్‌టీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్లకార్డులను ప్రదర్శించి అందరికీ న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సాహసం చేసి ఉపాధ్యాయులకు భారీ ఎత్తున పదోన్నతులను కల్పించాయని చెప్పారు. అయితే పండితులు, పీఈటీల పోస్టులను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని అన్నారు. ఆ పోస్టుల్లోనే పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించారని వివరించారు. భవిష్యత్తులో గ్రేడ్-2 భాషా పండితులు, పీఈటీల నియామకాలు ఉండబోవని ఆందోళన వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయకుండా పదోన్నతులను కల్పించడంతోపాటు అప్‌గ్రేడ్ అయిన పోస్టులను చూపించకపోవడం వల్ల జిల్లాల్లో చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారని చెప్పారు. వారందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ అయిన భాషాపండితులు, పీఈటీల పోస్టులు ఖాళీగా ఉండొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు సంతోష్, సూర్య, చక్రవర్తి, లక్ష్మణ్, మురళీమోహన్, పుష్ప, శ్రీదేవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌యూపీపీటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ సంఘీభావం ప్రకటించారు. అప్‌గ్రేడ్ అయిన పోస్టులను బ్యాక్‌లాగ్ చేయకుండా అందరికీ పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

రియల్టర్ల మోసాలు..!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. చివరికి.. దారుణంగా మోసపోయామని బాధితులు గ్రహించారు. బాధితులకు వ్యకాస రాష్ట్ర బృందం అండగా నిలిచింది. బాధ్యులపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది. రియల్టర్ల మోసాలకు బలైన వట్టినా గులపల్లి బాధితులపై నవతెలంగాణ క్షేత్రస్థాయి కథనం.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూముల ధరలు రూ.కోట్లలో ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ పాగా వేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత విలువైన గండిపేట మండలంలోని కోకాపేట భూములకు కనుచూపు మేరలోని వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలో గల అసైన్డ్ భూముల్లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ వేశాడు. పేద ప్రజలకు విక్రయించి వారిని అప్పులపాలు చేశాడు. వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 130/3, 130/4లో సుమారు 4.20 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. రైతుల దగ్గర నుంచి జావేద్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశాడు. అందులో 2016లో 130 ప్లాట్లతో వెంచర్ చేశాడు. ఒక్కో ప్లాట్ 120 గజాల విస్తీర్ణంతో చేశాడు. ఒక్కో ప్లాట్‌ను సుమారు రూ.3 నుంచి 5 లక్షల వరకు పేదలకు విక్రయించాడు. తక్కువ ధరకు ఇంటి జాగా వస్తుందన్న ఆశతో వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన కార్మికులు కొనుగోలు చేశారు. అయితే, ఈ భూమి అసైన్డ్ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం లేదు. అమాయక ప్రజలను బురిడీ కొట్టించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నోటరీ డాక్యుమెంట్ ద్వారా ప్లాటు విక్రయించాడు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు 2016లో నిర్మాణాలు చేపట్టారు. ఇండ్లకు అప్పటి అధికారులు ఇంటి నెంబర్లు, కరెంట్ మీటర్లు కూడా ఇచ్చారు. కానీ కొన్ని రోజులకు ఈ జాగాలు ప్రభుత్వానికి చెందినవి అని అధికారులే ఇండ్లను కూల్చేశారు. దీంతో నోటరీదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఆశ్రయించగా.. మాయమాటలు చెప్పి మరోసారి గుడిసెలు వేయించే ప్రయత్నం చేశాడు. ఇదే సమయంలో ప్రభుత్వ జాగాల్లో ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు 58, 59 జీవో ప్రకారం పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి జావేద్ మరోమారు బాధితుల నుంచి రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి ఒక్కో ప్లాట్‌కు రూ.50వేల నుంచి లక్ష వరకు వసూలు చేశాడు. కానీ రెగ్యులరైజ్ చేయించలేదు. ఈలోపు ఈ నెల 16వ తేదీన మళ్లీ అధికారులు గుడిసెలు కూల్చేశారు. అప్పటి నుంచి మాయమైన జావేద్.. ఇటీవల బాధితులు ఆ జాగాల్లో గుడిసెలు వేసేందుకు వెళ్తే.. ప్లేట్ ఫిరాయించి ఇక్కడ గుడిసెలు వేయడానికి వీల్లేదని బాధితులను అడ్డుకున్నాడు. ఒక్కో ప్లాటుకు రూ.10లక్షలు చెల్లిస్తేగానీ జాగాల్లో అడుగుపెట్టేది లేదని పోలీసు బలగాలతో వచ్చి బెదిరించాడని బాధితులు ఆరోపించారు. జావేద్ చేతిలో తాము మోసపోయామని బాధిత పేదలు గ్రహించారు. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని కోరారు.

బాధితులకు అండగా వ్యకాస

బాధితుల గుడిసెలను అధికారులు కూలగొట్టిన విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంగం రాష్ట్ర నేతలు బాధితులను పరామర్శించారు. వారికి అండగా నిలిచారు. బుధవారం నేతలు వట్టినాగులపల్లిలో పర్యటించి, వాస్తవాలపై ఆరా తీశారు. రియల్టర్ల చేతిలో బాధితులు మోసపోయారని గుర్తించారు. అనంతరం బాధితులతో కలిసి గండిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పేద ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేసి జీవో 186 ద్వారా పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే, రియల్ ఎస్టేట్ వ్యాపారి జావేద్‌ను వెంటనే అరెస్టు చేయాలి. లేనిపక్షంలో వ్యకాస ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

మియాపూర్ భూముల నుంచి కదలని మహిళలు

- ఘటనా స్థలానికి అధికారులు
- నచ్చజెప్పే యత్నం
- అధికారులపైకి రాళ్లు రువ్విన కొందరు
- ఓ అధికారికి గాయం, ఆటో అద్దాలు ధ్వంసం



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా మియాపూర్ భూముల్లో ఇండ్ల స్థలాలివ్వాలంటూ బైటాయించిన మహిళలు శనివారం కూడా అక్కడే తిష్ట వేశారు. రెండ్రోజుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు ఆ భూముల్లోనే భీష్మించి కూర్చున్నారు. ఇప్పటి వరకు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఓ మహిళ ఆధ్వర్యంలో మహిళలు పోరాటం చేస్తుండగా, ఇప్పుడు అదే స్థలాల మీదకు మరో మహిళ మరికొందరిని తీసుకొని వచ్చింది. ఆటోల్లో వందలాది తరలివచ్చిన వారు మియాపూర్ సర్వేనెంబర్ 100, 101లోని భూముల్లో ఎవరికి వారు తాళ్లు కట్టి, చీరలతో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. దీప్తి శ్రీనగర్‌నగర్ నుంచి శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తమకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కార్యాలయం ఎదుట ఈ ఆందోళన జరుగుతున్న సమయంలోనే మరోవర్గం భూ ఆక్రమణకు తెరలేపింది. శనివారం ఉదయం రెవెన్యూ, పోలీసు, హెచ్ఎండీఏ అధికారులు మరోసారి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదు.

కొద్దిసేపు ఉద్రిక్తత

పోలీసులు, ఆక్రమణదారుల మధ్య ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఏసీపీ నర్సింహారావు, సీఐ, పోలీసులు అధికారులు వచ్చి ప్రజలకు నచ్చజెప్పి సగం మందిని అక్కడి నుంచి పంపించారు. మరికొంత మంది అక్కడే బైటాయించారు. సాయంత్రం పోలీసులు, ఆక్రమణదారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు బందోబస్తు పెంచి జనాలను అక్కడి నుంచి చదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో ఆక్రమణదారులలో కొంత మంది వ్యక్తులు వెనుక నుంచి పోలీసులపైకి రాళ్లువిసిరారు. దీంతో పోలీసులు కొంతదూరం ఘటన స్థలం నుంచి పరుగులు తీశారు. ఈ ఘటనలో హెచ్ఎండీఏ సైట్ అధికారి రఘుకి గాయమైంది. పోలీసులు అనౌన్స్ చేసేందుకు తీసుకొచ్చిన ఆటో అద్దాలను పగులగొట్టారు. పోలీసులు జనాలను చదరగొడుతున్నా.. మరో వైపు నుంచి అక్కడికి చేరుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాదాపూర్ డీసీపీ వినీత్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రజలను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. వారు ఉంటున్న ప్రాంతాల్లోనే దరఖాస్తులు చేసుకోవాలని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇండ్లు ఇస్తుందని తెలిపారు. అందరూ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరగా.. కొందరు వెళ్లి పోయారు. మరికొందరు అక్కడే ఉండిపోయారు.

ఉప్పల్ భగాయత్‌లో పోకిరీలు

- ప్రేమ జంటపై యువకుల బెదిరింపులు
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐపై బదిలీ



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌తో పోకిరీల ఆగడాలు పెరుగుతున్నాయి. రాత్రి వేళల్లో జంటలను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాగే ఓ ప్రేమ జంటను కొందరు యువకులు ఫొటోలు తీసి బెదిరించారు. ఆ పై బ్లాక్ మెయిలింగ్ చేశారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాంతో ఎస్ఐపై బదిలీ వేటు పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పల్ కళ్యాణపురిలో నివసిస్తూ ఢిల్లీలో ఎల్ఎల్‌బి చదువుతున్న ఆదర్శ్, తన ప్రియురాలితో కలిసి ఈ నెల 14న రాత్రి 1:30 గంటలకు ఉప్పల్ హెచ్ఎండీఏ (భగాయత్)కు కారులో వచ్చారు. కారులో ఉండి మాట్లాడుకుంటున్న సమయంలో పీర్జాదిగూడకు చెందిన ఐదుగురు యువకులు అక్కడికి వచ్చారు. ప్రేమ జంట ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఆపై డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేశారు. ఆదర్శ్ వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేశాడు. ఆ తర్వాత యువకుల నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లిపోయారు. మరుసటి రోజు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తమపై బెదిరింపులకు పాల్పడిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ చేసి.. ఇతరులను అలా చేయకుండా హెచ్చరించి పంపించాలని కోరారు. దాంతో ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి ఆదేశాల ప్రకారం సెక్టర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారు ఎవరన్నది తెలుసుకోవడానికి ఇద్దరు యువకులు శివ, సంతోష్‌ను అర్ధరాత్రి రంగంలోకి దింపారు.

వీరిచ్చిన సమాచారం ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సోదరుడు అమరేందర్, ఉదయ్, మారుతి, రామ్‌చరణ్, శశివలిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పెట్టీ కేసు పెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఈ కేసులో ఎఫ్ఐఆర్ చేయించకుండా పెట్టీ కేసు మాత్రమే పెట్టించామని, అందువల్ల ఎస్ఐ శంకర్‌కు రూ.మూడు లక్షలు ఇవ్వాలని నిందితులను మధ్యవర్తులైన శివ, సంతోష్ డిమాండ్ చేశారు.

చివరకు వారి నుంచి రూ.2.70 లక్షలు తీసుకున్నట్టు తెలిసింది. అయితే, ఈ ఘటనలో ఎస్ఐ నిర్లక్ష్యంపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అతన్ని డీసీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఐదుగురు పోకిరీలను పోలీసులు అరెస్టు చేసినట్టు సమాచారం.

కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు

- వనరులను దోచుకోవటంలో అవి దొందూ దొందే :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రయోజనాలను, హక్కులను, వనరులను దోచుకోవటంలో కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సింగరేణి విషయంలో 'అవి రెండూ దొందూ దొందే...'నని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సింగరేణికి సంబంధించి సీఎం రేవంత్ అబద్ధాలను చూసి గోబెల్స్ కూడా సమాధి నుంచి తలదించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర జలవనరులను కేంద్రానికి తాకట్టు పెట్టిన కాంగ్రెస్, సింగరేణి ప్రయివేటీకరణలో బీజేపీకి సహకరిస్తోందని దుయ్యబట్టారు. గతంలో రాష్ట్రానికి చెందిన గనులను కేంద్రం రెండు కంపెనీలకు కేటాయించినా, బీఆర్ఎస్ అధికారంలో ఉండటం వల్ల అక్కడ మైనింగ్‌ను ప్రారంభించలేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు గనుల వేలంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని విమర్శించారు. సీఎం చెప్పిన రెండు కంపెనీలు గతంలో మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ప్రభుత్వ హయాంలో గనులను దక్కించుకున్నాయని వివరించారు. వేలం ప్రక్రియలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను తెలంగాణ ప్రజానీకం క్షమించబోదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎఫ్‌డీఐల్లో వృద్ధి సాధించిన తెలంగాణ... కేటీఆర్ ట్వీట్

గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశవ్యాప్తంగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) తగ్గినప్పటికీ తెలంగాణ వంద శాతానికి మించి ఎఫ్‌డీఐలను సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఇందుకు సంబంధించి బిజినెస్ లైన్ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆయన జత చేశారు.

లాభసాటి లేని మద్దతు ధరలు

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆందోళనలకు పిలుపుఇవ్వనుంది. ఈ ఆందోళన కార్యక్రమాలను రూపొందించేందుకు జులై 10న ఢిల్లీలో ఎస్కేఎం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఎస్కేఎం నాయకులు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'మోడీ ప్రభుత్వం లాభసాటిగా లేని మద్దతు ధరలు ప్రకటిస్తూ రైతులను అపహాస్యం చేస్తోంది' అని విమర్శించారు.

నాట్లు అయిపోయాక రైతు భరోసా ఇస్తారా.. ?

మాజీ మంత్రి సింగిరెడ్డి

- పార్టీ మారే పరిస్థితే లేదు : ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రైతు భరోసా డబ్బులు ఇప్పటికే అన్నదాతల ఖాతాల్లో జమకావాల్సి ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. కానీ నాట్లు ప్రారంభమయ్యాక కూడా ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవటం శోచనీయమన్నారు. నాట్ల సీజన్ అయిపోయాక రైతుల ఖాతాల్లో డబ్బులేస్తారా..? అని ఆయన ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమవేశంలో సింగిరెడ్డి మాట్లాడుతూ... రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి వచ్చే నెల 15 వరకూ డెడ్ లైన్ పెట్టటం సరికాదన్నారు. ఆ పథకానికి అర్హులెవరనేది ఇప్పటి వరకూ తేల్చకపోవటమేంటని ప్రశ్నించారు.

రిమ్స్‌లో జూడాల నిరసన

- కండ్లకు గంతలు
- సోమవారం నుంచి విధులు బహిష్కరిస్తాం :

జూడాల అధ్యక్షుడు సందీప్‌చారి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు డీఎంఈ, వైద్యశాఖ మంత్రికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌చారి అన్నారు. అధికారులు, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట కండ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. ఓపీ సేవలు పూర్తయిన తరువాత మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెండింగ్‌లో ఉందన్నారు. వాటిని చెల్లించాలని పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా, మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్లకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం వరకు ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే ఓపీ సేవలు కూడా బహిష్కరించి నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జూడాల ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కార్తీక్, సురజ్, కోశాధికారి బాలమురుగన్, జహ్నవి, రష్మీ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి నీట్ సెగ

(మొదటిపేజీ తరువాయి)



ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు వాకిరి అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. అనంతరం నాయకులను అరెస్టు చేశారు. నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ ఇంటి ఎదుట విద్యార్థులను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేశారు. అలాగే, మహబూబ్‌నగర్‌లో పెద్దఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

హైదరాబాద్ కాచిగూడలోని కిషన్‌రెడ్డి ఇంటిని విద్యార్థులు, యువకులు ముట్టడించారు. కిషన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దాంతో పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కోట రమేష్,అనగంటి వేంకటేష్ సహా మరికొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండి.జావిద్, తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, పలువురు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు ఉదయం కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అవకతవకలపై ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, పరీక్షలను మళ్లీ నిర్వహించాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలన్నారు. కిషన్ రెడ్డికి గనుల వేలం పాటపై ఉన్న శ్రద్ధ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌పై లేకపోవడం సిగ్గుచేటన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై ప్రధాని మోడీని 'ఛాయ్ పే చర్చా కార్యక్రమం' నిర్వహించేలా కిషన్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీచార్జ్

ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ ఇంటిని ముట్టడించగా.. పోలీసులు లాఠీచార్జి చేశారు. విద్యార్థి సంఘాల నాయకులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేసి 3వ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్షలో స్కామ్ జరిగిందని, ఒకే పరీక్ష కేంద్రంలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పరీక్ష పత్రం లీకేజీలో లక్షల రూపాయలు చేతులు మారాయని, లక్షలాది మంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 67 మందికి టాప్ ర్యాంకులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మోడీ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో కదం తొక్కిన విద్యార్థి లోకం

నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించి పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు వందలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో నిరసన తెలిపారు.

నీట్-2024, యూజీసీ నెట్ పరీక్షల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పాలకేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.

చనగాని నిరాహార దీక్ష

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలని హైదరాబాద్‌లో ఓయూ డా.బిఆర్.అంబేద్కర్ లైబ్రరీ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూజీసీ నెట్ లీకేజీ అయిందని రద్దు చేశారు కానీ నీట్‌ను ఎందుకు రద్దు చేయరని ప్రశ్నించారు. నీట్ లీకేజీలో బీజేపీ ఎంపీల హస్తం ఉందని, విద్యార్థుల భవిష్యత్ కంటే లీకేజీరాయుళ్ల బీజేపీకి ముఖ్యమా? అని ప్రశ్నించారు. అనంతరం ఆయనకు ఓయూ అధ్యాపకులు ప్రొఫెసర్ కాసిం, ప్రొఫెసర్ కొండ నాగేశ్వరావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

ఒలింపిక్స్‌కు నగాల్!

టెన్నిస్ స్టార్‌కు బెర్త్ లాంఛనమే



న్యూఢిల్లీ : భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగాల్ 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ కంటే మెరుగైన ర్యాంక్ ఆటగాళ్లు పారిస్ బరి నుంచి తప్పుకున్నారు. దీంతో విశ్వక్రీడల్లో పోటీపడే అవకాశం సుమిత నగాల్‌కు దక్కనుంది. ఈ మేరకు సుమిత్ నగాల్ సోషల్ మీడియా వేదికగా పారిస్ ఒలింపిక్స్ అర్హతను ప్రకటించాడు. '2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన విషయాన్ని మీతో పంచుకునేందుకు ఎంతో సంతోషిస్తున్నాను. నా కెరీర్‌లో ఇదో శిఖర సమాన ఘట్టం. ఒలింపిక్స్‌కు నా హృదయంలో ఎప్పుడూ ప్రత్యేక స్థానమే ఉంటుందని' నగాల్ సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నాడు. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జులై 4న పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఆటగాళ్ల జాబితాను విడుదల చేయనుంది. ఈ జాబితాలో సుమిత్ నగాల్ చోటు దక్కించుకోవటం లాంఛనమే. 26 ఏండ్ల నగాల్ ...వరుసగా రెండుసార్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన రెండో భారత సింగిల్స్ టెన్నిస్ ప్లేయర్‌గా నిలువనున్నాడు. లియాండర్ పేస్ 1992, 1996, 2000 ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో పోటీపడ్డాడు. 1996 ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

పారిస్‌లో పతకం సాధిస్తా!

స్టార్ షూటర్ ఇషా సింగ్



హైదరాబాద్ : 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తానని హైదరాబాద్ స్టార్ షూటర్ ఇషా సింగ్ ఆత్మవిశ్వాసం వెలిబుచ్చింది. 'ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించటం నా స్వప్నం. ఆ కల నేరవేరింది. ఇక మిగిలింది పారిస్‌లో పతకం ముద్దాడటమే. ఏడేండ్ల శ్రమకు ప్రతిఫలమే పారిస్ ఒలింపిక్స్ బెర్త్. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను' అని శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇషా సింగ్ దీమా వ్యక్తం చేసింది.

తేజస్‌కు సిల్వర్

వరల్డ్ అథ్లెటిక్స్ మీట్



జెనీవా : ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో భారత అథ్లెట్ సిల్వర్ మెడల్ సాధించాడు. పురుషుల 110 మీటర్ల హార్డిల్స్‌లో తేజస్ శిర్సె సత్తా చాటాడు. 21 ఏండ్ల తేజస్ ఈ విభాగంలో 13.60 సెకండ్లలో రేసును ముగించి రెండో స్థానంలో నిలిచాడు. కొలంబియా అథ్లెట్ 13.49 సెకండ్లతో పసిడి పతకం సాధించాడు. మహిళల లాంగ్‌జంప్‌లో శాలిని సింగ్ నాల్గో స్థానంతో సరిపెట్టుకుంది.

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా సెమీఫైనల్‌కు చేరుకుంది!. సూపర్8 దశలో వరుసగా రెండో విజయం సాధించిన భారత్ సెమీస్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకుంది. హార్దిక్ పాండ్య (50 నాటౌట్) అజేయ అర్థ సెంచరీకి తోడు పంత్, దూబె, కోహ్లి సైతం మెరువగా వివ్ రిచర్డ్స్ స్టేడియంలో టీమ్ ఇండియా అత్యధిక స్కోరు 196/5 సాధించింది. 197 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ చేతులెత్తేసింది. కుల్దీప్ యాదవ్ (3/19) మాయ, జశ్‌ప్రీత్ బుమ్రా (2/13) బూమ్‌బూమ్ ముంగిట బంగ్లాదేశ్ బ్యాటర్లు తేలిపోయారు. 50 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.

సెమీస్‌లో అడుగు!

- సూపర్8లో వరుసగా రెండో విక్టరీ
- బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం
- కుల్దీప్ మాయ, బుమ్రా బూమ్ బూమ్
- హార్దిక్ పాండ్య అజేయ అర్థ సెంచరీ

భారత్ 196/5, బంగ్లాదేశ్ 146/8



నవతెలంగాణ-నార్త్‌సౌండ్

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురులేదు. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన రోహిత్‌సేన.. సూపర్8లోనూ వరుసగా రెండో మ్యాచ్‌లో గెలుపొందింది. శనివారం జరిగిన సూపర్8 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన టీమ్ ఇండియా 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సూపర్8లో చివరి మ్యాచ్‌కు ముందే సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది!. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/19), పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (2/13) మ్యాజిక్‌తో 197 పరుగుల రికార్డు ఛేదనలో బంగ్లాదేశ్ చతికిల పడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (40, 32 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), తంజిద్ హసన్ (29, 31 బంతుల్లో 4 ఫోర్లు), రిషద్ (24, 10 బంతుల్ల 1 ఫోర్, 3 సిక్సులు) ఆశల్లేని మ్యాచ్‌లో ఓ ప్రయత్నం చేశారు. అంతకుముందు, హార్దిక్ పాండ్య (50 నాటౌట్, 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. విరాట్ కోహ్లి (37, 28 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), రిషబ్ పంత్ (36, 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) సహా శివం దూబె (34, 24 బంతుల్లో 3 సిక్సులు) విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేయగా భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఈ గ్రౌండ్‌లో జరిగిన టీ20ల్లో ఇదే అత్యధిక స్కోరు కావటం విశేషం. హార్దిక్ పాండ్య 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



కలిసికట్టుగా కొట్టారు : టాస్ నెగ్గిన బంగ్లాదేశ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బౌలర్లకు అనుకూలించే పిచ్‌పై బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (23, 11 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ దూకుడు ప్రదర్శించాడు. కోహ్లి (37) నెమ్మదిగా ఆడినా రోహిత్ దూకుడుతో తొలి వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. షకిబ్ ఓవర్లో భారీ షాట్‌కు వెళ్లిన రోహిత్ నిష్క్రమించినా.. రిషబ్ పంత్ (36) తోడుగా కోహ్లి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడీ 27 బంతుల్లో 32 పరుగులు నమోదు చేసింది. అప్పటికే మూడు సిక్సర్లు బాదిన ఉత్సాహంలో హసన్ షకిబ్ ఓవర్లో క్రీజు వదిలొచ్చిన కోహ్లి వికెట్లను కోల్పోయాడు. అదే ఓవర్లో సూర్యకుమార్ యాదవ్ (6) సైతం అవుటయ్యాడు. దీంతో భారత ఇన్నింగ్స్‌లో వేగం కాస్త మందగించింది. అయినా, పంత్ సహజశైలిలో రెచ్చిపోయాడు. విలక్షణ షాట్లతో పరుగులు పిండుకున్నాడు. రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో అలరించినా.. రివర్స్ స్వీప్‌కు ప్రయత్నించి వికెట్ పారేసుకున్నాడు. క్రీజులో నిలదొక్కుకునేందుకు సమయం తీసుకున్న శివం దూబె (34) స్పిన్నర్లపై విరుచుకుపడ్డాడు. మూడు సిక్సర్లతో చెలరేగాడు. ఇక ఇన్నింగ్స్‌కు వైస్ కెప్టెన్‌కు హార్దిక్ పాండ్య (50 నాటౌట్) అదిరే ముగింపు అందించాడు. 180 పరుగులు చేసేలా కనిపించిన భారత్‌కు 196 పరుగుల భారీ స్కోరు అందించాడు. ముస్తాఫిజుర్ రెహమాన్ వేసిన చివరి ఓవర్లో బౌండరీల మోత మోగించిన పాండ్య 27 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. అక్షర్ పటేల్ (3 నాటౌట్) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

కుల్దీప్, బుమ్రా మ్యాజిక్ : 197 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ తేలిపోయింది. ఓపెనర్లు లిటన్ దాస్ (13), హసన్ (29) తొలి వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం అందించినా.. ఏ దశలోనూ బంగ్లాదేశ్ లక్ష్యం దిశగా సాగలేదు. హార్దిక్ పాండ్య పవర్‌ప్లేలో భారత్‌కు తొలి బ్రేక్ అందించగా.. మిడిల్ ఓవర్లలో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయ చేశాడు. హసన్, తౌహిద్ హృదయ్ (4), షకిబ్ అల్ హసన్ (11) వికెట్లతో బంగ్లాదేశ్ ఆశలను ఆవిరి చేశాడు. బుమ్రా పదునైన పేస్‌ను ఎదుర్కొనేందుకు బంగ్లా బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిన తరుణంలో కెప్టెన్ నజ్ముల్ శాంటో (40) ఒంటరి పోరాటం చేశాడు. అతడికి మరో బ్యాటర్ నుంచి సహకారం దక్కలేదు. ఆఖర్లో టెయిలెండర్ రిషద్ (24) ఓటమి అంతరాన్ని కుదించాడు. బుమ్రా, అర్షదీప్ సింగ్‌లు రెండేసి వికెట్లతో ఆకట్టుకున్నారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు బంగ్లాదేశ్ 146 పరుగులే చేసింది. 50 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది.

మహిళా ఆర్చర్ల హ్యాట్రిక్

ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 3



న్యూఢిల్లీ : భారత మహిళల ఆర్చరీ త్రయం వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్‌కౌర్ హ్యాట్రిక్ కొట్టారు. 2024 ఆర్చరీ ప్రపంచకప్‌లో తీన్‌మార్ మోగించారు. వరుసగా ప్రపంచకప్ మూడో స్టేజ్‌లో స్వర్ణం సాధించారు. మహిళల టీమ్ కాంపౌండ్ విభాగంలో శనివారం జరిగిన పసిడి వేటలో ఈస్టోనియా ఆర్చర్లను మనోళ్లు ఓడించారు. 232-229తో పసిడి పోరులో పైచేయి సాధించారు. వరుసగా మూడో బంగారు పతకం సాధించి రికార్డు నెలకొల్పారు. మెన్స్ రికర్వ్ విభాగంలో ప్రియాన్ష రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో 148-149తో నెదర్లాండ్స్ ఆర్చర్‌కు ప్రియాన్ష పసిడి పతకం కోల్పోయాడు.

గ్రూప్ దశ మ్యాచుల్లో ఆకట్టుకునే ప్రదర్శన చేసిన ఆతిథ్య అమెరికా (యుఎస్ఏ) సూపర్8లో అగ్ర జట్ల ముందు నిలువలేకపోతుంది!. తొలుత దక్షిణాఫ్రికా, ఇప్పుడు వెస్టిండీస్‌లు అమెరికాపై అలవోక విజయం సాధించాయి. సూపర్8లో రెండు పరాజయాలు చవిచూసిన అమెరికా సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. తొలి మ్యాచ్‌లో సఫారీ చేతిలో ఓడినా.. అమెరికాపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన ఆతిథ్య వెస్టిండీస్ సెమీస్ రేసులో నిలిచింది.

విండీస్ రేసులోనే!

- అమెరికాపై 9 వికెట్ల తేడాతో గెలుపు
- రాణించిన హోప్, రోస్టన్ ఛేజ్
- అమెరికా 128/10, వెస్టిండీస్ 130/1



నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ రేసులో ఆతిథ్య వెస్టిండీస్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. సూపర్8 గ్రూప్-2లో శనివారం అమెరికాపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన కరీబియన్లు నెట్‌రన్‌రేట్‌ను సైతం భారీగా మెరుగుపర్చుకున్నారు. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షాయ్ హోప్ (82 నాటౌట్, 39 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో విశ్వరూపం చూపించాడు. 10.5 ఓవర్లలోనే వెస్టిండీస్ లాంఛనం ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 19.5 ఓవర్లలో 128 పరుగులకు కుప్పకూలింది. స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ (3/19), పేసర్ ఆండ్రీ రసెల్ (3/31) మూడేసి వికెట్ల మ్యాజిక్‌తో అమెరికాను వణికించారు. యుఎస్ఏ తరఫున ఆండ్రియస్ గౌస్ (29, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ (20, 19 బంతుల్లో 2 ఫోర్లు), మిలింద్ కుమార్ (19, 21 బంతుల్లో 1 ఫోర్) రెండెంకల స్కోరుతో ఆదుకున్నారు. మూడు వికెట్ల మాయ చేసిన రోస్టన్ ఛేజ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

హోప్ ధనాధన్ : 129 పరుగుల ఛేదనలో విండీస్ ఓపెనర్ షాయ్ హోప్ (82 నాటౌట్) విశ్వరూపం చూపించాడు. ఎనిమిది సిక్సరుల, నాలుగు ఫోర్లతో అమెరికా బౌలర్లను దంచికొట్టాడు. మరో ఓపెనర్ జాన్సన్ చార్లెస్ (15, 14 బంతుల్లో 2 ఫోర్లు) నెమ్మదిగా ఆడినా.. హోప్ దూకుడు చూపించాడు. పవర్‌ప్లేలో విండీస్ 58 పరుగులే చేసినా.. ఆ తర్వాత అసలు కథ మొదలైంది. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 26 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన హోప్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. నికోలస్ పూరన్ (27 నాటౌట్, 12 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) సైతం రాణించాడు. 10.5 ఓవర్లలోనే 130 పరుగులు చేసిన వెస్టిండీస్ మరో 55 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించింది.

అమెరికా విలవిల : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన అమెరికాను విండీస్ బౌలర్లు విలవిల్లాడించారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్ స్టీవెన్ టేలర్ (2)ను అవుట్ చేసిన రసెల్.. యుఎస్ఏ పతనానికి నాంది పలికాడు. ఆండ్రియస్ గౌస్ (29), నితీశ్ కుమార్ (20) రెండో వికెట్‌కు 48 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ ఈ జోడీ స్వల్ప వ్యవధిలో నిష్క్రమించటంతో అమెరికా కష్టాలు ఎక్కువయ్యాయి. స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ వరుసగా వికెట్లు పడగొట్టి అమెరికాను కోలుకోలేని దెబ్బతీశాడు. ఆరోన్ జోన్స్ (11), కోరే అండర్సన్ (7), హర్మీత్ సింగ్ (0) నిరాశపరిచారు. మిలింద్ కుమార్ (19), వాన్ (18), అలీ ఖాన్ (14)లు అమెరికాకు మూడెంకల స్కోరు అందించగలిగారు. 19.5 ఓవర్లలో 128 పరుగులకే అమెరికా కుప్పకూలింది. రసెల్, ఛేజ్‌లు చెరో మూడు వికెట్లు పడగొట్టారు.



ఫీల్ గుడ్ లవ్ స్టోరీ

ఓ డిఫరెంట్ కంటెంట్‌తో 'ప్రణయ గోదారి' అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో కమెడియన్ అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన నటుడు సదన్, ప్రియాంక ప్రసాద్, సునీల్ రావినూతల, 30 ఇయర్స్ పృథ్వీ, సాయి కుమార్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.

పిఎల్‌వి క్రియేషన్స్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా పారమళ్ళ లింగయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో బిజీగా ఉన్న యూనిట్.. జోరుగా ప్రమోషన్స్ కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీలో నుంచి ఫీల్ గుడ్ సాంగ్‌ను సంగీత దర్శకులు కోటి చేతుల మీదుగా లాంచ్ చేశారు. 'కలలో కలలో..' అంటూ సాగిపోతున్న ఈ ప్రేమ గీతంలో లవ్ బీట్ అదిరిపోయిందని చెప్పుకోవాలి. ఇక గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరణ చేసిన సీన్స్ ఫ్రెష్ ఫీలింగ్ తెప్పిస్తున్నాయి. హీరో, హీరోయిన్ కాస్ట్యూమ్స్‌తో పాటు సైడ్ డాన్సర్ల లుక్స్ కూడా ఈ పాటలో ఆకర్షణీయంగా మారాయి.

మ్యూజిక్ డైరెక్టర్ కోటి మాట్లాడుతూ, 'ఈ సాంగ్ చూస్తుంటే ఫ్రెష్ ఫీలింగ్ కలుగుతోంది. అన్ని వర్గాల ఆడియెన్స్ మెచ్చేలా ఈ సాంగ్ షూట్ చేశారు. పాటలోని లిరిక్స్, బీట్, అందుకు తగ్గ సన్నివేశాలు, నటీనటుల వేషధారణ అన్నీ కూడా చాలా బాగా కుదిరాయి' అని తెలిపారు. ఫీల్ గుడ్ లవ్ స్టోరీ అనుభూతితోపాటు యువతను ఆకర్షించే ఎన్నో పాయింట్స్ కలగలిపి రాబోతున్న ఈ సినిమాకు మార్కండేయ సంగీతం అందిస్తున్నారు.

నవచిత్రం

బూమ్ బూమ్ లచ్చన్న..



అనూష కృష్ణ, వినోద్ కిషన్

'నా పేరు శివ', 'అంధగారం' తదితర హిట్ చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్‌ను హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా 'పేక మేడలు'. 'ఎవరికీ చెప్పొద్దు' సినిమాతో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి విజయాన్ని అందుకున్న నిర్మాత రాకేష్ వర్రే తాజాగా ఈ సినిమాతో ప్రేక్షకులు ముందుకు వస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర టీజర్ విశ్వక్‌సేన్ చేతుల మీదుగా విడుదలై, చాలా మంచి స్పందనను రాబట్టుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ 'బూమ్ బూమ్ లచ్చన్న' పాటను మేకర్స్ విడుదల చేశారు.

'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చురో లచ్చన్న..' అంటూ సాగే ఈ పాటను మనో పాడగా, భార్గవ్ కార్తీక్ అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. స్మరణ్ సాయి అందించిన మ్యూజిక్ చాలా ఎట్రాక్టీవ్‌గా కొత్తగా ఉంది. ఈ పాట ఆద్యంతం వినోదాత్మకంగా చిత్రీకరించినట్టుగా పాటను చూస్తే తెలుస్తోంది. ఒక మంచి కాన్సెప్ట్, కంటెంట్ ఉన్న స్టోరీగా ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది. ఈ సినిమాను జూలైలో విడుదల చేస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది.

టెక్ స్టార్టప్‌లకు నిధుల కటకట

- గతేదాది నిధుల్లో 77% పతనం
- పెట్టుబడులకు ఇన్వెస్టర్ల అనాసక్తి
- విస్తరణలో సవాళ్లు
- 2023లో కొత్తగా 480 సంస్థల ఏర్పాటు



న్యూఢిల్లీ: భారత టెక్ స్టార్టప్‌లు నిధుల సమీకరణలో గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. మోడీ సర్కార్ కార్పొరేట్లకు ఇస్తున్న ఆర్థిక ప్రాధాన్యత స్టార్టప్‌లకు ఇవ్వడం లేదని పలు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు వెంచర్ కాపిటలిస్టు పెట్టుబడిదారులు భారత స్టార్టప్‌లకు పెట్టుబడులను సమకూర్చడంలో వెనక్కి తగ్గుతున్నారు. స్టార్టప్ నిధులు, వాటి సవాళ్లపై టెక్నాలజీ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్, గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ జిన్నోవ్ ఓ కీలక నివేదికను వెల్లడించింది. ఆ వివరాలు.. గతేడాది దేశంలో దాదాపు 480 కొత్త డీప్‌టెక్ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రపంచంలోనే భారత్ మూడవ అతిపెద్ద స్టార్టప్‌ల హబ్‌గా మారింది. మరోవైపు ఈ స్టార్టప్‌ల నిధుల సమీకరణపై నీలినీడలు కమ్ముకోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. డీప్‌టెక్ స్టార్టప్‌లు అనేవి సాంకేతికత లేదా ఇంజనీరింగ్ పురోగతులపై ఆధారపడి విప్లవాత్మక పరిష్కారాలను అందించే లక్ష్యంగా ఏర్పాటు చేసినవి.

'ఇండియాస్ డీప్‌టెక్ డాన్: ఫోర్జింగ్ ఎహెడ్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదికలో ప్రధానంగా స్టార్టప్‌లు మూడు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణ, నైపుణ్యవంతుల కొరత, అంతర్జాతీయ విస్తరణ ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. "భారత్‌లో ప్రస్తుతం 3600 పైగా డీప్‌టెక్ స్టార్టప్‌లు ఉన్నాయి. వాటిలో 480 గతేడాది స్థాపించబడ్డాయి. 2022లో స్థాపించబడిన డీప్‌టెక్ స్టార్టప్‌ల సంఖ్య కంటే దాదాపు 2 రెట్లు ఎక్కువ" అని నివేదిక పేర్కొంది. కాగా ఆ సంస్థల హామీలు, లక్షాలు నిధుల కొరత వల్ల నెరవేరలేకోతున్నాయి. కొన్ని ఇతర ప్రముఖ డీప్‌టెక్ పర్యావరణ వ్యవస్థల్లోని స్టార్టప్‌లతో పోలిస్తే, భారత డీప్‌టెక్ స్టార్టప్‌లు ప్రతి దశలోనూ మధ్యస్థ పెట్టుబడిలో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నిధుల కొరత కొన్ని ఆశాజనకమైన టెక్ స్టార్టప్‌ల సామర్థ్యం పెంపును పరిమితం చేస్తుంది. దీంతో ప్రపంచ టెక్ స్టార్టప్‌లతో పోటీపడలేక పోతున్నాయి." అని నాస్కామ్ తన రిపోర్ట్‌లో పేర్కొంది.

కేవలం రూ.7100 కోట్లతో సరి..

గడిచిన ఐదేళ్లలో భారత టెక్ స్టార్టప్‌లు 10 బిలియన్ల (రూ.83వేల కోట్లు) నిధులు సమీకరించాయి. 2023లో కేవలం 850 మిలియన్ డాలర్ల (రూ.7100 కోట్లు) నిధులు అందుకున్నాయి. 2022లోని 3.7 బిలియన్ డాలర్ల (రూ.30వేల కోట్లు)తో పోల్చితే.. గతేడాది నిధుల్లో 77 శాతం పతనం చోటు చేసుకుంది. అదే విధంగా 2022తో పోల్చితే 2023లో ఆర్థిక ఒప్పందాల్లో 25 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గతేడాది 74 టెక్ స్టార్టప్‌లు కృత్రిమ మేధా (ఎఐ) ఆధారంగా నెలకొల్పబడ్డాయి. ఎఐ ఆధారిత స్టార్టప్‌ల్లో 86 శాతం నిధులను సమీకరించాయి.

మెగా డీల్స్ జీరో..

2022తో పోలిస్తే 2023లో భారతదేశ డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం ఫండింగ్ రౌండ్‌లలో పాల్గొనే పెట్టుబడిదారుల సంఖ్య 60 శాతానికి పైగా పడిపోయింది. ఇంతకుముందు నిధులను అందించిన అనేక మంది పెద్ద ప్రపంచ పెట్టుబడిదారులు అనాసక్తి చూపడం ఈ క్షీణతకు కారణం. "2022లో తొమ్మిది పెద్ద ఒప్పందాలతో పోలిస్తే 2023లో మెగా డీల్‌లు అసలు లేకపోవడంతో పెద్ద టికెట్ పెట్టుబడులపై పెట్టుబడిదారుల ప్రాధాన్యత తగ్గుముఖం పట్టిందని స్పష్టం అవుతుంది" అని నివేదిక పేర్కొంది. డీప్‌టెక్‌లో పెట్టుబడి పెట్టేటప్పుడు వాటి ప్రతిఫలం కోసం సుదీర్ఘకాలం ఎదురు చూడాల్సి రావడం అతిపెద్ద సవాలు అని వెంచర్ కాపిటలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

బహుముఖ విధానం అవసరం..

పెట్టుబడిదారులు తక్కువ మొత్తం పరిమాణాలు, తక్కువ రిస్కుతో సీడ్ స్టేజ్ డీప్‌టెక్ స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టడానికి ఇష్ట పడటంతో నిధుల పరిమాణం మరింత క్షీణించింది. "ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి టెక్ స్టార్టప్‌ల అభివృద్ధికి భారత్‌కు బహుముఖ విధానం అవసరం. ఇన్నోవేషన్ క్లస్టర్‌లను గుర్తించి బలోపేతం చేయాలి. మూలధనం, పటిష్టమైన మౌలిక సదుపాయాల లభ్యతను సులభతరం చేయాలి. నేషనల్ డీప్‌టెక్ స్టార్టప్ పాలసీ (ఎన్‌డిటిఎస్‌పి) అమలును వేగవంతం చేయాలి. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. నిధులు, వాటి పెరుగుదలకు మద్దతునిచ్చే మార్కెట్ పర్యావరణ వ్యవస్థ, వాణిజ్యీకరణకు సహాయపడే బలమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలి." అని నాస్కామ్, గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ జిన్నోవ్ తన రిపోర్టులో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

జయహో రామానుజ రిలీజ్‌కి రెడీ

లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ'. ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా, సుమన్, ప్రవళ్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించ నున్నారు.

రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఇటీవల ఈ సినిమా పాటలను తిలకించిన తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నటుడు, దర్శకుడు సాయి వెంకట్‌కు అభినందనలు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఈచిత్రంలోని లిరికల్ సాంగ్స్ విడుదల కార్యక్రమాన్ని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.



సాయి వెంకట్

దర్శకుడు, హీరో డా.లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలోని పాటల రూపకల్పన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. సంగీత, సాహిత్యాలు గొప్పగా ఉండాలని ఎంతో టైమ్ తీసుకుని, ఖర్చుకు వెనకాడకుండా డిజైన్ చేశాం. మహిళల్ని గౌరవించాలని, కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని తెలిపారు. 'నాన్న (సాయి వెంకట్) సినిమా కోసం ఎంత శ్రమించారో, ఈ పాటలు అందంగా తీసుకొచ్చేందుకు అంతే జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమా నాన్నకి ఒక కల. భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమాను నిర్మించాం. జూలై 12న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం' అని నిర్మాత ప్రవళ్లిక అన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గ్రూప్ 1 మెయిన్స్ కోసం ఒక పోస్టుకు వంద మంది నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వంద మందిని అనుమతించారనీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేతగా అసెంబ్లీ వేదికగా ఇదే అంశాన్ని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా? అధికార పక్షంలోకి వస్తే మరోలా ఉండటమే మీ విధానమా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలపాలని డిమాండ్ చేశారు.

పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎక్కువ వ్యవధి ఉండే విధంగా షెడ్యూల్ సవరించాలని సూచించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి తదనుగుణంగా నోటిఫికేషన్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 25 వేల పోస్టులతో మెగా డియస్సీని నిర్వహించాలనీ, నిరుద్యోగ భృతి కింద రూ.4 వేలు నెలనెలా చెల్లించాలని కోరారు. జీవో 46తో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

పోచారం రాజీనామా చేయాలి : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఏ .జీవన్ రెడ్డి, గణేష్ బిగాల డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలన్న సీఎం రేవంత్ రెడ్డి సిగ్గు లేకుండా పోచారాన్ని చేర్చుకున్నారని విమర్శించారు. ఆయన రైతుల కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని రాళ్ల (క్రషర్) కోసం వెళ్లారని విమర్శించారు. బాన్సువాడలో ఉప ఎన్నిక జరగడం తథ్యమనీ, మళ్లీ బీఆర్ఎస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీపీఆర్ చేసి 11నెలల బాబును కాపాడిన 108 సిబ్బంది



నవతెలంగాణ - హయత్‌నగర్

సీపీఆర్ చేసి 11నెలల బాబును 108 సిబ్బంది కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..పెద్ద అంబర్‌పేటలోని లక్ష్మా రెడ్డి పాలెంలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు జీవన్ బాబు అనే 11నెలల బాబు ఉన్నాడు. బాబు శనివారం అతని ఇంట్లో వాటర్ బకిట్లో తలకిందులుగా పడ్డాడు. రెండు నిముషాల తరువాత తల్లీదండ్రులు చూసుకోగా బాబు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే 108కి కాల్ చేయగా.. సిబ్బంది వచ్చి బాబును పరిశీలించి..సీపీఆర్ చేశారు. దీంతో బాబు స్పృహలోకి వచ్చాడు. వెంటనే ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్ సూచనల ప్రకారం నెబులైజెషన్ చేసుకుంటూ నిలోఫర్ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు.

పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, ఆర్‌ఓ అంజన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నర్సింహ, కార్మికులు పాల్గొన్నారు.



గుడిసె వాసులకు పునరావాసం కల్పించాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ- హయత్ నగర్

గుడిసె వాసులకు పునరావాసం కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా హయత్ నగర్ పరిధిలోని విజయవాడ ప్రధాన రహదారి రేడియో స్టేషన్ పక్కన గత కొంత కాలంగా నివసిస్తున్నవారి గుడిసెలను నేషనల్ హైవే సిబ్బంది, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు తొలగించారు. ఈ మేరకు ఆ బాధితులు శనివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పలువురిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుతం వారు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న స్థలంలో గతంలో మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాదాపుగా 75 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే రాబోయే వినాయక చవితి నేపథ్యంలో విగ్రహాలు తయారు చేస్తున్న కుటుంబాల గుడిసెలు కూలగొట్టి వారి జీవనోపాధి మీద దెబ్బకొట్టొద్దని కోరారు. వారు చాలా ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. కావున రెండు నెలల గడువు ఇవ్వాలని, అలాగే వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...

చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ..ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. వారికి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రెండు నెలల గడువు కోరారని.. దానికి వారు అనుమతి ఇచ్చారని తెలిపారు. అనంతరం గుడిసెవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, నక్క రవీందర్ గౌడ్, చెన్నగోని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, మల్లీశ్వరి రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, కృష్ణరెడ్డి, స్కైలాబ్, సందీప్, చంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మధు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా పథకం' పైసలు విడుదల చేయాలి



- వక్కలంక శ్రీనివాస్ రావు

నవతెలంగాణ - చైతన్యపురి

వివేకానంద విదేశీ విద్యా పథకం పైసలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిచేర్ల నాగేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పోస్ట్ కార్డ్స్ ఉద్యమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా సాంక్షన్ లెటర్లు పొంది ఆరు నెలలైనా పైసలు రిలీజ్ కాకపోవడంతో వందలాదిమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. అన్ని సంఘాల వారు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి బ్రాహ్మణుడు ఒక పోస్ట్ కార్డును పంపించాలన్నారు. వందలాది మంది అప్పులు చేసి విదేశాలకు ఉన్నత చదువులకు పంపిన విద్యార్థుల తల్లీదండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని వ్యాపారాల నిమిత్తం బెస్ట్ స్కీంకి సాంక్షన్ చేసి నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. త్వరలో హైదరాబాద్‌లో అన్ని సంఘాల వారితో పోస్ట్ కార్డ్స్ ఉద్యమాన్ని మొదలుపెడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్త్రీ శక్తి అనురాధ, నాగరాజ్, పవన్, రఘునందన్ పాల్గొన్నారు.

స్కూల్ బస్ డ్రైవర్లకు

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ఉండాలి



- జేటిసి రమేష్
- నగరంలో ప్రయివేటు స్కూల్ యాజమాన్యాల బస్ డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీ పై అవగాహన

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్కూల్ బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి. రమేష్ అన్నారు. శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జిల్లాలోని స్లేట్ ది స్కూల్ నుంచి డ్రైవర్లు, సెంటియా గ్లోబల్ స్కూల్‌తో పాటు ఇతర పాఠశాలల నుంచి మొత్తం వంద మందికి పైగా డ్రైవర్లు, ఇతర పౌరులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేటీసీ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలకు గురి కాకుండా పాటించాల్సిన నియమాలు, డ్రైవింగ్ చేసే ముందు పిల్లలపై శ్రద్ధగా ఉండాలని వారికి అవగాహన కల్పించారు.

మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని చెప్పారు. ఈ అవగాహన సదస్సుకు హాజరైన బస్ డ్రైవర్లకు రి ఫ్రెషర్ ట్రైనింగ్ సర్టిఫికెట్స్ జేటీసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవోలు పి.పురుషోత్తంరెడ్డి, సి.పి. వెంకటేశ్వరరావు, ఎంవీఐలు సిహెచ్‌వి సత్యనారాయణ, ఎం. సురేష్ రెడ్డి, నరేందర్ నాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'అజాంపురా డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ - సంతోష్‌నగర్

అజాంపురా డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ షేక్ మొహిద్దిన్ అబ్రార్ అన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గంలోని అజాంపురా డివిజన్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలోని సమస్యలను పరిష్కరించే బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని అన్నారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని కాలనీ వాసులకు సూచించారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్పొరేటర్ వెంట అధికారులు, కాలనీ నాయకులు తదితరులు ఉన్నారు.







నెంబర్ ప్లేట్స్ నిండా నిర్లక్ష్యం

నవతెలంగాణ - సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో కోటికిపైగా జనాభా వుండగా, వీరికితోడు దాదాపు 60లక్షలకుపైగా వాహనాలున్నాయి. వాటిలో 70 శాతం ద్విచక్ర వాహనాలుండగా మిగిలినవి కార్లు, ఆటోలు రోడ్లపై తిరుగుతున్నాయి. వీటికితోడు ప్రతిరోజు కొత్త వాహనాలు వందల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయి. వీరిలో చాలా మంది ట్రాఫిక్ నిబంధనలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పలు సర్వేలో తేలింది. ట్రాఫిక్ నిబంధనలను పాటించని కారణంగా నగరంలో అధిక శాతం రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు మద్యం సేవించి వాహనాలు నడిపిస్తుంటే మరికొందరు, అడ్డదిడ్డంగా వాహనాలు నడిపిస్తున్నారు. రెడ్ సిగ్నల్ పడినా దూసుకెళ్తున్నారు. ఇంకొందరు సెల్‌ఫోన్ డ్రైవింగ్ లేదా రాంగ్ రూట్‌లో యథేచ్ఛగా వెళ్లడంతో ఎదురుగా వచ్చే వారిని ఢీ కొడుతున్నారు. ఈ క్రమంలో అమాయకులు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదం చేసిన వారిని పట్టుకోవాలని పోలీసులు ప్రయత్నిస్తే కష్టతరమవుతోంది. చాలా మంది వాహనదారులు నెంబర్ ప్లేట్స్ లేకుండానే రోడ్లపైకి వస్తుండడంతో పోలీసులకు చిక్కడం లేదు. దాంతో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

పోలీసులు పట్టుకోలేరన్న ధీమా

ద్విచక్ర వాహనాలతో రోడెక్కే యువకులకు పగ్గాలు లేకుండా పోతోంది. ఎలాగూ నెంబర్ ప్లేట్ లేదు, పోలీసులు పట్టుకోలేరన్న ధీమాతో అధిక శాతం మంది యువకులు రేసింగ్‌లో పాల్గొంటున్నారు. మరికొందరైతే ట్రాఫిక్ నింబంధనలు తమకు వర్తించవన్న తీరులో వ్యవహరిస్తున్నారు. రెడ్ సిగ్నల్ ఉన్నా దూసుకెళ్తున్నారు. పోలీసులు గుర్తించకుండా కొందరు యువకులు వాహనానికి ఉన్న నంబర్ ప్లేట్లను ఓ పక్కా వంచేస్తున్నారు. మరికొందరు రంగులు వేస్తున్నారు. ఇంకొందరు పేయింట్ పోయేట్టు నెంబర్‌ను తుడిచేస్తున్నారు. ఇంకొందరు మాస్కులు పెట్టడం, నెంబర్ ప్లేట్స్ ఉన్నా వాటికి ఏదో అడ్డం పెడుతున్నారు. ఇలా చేస్తున్న వారే రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలపై దూసుకెళ్తున్నారు. రోడ్డుపై ప్రమాదం చోటు చేసుకున్నా ఆగకుండా దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా పోకిరీలు, నేరస్తులు, ఆకతాయిలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా నగరంలో నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలతోపాటు మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో ఈ నెల 21న నిర్వహించిన ప్రత్యేక తనిఖీలల్లో 85 మంది వాహనదారులపై 35 ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంతేకాకుండా దాదాపు 40 మంది మైనర్లను పోలీసులు పట్టుకున్నారు.

ఏదైనా సంఘటన జరిగితే అంతే సంగతులు

నగరంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో 89 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే. బాధితుల్లోనూ యువతే ఎక్కువగా ఉంటున్నారు. కొన్ని సందర్భాలల్లో పాదాచారులు, అమాయకులు మరిణిస్తున్నారు. ఎలాంటి తప్పుచేయని వారు మృతి చెందడం అందరినీ కలిచివేస్తోంది. రోడ్డు ప్రమాదాలల్లో తమ వారు మృతిచెందడం చూసి బాధితుల తల్లిదండ్రుల బోరున విలపిస్తున్నారు. కొందరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడం, మరికొన్ని సంఘటనలో క్షతగాత్రులుగా మారుతున్నారు. అయితే ఢీ కొట్టిన వాహనాలను పట్టుకోవడంలో కొన్నిసార్లు పోలీసులకు కష్టంగా మారుతోంది. కొన్ని వాహనాలకు నకిలీ నెంబర్లుండగా, మరి కొన్ని వాహనాలకు నెంబర్లు లేకుండానే తిరుగుతున్నారు. ఇంకొందరు ఉన్న నెంబర్ ప్లేట్‌ను వంకరగా వంచేస్తున్నారు. దాంతో ఏదైనా సంఘటన జరిగిన సమయంలో పోలీసులు విచారణ ముందుకు వెళ్లడం లేదు.

ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి

నగరంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టామని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. మైనర్లకు వాహనాలివ్వొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే వాహన యజమానులకు లేదా సంబంధిత వ్యక్తులకు మూడు నెలల జైలు, రూ.5000ల జరిమానా పడుతుందన్నారు. రవాణాశాఖ నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్స్ సరిగ్గా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - హయత్ నగర్


హయత్ నగర్ డివిజన్‌లోని స్వగృహ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డివిజన్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ డ్యాగల రాకేష్ కుమార్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో భూగర్భ డ్రయినేజీ, తాగునీటి పైపులైన్ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.. సాధ్యమైనంత తొందరగా కాలనీలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతి అందజేసిన వారిలో హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడేది కాంగ్రెస్'



నవతెలంగాణ - హస్తినాపురం


ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రధాన హామీల్లో భాగంగా రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. అర్హులైన రైతులకు రుణ మాఫీ ప్రక్రియ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వేగవంతం చేయడం శుభపరిణామమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కాలయాపన చేసిందే గానీ పూర్తి స్థాయిలో పారదర్శకంగా రుణ మాఫీ చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతులకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. రైతులు, ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు.



ఇటీవల జరిగిన నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి నోరు మెదపకపోవడంపై నిరసనగా పీవైఎల్ బాలాపూర్ ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేష్ ఆధ్వర్యంలో శనివారం పీవై ఎల్ విద్యార్థి సంఘం నాయకులు మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. అక్కడ ఉన్న పోలీసులు విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహిళ అదృశ్యం



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఓ మహిళ అదృశ్యమైన ఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్‌కు చెందిన అఫ్రోజ్ ఫాతిమా...ఈ నెల 18న ఇంటి నుండి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


- రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు



నవతెలంగాణ - వనస్థలిపురం

రోడ్డు భద్రత అందరి బాధ్యత అని రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు అన్నారు. వనస్థలిపురం ఆటోనగర్‌లోని శ్రీనివాస ట్రావెల్స్, అండ్ టూర్స్ గ్యారేజీలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్కే ఎస్‌సి) ట్రాఫిక్ సేఫ్టీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీనివాసులుతో పాటు రాచకొండ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మోటర్ వాహనాల ఇన్‌స్పెక్టర్ అనూష, శ్రీనివాస ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోటి శ్రీనివాసరావు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ సావిత్రి, టిసిఎస్ శివ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను రక్షించడం డ్రైవర్లది అతి ముఖ్యమైన పాత్ర అని అన్నారు. అధిక వేగం, నిర్లక్ష్యం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్క డ్రైవరు బాధ్యతతో వాహనాన్ని నడపాలన్నారు. ఏసీపీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవర్ల యొక్క మానసిక స్థితి, ఫిజికల్‌గా బాగుంటేనే డ్యూటీని సక్రమంగా నిర్వహించగలరన్నారు. మోటర్ వాహనాల ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ నిరంతరం వాహనాలు యొక్క రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ , ఫస్ట్-ఎయిడ్ కిట్, బ్రేకు లైనర్స్, వైపర్ మొదలగు వాటిని సరి చూసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ప్రత్యేక గణాంకాల ప్రకారం భారతదేశంలో రోడ్డు ప్రమాదాల వలన రోజుకు దాదాపు 422 మరణాలు, తెలంగాణలో ప్రతి రోజు 50 నుండి 60 మంది మరణిస్తున్నారని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ అన్నారు. కోటి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. మా కంపెనీలో నడిచే వాహనాలకు గంటకు 80 కిలోమీటర్ల స్పీడ్ లాక్ మాత్రమే ఉంటుందని తెలియజేశారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను తూచా తప్పకుండా పాటిస్తున్నారని చెప్పారు. డ్రైవర్లకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ రఘువీర్, జాయింట్ సెక్రెటరీ, ట్రాఫిక్ ఫోరం కోటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నూతన మార్వెల్స్ బ్యాచ్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఈ అవగాహన కార్యక్రమానికి హాజరైన 780 డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్, శ్రీనివాస ట్రావెల్స్, సూర్య ట్రావెల్స్, శ్రీజ ట్రావెల్స్ తదితరులు పాల్గొన్నారు.





మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా కీసర నాగరాజు

నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కీసర నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రి ట్రాఫిక్ నుండి రోడ్డు సేఫ్టీ అటాచ్‌గా ఉండి బదిలీపై మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు వచ్చారు. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కాశీవిశ్వనాథ్ బదిలీ అయ్యారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

నవతెలంగాణ - వనస్థలిపురం

కాలనీలోని సమస్యలను పరిష్కరించేందకు కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలోని సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అర్జున్ ఉద్దీన్ జవాన్, రాంచందర్, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని కార్తికేయ నగర్ వీధి నెంబర్ 9, 10లో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. కార్తికేయ నగర్‌లోని అన్ని కాలనీల్లో త్వరలోనే సీసీ రోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్తికేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, డిప్యూటీ ఇంజనీర్ రూప, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతి'



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలోని 20వ వార్డులో ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కీసర ఏడీఈ కిషన్ నాయక్, నాగారం ఏఈ కామేశ్వర్ రావులకు కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర సురేష్ వినతిపత్రం అందజేశారు. శనివారం నాగారంలోని విద్యుత్ కార్యాలయంలో కలిసి పలు కాలనీల సమస్యలను వివరించారు. రవీంద్ర నగర్ కాలనీ, గోపీకృష్ణ కాలనీ, శివ శక్తి కాలనీ, బీఎంఆర్ కాలనీ, సర్వే నంబర్ 28, ఎల్లమ్మ కాలనీల్లో తరచూ విద్యుత్ సమస్య వస్తుందన్నారు. సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ వాసులు వెంకటేష్, రామారావు, బాల్‌రెడ్డి, శ్రీనివాస గుప్తా, శ్రీధర్, నర్సింగారావు, సునీల్ , మధు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లకు
9 నెలల బకాయి నిజమే

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఒక్క నెల వేతనం పెండింగ్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణారెడ్డి
- 'నవతెలంగాణ' కథనానికి వివరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

'జిల్లాలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న 414 అంగన్‌వాడీ కేంద్రాలకు 9 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఒక్క నెల జీతం పెండింగ్‌లో ఉంది' అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశువికలాంగుల, వయో వృద్ధుల శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీన 'సగం అద్దెకు.. సగం ఇంటికి' అనే శీర్షికతో వెలువడిన కథనానికి సంబంధిత అధికారి స్పందించారు. జిల్లాలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లకు 2023 మే నుంచి 2014 (9 నెలలు) అద్దె చెల్లించాల్సి ఉందనీ, ఈ అద్దెను చెల్లింపు విషయాలను ఈ నెల 19వ తేదీన డైరెక్టర్ మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ వారు బడ్జెట్‌ను 2023 సెప్టెంబర్ నుంచి 2024 వరకు (6 నెలలు) మంజూరు చేశారని తెలిపారు. ఈ చెల్లింపులకుగాను బిల్లులు సమర్పించామనీ, ఈ నగదు ఇంటి యజమానుల ఖాతాలో అవుతాయని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఈ ఏడాది ఏప్రిల్ గౌరవ వేతనం చెల్లించామనీ, మే ఒక్క మాత్రమే చెల్లించాల్సి ఉన్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు సరఫరా అవుతుందని తెలిపారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులకు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లింపులు జరిగాయనీ, మార్చి (3 నెలలు) వరకు నిధులు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో ఆరు మరుగుదొడ్లు ప్రస్తుతం మరమ్మతులో ఉన్నాయనీ, ఈ మరమ్మత్తులను వెంటనే చేపట్టి వినియోగంలోనికి తీసుకొస్తామని తెలి పారు. కొత్త మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయనీ, ఈ నిర్మాణాలను పంచాయతీరాజ్ శాఖ ద్వారా వెంటనే చేపడుతామని వివరణ ఇచ్చారు.

వేధింపుల సంగతేంటి..?

'నవతెలంగాణ'లో వెలువడిన కథనానికి స్పందించిన జిల్లా సంక్షేమశాఖ అధికారి అంగన్‌వాడీ సెంటర్ల పెండింగ్ అద్దెలు, టీచర్లు, హెల్పర్ల పెండింగ్ జీతాలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. కానీ అదే కథనంలో 'అధికారుల వేధింపులు' అనే అంశం కూడా ఉన్నది. ఈ విషయంపై సంబంధిత అధికారి నుంచి ఎలాంటి వివరణ, స్పందన వివరణలో లేదు. ఈ నేపథ్యంలో అధికారి 'మౌనమే' అంగీకారం అనుకోవాలా..? వేధింపులు నిజమే అని నిర్ధారించుకోవాలా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు వేధింపులు జరుగుతున్నాయా..? లేదా..? నిర్ధారించాల్సిన అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అధికారుల వేధింపుల విషయంపై మాట్లాడకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ విషయంపై నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

26న జవహర్‌నగర్‌లో
తై బజార్ వేలం



నవతెలంగాణ- జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈనెల 26వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో తైబజారు బహిరంగ వేలం పాట వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. నగర పాలక సంస్థ నిర్ణయించబడిన రేట్ల ప్రకారం ఫీజు వసూలు చేసేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ఎన్‌టీఏ



- ప్రేక్షక పాత్ర వహిస్తున్న మోడీ సర్కార్
- ఐక్య విద్యార్థి సంఘాల నేతలు

నవతెలంగాణ-బోడుప్పల్

కేంద్రంలోని బీజేపీ సర్కార్ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుందని ఐక్యా విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. శనివారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ డిపో వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ సంఘాల ఆధ్వర్యంలో స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్‌లు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యున్నతమైన నీట్ పరీక్షా పత్రాలు పరీక్షల కంటే ముందే అభ్యర్థుల చేతుల్లోకి వెళ్లాయని మొదటి నుంచి ఆరోపణలు వచ్చినా కేంద్రం సర్కార్ పట్టించుకోలేదన్నారు. మొన్న నీట్.. నిన్న యూజీసీ నీట్ పరీక్షలను రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుందని ఆరోపించారు. దీనికి బాధ్యులైన ఎన్.టీ.ఏపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. ఎన్.టీ.ఏ చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై మోడీ సర్కార్ మౌనం వీడాలని, లేకపోతే తెలంగాణలో బీజేపీ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ అరవింద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సాయి, విద్యాసాగర్, సాయి, చరణ్, శివ, ఆకాష్, వరుణ్, వంశీ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కౌడిన్య భవనంలో అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్‌లో కౌండిన్య భవనం కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తులో జరుగుతున్న అభివృద్ధి పనులు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌండిన్య సంఘం సభ్యులు భవనంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కిటికీలు, ఫ్లోరింగ్ పనులు, వాచ్‌మెన్ రూం, పెండింగ్ పనులను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ ఇట్టి పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానికులు దంతూరి రాజుగౌడ్, మెరుపుల బాలరాజు గౌడ్, కోయిగూర బాలరాజు గౌడ్, కప్పరా సాయి, రాంపల్లి సాయిగౌడ్, రాజేష్, సాయి, రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీవీఎన్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీలో కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ జలమండలి అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వాటర్ ప్రెజర్ రావడం లేదని, ప్రెజర్ వచ్చేలా చూడాలని కోరారు. దీంతో కార్పొరేటర్ వాటర్ మీటర్లను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, వాటర్ మీటర్ పరిశీలకులు వినయ్ కుమార్, సైట్ ఇన్‌చార్జి ప్రణయ్, కాలనీవాసులు రుక్మిణి, సరస్వతి, లక్ష్మీ, భాస్కర్, కిషోర్, శంకర్ పాల్గొన్నారు.


మున్సిపల్‌లో విలీనం అయ్యాక అభివృద్ధి ఏది..?



నవతెలంగాణ-ఘట్‌కేసర్

ఇస్మాయిల్ ఖాన్ గూడ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అభివృద్ధి చేసి, మున్సిపల్‌లో విలీనం అయ్యాక అభివృద్ధిని మరిచారని విహారి హెూమ్స్ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గూడకు చెందిన విహారి హెూమ్స్ కాలనీలో శనివారం కాలనీవాసులు తమ సమస్యలను నవతెలంగాణతో తెలిపారు.తమ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు ఎంతో అభివృద్ధి చేశారని, మున్సిపల్‌లో విలీనం తర్వాత సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్మెన్, కౌన్సిలర్‌కు కాలనీ సమస్యలను ఎన్నో సార్లు తెలిపినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీ నుంచి మున్సిపల్‌కు దాదాపు రూ.20 నుంచి రూ.25 లక్షల పన్ను చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. పన్ను వసూలు చేస్తున్నారే తప్ప సమస్యలు పట్టించుకోవడం లేదని తెలిపారు. డ్రయినేజీ పొంగి దుర్వాసన వస్తుందని, వర్షం పడితే రోడ్లపై నడవడం కష్టంగా ఉందన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనాఅధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్ బాజీబాబు, ట్రెజరర్ రవి, వాయిస్ ట్రెజరర్ యాకస్వామి, జాయింట సెక్రెటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలమణి, ఆర్గనైజర్ రవి కుమార్, కాలనీవాసులు బాబురావు, ముకుందరెడ్డి, విజయ్ కుమార్, బాల సుబ్రమణ్యం, చారి నాయుడు, సికిందం పాల్గొన్నారు.

కీసర గుట్ట ఆలయ ఈవోగా కే.సుధాకర్‌రెడ్డి



నవతెలంగాణ-కీసర

కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం నూతన ఈవోగా కత్తా సుధాకర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ చైర్మెన్ తటకం నాగలింగం, ఆలయ వేదపండితులు నూతన ఈవోను సన్మానించారు. బదిలీ పై వెళ్తున్న ఈవో నరేందర్ నూతన ఈవోకు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వినతి



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చిల్కానగర్ చౌరస్తా, పిస్తా హౌస్ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు అదనపు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ బన్నాల గీత కోరారు. చిల్కానగర్ చౌరస్తాలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టుకు ఇద్దరు కానిస్టేబుల్స్ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఏసీపీ చక్రపాణి, సీఐ ఎలక్షన్ రెడ్డికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ చక్రపాణి స్పందిస్తూ సీఐ ఎలక్షన్ రెడ్డికి ప్రతిరోజు ఇద్దరు కానిస్టేబుల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెక్టర్ ఎస్సై నెహ్రూ ఉదయం, సాయంత్రం మొబైల్ పెట్రోల్ వెహికల్‌తో పాటు తాను కూడా పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఉప్పల్ ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డికి చిల్కానగర్ చౌరస్తాలో, సర్వే ఆఫ్ ఇండియా పిస్తా హౌస్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని అదనంగా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. అదనపు సిబ్బందిని నియమిస్తామని ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, సోషల్ మీడియా అధ్యక్షులు బింగి శ్రీనివాస్, రామాంజనేయులు, జేమ్స్ రాజు, నాగయ్య పీటర్ పాల్, రవీందర్ గౌడ్, బాలేందర్, నర్సింగ్ నేత, బాలు శ్యామ్ పాల్గొన్నారు.

10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలు ప్రారంభం



నవతెలంగాన-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలు గచ్చిబౌలిలోని శాట్స్ షూటింగ్ రేంజ్‌లో ప్రారంభమయ్యాయి. వివిధ విభాగాల్లో 200 మందికిపైగా పోటీదారుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ ప్రారంభించారు. పోటీల్లో 10ఎం రైఫిల్/ఓపెన్ సైట్ రైఫిల్, 25ఎం పిస్టల్, 50ఎం పిస్టల్, 10ఎం పిస్టల్ ఈవెంట్‌లు పాల్గొనేవారి అసాధారణ షూటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించాయి. నైపుణ్యం గల మార్క్స్‌మెన్, మార్క్స్ మెన్‌లు తమ ఖచ్చితత్వాన్ని ప్రదర్శించడానికి గుమిగూడడంతో వాతావరణం నిరీక్షణ, ఉత్సాహంతో నిండిపోయింది. పాల్గొనేవారు ఒకరినొకరు అధిగమించేందుకు పోటీ పడటంతో షూటింగ్ రేంజ్ స్పష్టమైన శక్తితో ప్రతిధ్వనించింది. 25 ఎం ఎస్‌టీడీలో చురుకుగా పాల్గొన్న తెలంగాణ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీ కుమార్, ప్రస్తుత రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్, పాల్గొనే వారిలో ఉన్నారు. "ఈ పోటీల్లో మా షట్లర్లు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషాన్నిస్తుంది" అని మిస్టర్ అమిత్ సంఘీ అన్నారు. "క్రీడ పట్ల వారి అంకితభావం, అభిరుచి ప్రశంసనీయం, రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తేజకరమైన ఘటనలను చూడాలని ఎదురు చూస్తున్నాం" అన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని బీఆర్ఎస్ మేడ్చల్ మండల నాయకులు శనివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలను చర్చించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ రాజ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్ రెడ్డి, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు హరత్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ యూసఫ్, భాస్కర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గీత పారిశ్రామిక సహకారం సంఘం సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌కు చెందిన గీత పారిశ్రామికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 278లోని 5 ఎకరాల భూమిని తమకు గతంలో కేటాయించారని తెలిపారు. అందులో ఈత చెట్లు పెంచుకున్నామని పేర్కొన్నారు. కానీ ఈ భూమి మధ్యలో వాకింగ్ ట్రాక్, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించడంతో ఈత చెట్లు మొత్తం పాడైపోయాయని వివరించారు. తమకు గతంలో కేటాయించిన భూమికి బదులుగా మరోచోట 5 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లడుతూ.. సమస్యపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, కాసుల అనంద్ గౌడ్, రామ చంద్రాగౌడ్, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు రాగిరు నరసింహ గౌడ్, ఆనంద్, రాజ్‌గౌడ్, అంజయ్య గౌడ్, నాథంగౌడ్, రాములు గౌడ్, అశోక్ గౌడ్, శశికాంత్ గౌడ్, శ్రవణ్ కుమార్, చెన్నయ్య గౌడ్ ఉన్నారు.

'ఎంఎల్‌ఆర్‌ఐటీ'లో
ఇంజినీర్స్ స్టూడెంట్ ఫోరమ్ ప్రాంతీయ సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీర్స్ స్టూడెంట్ ఫోరమ్-రీజినల్ (ఐడియేట్-ఇన్నోవేట్-ఇగ్నైట్) ఈవెంట్ 2024, ఈ నెల 21, 22 తేదీల్లో ఇంజినీర్స్ వితవుట్ బార్డర్స్ స్టూడెంట్ చాప్టర్ బాడీతో నిర్వహించారు. ఎంఎల్‌ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఇంజినీర్స్ వితౌట్ బోర్డర్స్, ఇండో యూనివర్సల్ కోలాబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఎంఎల్‌ఆర్ఐటీ స్టూడెంట్ చాప్టర్, ఐఈఈఈ ఎడ్యుకేషనల్ సొసైటీ రెండు రోజుల ఈవెంట్‌గా "ఇంజనీర్స్ స్టూడెంట్ ఫోరమ్- ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతీయ ఫోరమ్ సమకాలీన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను అన్వేషించడానికి, చర్చించడానికి ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులను ఒకచోట చేర్చి విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ ఈవెంట్‌లో రెండు ప్రధాన ట్రాక్‌లు ఉన్నాయి. అవి సస్టైనబుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, క్లైమేట్ యాక్షన్. ఇంజినీరింగ్ విద్య భవిష్యత్‌ను రూపొందించడంలో, విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణ, సహకార స్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి ఫోరమ్‌లు ఉపయోగపడతాయి. నేటి కార్యక్రమంలో విద్యార్థులతో వివిధ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. వాటిలో నుంచి అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రూ.15 వేల నగదు బహుతులను అందించారు.

ఈ కార్ర్యమంలో రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది విద్యార్థులు వివిధ కళాశాల నుంచి పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ శ్రేయారెడ్డి, స్టార్టర్ కార్తీక్ పొన్నప్ప, కో-ఫౌండర్ ధర్మ, స్టార్ట్ అప్ అడ్వైజర్ బి.మనోజ్‌కుమార్, డీన్ డాక్టర్ వి.రాధికాదేవి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్‌లు మహేందర్, హారిక, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- నాలాలో పూడికతీత పనులు ప్రారంభించిన మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్ నగర్

వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలోని ఓపెన్ నాలాల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త, తదితర వ్యర్థాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా, జవహర్ నగర్ ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

4వ వార్డులోని సమస్యలు పరిష్కరించాలని వినతి





నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కురిసిన చిన్నపాటికి వర్షానికి సైతం కాలనీలోని రోడ్లు బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుస్తున్న వర్షాలకు సరైన రోడ్డు మార్గం లేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వర్షం కురవగానే డ్రయినేజీలు నిండి రోడ్లమీదకి మురుగు రావడంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 4వ వార్డులో సరైన సీసీ రోడ్లు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, అధికారులు, స్థానిక కౌన్సిలర్ తుడుం గణేష్ వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

సూరారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సీజ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ఎట్టకేలకు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పై విద్యాశాఖ అధికారులు స్పందించారు. శనివారం కుత్బుల్లాపూర్ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్య సంఘం సూరారం కాలనీలోని భవాని నగర్‌లో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు ప్రభుత్వం నుంచి ఎటువంటి షిఫ్టింగ్ పర్మిషన్ లేనందున మండల విద్యాధికారికి ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించారు. కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి వసంత కుమారి, ఎంఎల్ఓ రమేష్ అధికారులు తనికి చేసి, పాఠశాలను సీజ్ చేశారు. పిల్లల తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్పించకూడదని...విద్యాధికారుల గుర్తింపు లేని, పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురికాకుండా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల్ రికగ్నిషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పీ.ఎస్. స్టిల్‌లు మొదలగు వారు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పోలీసుల ప్రత్యేక డ్రైవ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



శాంతి భద్రతల పరిరక్షణకై చట్ట విరుద్ధమైన కార్యకలాపాల నివారణకై డీసీపీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు బాలానగర్ జోన్ డీసీపీ, కే.సురేష్ కుమార్ ఐపీఎస్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో, కూకట్‌పల్లి సీఐ, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో కలిసి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, పబ్లిక్ న్యూసెన్స్, బహిరంగ మద్యపానం వంటి సమస్యలు ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ పోలీసులు నిర్వహించారు. అందులో భాగంగా కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, భాగ్యనగర్‌లో, కైత్లాపూర్ ఓపెన్ గ్రౌండ్ ప్రాంతాల్లో కూకట్‌పల్లి పీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాడం జరిగింది.

పది ఫలితాల్లో 'రమావత్ ఇన్నోవేటివ్ స్కూల్' విద్యార్థుల ప్రభంజనం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ ఐడీఏ జీడిమెట్లలో ఉన్న 'రమావత్ ఇన్నోవేటివ్ స్కూల్' విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో విజయ కేతనం ఎగురవేశారు. ప్రతి ఏడాది లాగానే 100 శాతం ఉత్తీర్ణత సాధించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికే తలమానికంగా నిలిచిన సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శశికాంత్ శర్మ నవతెలంగాణతో శనివారం మాట్లాడుతూ.. పదో తరగతిలో అద్భుత ఫలితాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలతో దినదిన అభివృద్ధి చెందుతూ... క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యకు మారుపేరుగా తమ పాఠశాల గత 20 ఏండ్లుగా అసాధారణ ఫలితాలతో ముందుకు సాగుతున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థుల మనో భావాలకు అనుగుణంగా ఆహ్లాదకర మైన వాతావ రణంలో విద్యను బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం సంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు, కబాడీ, క్రికెట్, కరాటే నిర్వహిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీస్తున్నామని పేర్కొన్నారు. తమ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, సాఫ్ట్ వేర్ వివిధ రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ఉన్నత స్థానంలో సిరపడ్డారన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో... సానియా కుమారి, ఎన్.దివ్య శ్రీ 10/10 జీపీఏ సాధించగా, డింపుల్ బి.హర్షిని సాయి, ఎం. హర్షిత, షారన్ సుగంధి 9.7/10, యోగేశ్వరరావు 9.5/10, జి.ప్రీతి 9.3/10, భవాని కుమారి 9.2/10, నందిని కుమారి, హేమలత, కే ఇందు శ్రీ 9.0/10, ఎన్ అమూల్య కుశాల్ 8.8/10, జి.కార్తీక్, జే.అఖిల్, వి.శివ శరణ్, జి.శ్రీరామ్, యు. జాయ్ క్రిస్టియన్ 8.7/10, ప్రకాష్ కుమార్ 8.5/10, జి.గౌతమి 8.2/10, జోగారం 8.0/10 జీపీఏ సాధించా రన్నారు. ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కృషి పట్టుదల ఎంతో అవసరమన్నారు. తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

ముక్కు ద్వారా మెదడులో కణితుల తొలగింపు

- కొత్త టెక్నిక్‌తో శస్త్రచికిత్సలు మరింత సులభం
- కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల సదస్సు
- దేశవ్యాప్తంగా పలు నగరాల నుంచి హాజరైన ముఖ్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సాధారణంగా మెదడులో వచ్చే కణితులను తొలగించాలంటే కపాలాన్ని పగలగొట్టి, పై నుంచి దాదాపు 10 సెంటీమీటర్ల మేర లోపలకు వెళ్లి.. అప్పుడు తీస్తారు. దీనివల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. దీన్ని అధిగమించడానికి ఇటీవలి కాలంలో ఎండోస్కోపిక్ స్కల్ బేస్ సర్జరీలు ప్రాచుర్యం పొందాయి. వీటి గురించి తెలుగు రాష్ట్రాల్లోని వైద్యులకు అవగాహన కల్పించేందుకు నగరంలోని కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల పాటు కెడావరిక్ వర్క్ షాప్ నిర్వహించారు. ఆస్పత్రి ప్రాంగణంలోని ఇందిరా ఆడిటోరియంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రధానంగా న్యూరో ఎండోస్కోపీ సర్జరీల గురించి చర్చించారు. దేశవ్యాప్తంగా 120 మందికి పైగా వైద్యులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఢిల్లీ, చండీగఢ్ పీజీఐలు, నిమ్‌హాన్స్, ఎయిమ్స్ లాంటి ప్రఖ్యాత ఆస్పత్రుల నుంచి ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఆపరేషన్ టేబుల్ మీద ఏం చేయాలి, దాన్ని ఎలా నేర్చుకోవాలన్న అంశాలు ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో వివరించారు. ప్రాథమిక స్థాయి సర్జరీల నుంచి అత్యున్నత స్థాయి వాటి వరకు ఎలా చేయాలో నిపుణులు చెప్పారు. జాతీయ స్థాయి వైద్య విద్యా సంస్థల నుంచి సీనియర్ ఫ్యాకల్టీ వచ్చి.. ముందుగా ఆడిటోరియంలో క్లాసులు చెప్పడంతో పాటు తర్వాత మతదేహాల మీద ఈ సర్జరీలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. వీరితోపాటు ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి స్కల్ బేస్ డైరెక్టర్లు కూడా ఈ సమావేశానికి జూమ్ ద్వారా హాజరయ్యారు. వీరు నేర్పిన టెక్నిక్‌లను రెసిడెంట్లు, జూనియర్ వైద్యుల నుంచి మొదలు పెట్టి.. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, పట్టణాల నుంచి వచ్చిన వైద్యులు కూడా నేర్చుకున్నారు. వచ్చిన వారిలో ఎక్కువమంది న్యూరోసర్జన్లు ఉండగా, సుమారు 10 మంది వరకు ఈఎన్‌టీ సర్జన్లు కూడా పాల్గొన్నారు. "మెదడు మధ్య భాగంలో ఉండే కణితులను తొలగించాలంటే ముందుగా కపాలం పగలగొట్టి, లోపలకు వెళ్లి.. అక్కడున్న కణితిని తీయాలి. అదే ముక్కుద్వారా అయితే చాలా సులభంగానే కణితి ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. దానివల్ల 10 సెంటీమీటర్ల మెదడును పాడు చేయక్కర్లేదు. కేవలం 2 సెంటీమీటర్ల మేర మాత్రమే కట్ చేస్తే సరిపోతుంది. పిట్యూటరీ ట్యూమర్లు, స్కల్ బేస్ ట్యూమర్ల చికిత్సకు దీన్ని వాడుతారు. ఇలాంటి శస్త్రచికిత్సల కోసం ఒకప్పుడు బెంగళూరు నిమ్‌హాన్స్, లేదా ఢిల్లీ ఎయిమ్స్ లాంటి ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. అది అవసరం లేకుండా హైదరాబాద్‌లోనే చేయగలుగుతున్నాం. ఇకమీద ఇలాంటి సదస్సులలో పాల్గొన్న వైద్యులు 2టైర్ నగరాల్లో కూడా చేయగలరు, దానివల్ల పేషెంట్లకు ఎంతో ప్రయోజనం ఉంటుంది" అని ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వ్యవహరించిన డాక్టర్ శిఖాకొల్లి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆస్పత్రి సీఓఓ డాక్టర్ గాయత్రి కామినేని, లక్నో ఎస్‌జీపీజీఐ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసర్జరీ డాక్టర్ అవధేష్ జైస్వాల్, ముంబయి బాంబే హాస్పిటల్స్ ప్రొఫెసర్, హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ న్యూరోసర్జరీ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, త్రివేండ్రం ఎస్‌సీటీఐఎంఎస్‌టీలో అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ నాయర్, విజయవాడ అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్‌లో కన్సల్టెంట్ న్యూరోసర్జన్, డాక్టర్ రమేష్ తీగల, చండీగఢ్ పీజీఐఎంఈఆర్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసర్జరీ డాక్టర్ ఎస్ఎస్ దండపాణి, హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి హెచ్ఓడీ, డైరెక్టర్ ఆఫ్ న్యూరోసర్జరీ డాక్టర్ సుబోధ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హోలీ క్రాస్ పాఠశాలలో యోగా దినోత్సవం



నవతెలంగాణ-బాలానగర్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్కంపేట్ రేణుక నగర్‌లోని ది హోలీ క్రాస్ పాఠశాలలో యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దీప్తి నాయుడు యోగా దినోత్సవాని పురస్కరించుకొని విద్యార్థులతో యోగాసనాలు వేయించి, యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగ చేస్తే మన శరీరానికే కాక మన మనస్సు కూడా చాలా హాయిగా ఉంటుందని తెలిపారు. యోగ వల్ల చాలా లాభలున్నా యని, నేటి యువతి, యువకులకు యోగ చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యోగ ద్వారా ఒత్తిడులకు లోనుకారని, ఎల్లప్పుడు ఉత్సాహంగా ఉంటారని అన్నారు. తాము ఇప్పటికి ఇంత ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండడానికి తాను నేర్చుకున్న యోగానే కారణమని తమ అనుభవాలను పంచుకున్నారు. యోగా ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చు అన్నారు. తమ పాఠశాలలో గత పది సంవత్సరాలుగా ప్రతి విద్యార్థి చేత చేయిస్తామని, విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ప్రశాంతత కోసం పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవం..

దుండిగల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు సురేష్ మూర్తి విచ్చేసి మాట్లాడుతూ యోగా సాధన వలన ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా. కె శ్రీలత మాట్లాడుతూ యోగా ద్వారా మనకు వచ్చే ప్రయోజనాలను తెలిపారు. యోగాను మన దినచర్యలో భాగంగా చేసుకోవాలని పేర్కొన్నారు. యోగా చేయడం ద్వారా శారీరక మానసిక వికాసం పెరుగుతుందని ప్రతిరోజు అందరూ తప్పకుండా యోగా సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ డా.బి భాస్కర్ రెడ్డి, పిఆర్ఓ రవి సుధాకర్, పిడి డా. పిజెవి రత్నకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



జోనల్ ఇన్‌చార్జి కమిషనర్‌కు ఫిర్యాదు

- కాంగ్రెస్ నాయకుడు జిట్ట సునీల్ కుమార్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి జోనల్ ఇన్‌చార్జి కమిషనర్‌కు మూసపేట్, కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై, స్థానిక యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్ట సునీల్ కుమార్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆఫీసులోని టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల, కూకట్‌పల్లి నియోజకవర్గంలో డ్రయినేజీ సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయనీ, వీటన్నిటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణమని తెలిపారు. పరిమితులకు మించి భవన నిర్మాణాలు చేస్తున్నప్పటికి, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వలన ఈ సమస్యలన్నిటికీ కారణమవుతున్నారని పేర్కొన్నారు. 100 నుంచి 300 గజాలలో పరిమితికి మించి అంతస్తులు నిర్మిస్తున్నారని, అందులో కనీసం పార్కింగ్ సదుపాయం లేకపోయినా. అదనపు అంత స్తులు నిర్మిస్తున్నారు. కాబట్టి ఇలా నిర్లక్ష్యం చేయడం వల్లనే, వర్షాకాలంలో డ్రయినేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో.. బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారు..



- కాంగ్రెస్ కేపీహెచ్‌బీ డివిజన్ నేతలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

గత పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అక్రమ సంపాదనకు తెగబడి కోట్లాది రూపాయలు సంపాదించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని కేపీహెచ్‌బీ డివిజన్ కాంగ్రెస్ నాయకులు నాగ మల్లేశ్వరరావు, అరవింద్ రెడ్డి, మేకల మైఖేల్‌లు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ గెలుపే అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడి ప్రజల రక్తం పిలుస్తూ అక్రమ సంపాదనకు తెగబడ్డ బీఆర్ఎస్ నేత అఘోరా దగ్గర ఎంగిలి మెతుకులు తినే సాయి, రాజేష్ రాయ్‌లు, కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డిపై విమర్శిస్తారా అని విమర్శించారు. బెస్త సోదరులకు సంబంధించిన ఫిష్ మార్కెట్లో బినామీ పేర్లతో స్టాల్స్ తీసుకొని వారి వద్ద అక్రమంగా వస్తువులు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ నెక్సస్ మాల్ సమీపంలో హౌసింగ్ బోర్డ్ స్థలం లీజుకు తీసుకొని సబ్ లీజుకు ఇచ్చింది మీరు కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష పేరుతో తన క్యాంప్ ఆఫీస్‌కు అధికారులను పిలిపించుకొని సమీక్ష చేసిన విషయంలో మా నాయకుడు శేరి సతీష్ రెడ్డి ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే దానిని తట్టుకోలేక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 72,000 మెజారిటీతో గెలుపొందారని దంబాచాట ప్రచారం చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు వచ్చిన ఓట్లు కేవలం 32 వేలు మాత్రమే కదా? కనీసం డిపాజిట్ కూడా రాలేదు కదా అని అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నాయకుల పై విమర్శలు చేస్తే అఘోరతోపాటు వారి బినామీలైన జన్ను సాయి, రాజేష్ రాయ్‌ల అక్రమ దందాలు వివరాలతో సహ విలేకరుల సమావేశం పెడతామని హెచ్చరించారు.

మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లావేళలా కృషి



- కోలన్ హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లావేళలా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. బౌరంపేట్, దుండిగల్ మున్సిపాలిటీ ఇందిరమ్మ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీ మసీద్ వాసులు ఎదురుకుంటున్న నీటి సమస్యని కోలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి కాలనీ వాసులు రాగ.. వారు ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబుకి విన్నవించుకోగా సీఎం సహాయ నిధి నుంచి స్పెషల్ డెవలప్ ఫండ్ (రూ.5 లక్షలు) మంజూరు అయినందున శనివారం కోలన్ హన్మంత్ రెడ్డి బౌరంపేట్ ఇందిరమ్మ, లక్ష్మి నగర్ కాలనీ మసీద్ ప్రాంతంలో 2 బోరెవెల్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జీవెందర్ రెడ్డి, పి.ఏ.సి మాజీ చైర్మెన్ బెంబిడి మల్లారెడ్డి, 13 వార్డ్ కౌన్సిలర్ నర్స రెడ్డి బాల్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ చైర్మెన్ సల్మాన్ రాజ్, దళిత సంఘాల నాయకులు చింతకింది నారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి ,పెరిక శివ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో కలుషిత నీటిని పరిష్కరించేందుకు కృషి ..



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

తాగునీటి సరఫరాలో కలుషిత నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ మూసాపేట ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ జాన్సన్ గ్రామర్ స్కూల్ వీధిలో గత వారం రోజులుగా తాగునీటిలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు తెలిపారు. మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డివిజన్ కార్పొరేటర్, జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి ఆయా ప్రాంతంలో కలుషిత నీటి సరఫరాను పరిశీలించారు. డివిజన్‌లోని నేతాజీ కాలనీలోని సమీప స్థానిక ప్రజలకు కలుషిత నీటి సరఫరా వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు కార్పొరేటర్ ఆయా పరిసర ప్రాంత వాసులను అడిగి తెలుసుకోగా .. గత వారం రోజులుగా తాగునీటిలో కలుషిత నీరు వస్తుందని, దీంతో కలుషిత నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక మహిళలు కోరారు. అందుకు నాలుగైదు రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్, కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట రాంనర్సయ్య, స్వామి, శేఖర్ గట్ల, సురేందర్ నాయుడు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లో శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ భారీ విజయం తర్వాత ఆత్మీయ సమ్మేళనం బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌లో లిఫ్ట్ నిర్మాణానికి శంకుస్థాపన

- ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి



సీనియర్ సిటిజన్స్ కొరకు పార్క్‌లో లిఫ్ట్ నిర్మాణానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు తో కలిసి శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, వివేకానంద నగర్ కాలనీలో ఉన్న వినాయక పార్క్ లో సీనియర్ సిటిజన్స్, యోగ భవనంకు వచ్చే వారి కోసం, ఎమ్మెల్యే స్వంత నిధులతో రూపాయలు ఐదు లక్షల అంచనావ్యయంతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ యోగా కోసం వచ్చే వారికి, మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు లిఫ్ట్ ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం అన్ని రకాల మౌలిక వసతులు కలిపిస్తామని తెలియచేసారు. లిఫ్ట్ సౌకర్యం వలన మెట్లు ఎక్కకుండా సులువుగా ఉంటుందని, లిఫ్ట్ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేసారు. ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, రాంచందర్, వెంకటేశ్వర్లు, సుదర్శన్ రెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు లబ్దిదారులకు కేటాయించాలి



- కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని సౌకర్యాలు కల్పించి వెంటనే లబ్దిదారులకు కేటాయించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం బాలాజీ నగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై స్థానిక నాయకులతో కలిసి ఆయన విస్తృతంగా పరిశీలించారు. అనంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముందుగా డివిజన్ పరిధిలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలను, పక్కనే ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన పరిశీలించారు. కనీస సౌకర్యాలు లేకపోవడం పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉండడం సరైన రహదారి, విద్యుత్, తాగునీరు లేకపోవడం అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడంపై ప్రకాష్ బండి రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అసలైన లబ్ధిదారుల ఎంపిక అనంతరం కేటాయింపులు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేస్‌లో ఉన్న బతుకమ్మ కుంట పార్కును పరిశీలించారు. ఈ పార్కు స్థలంలో అక్రమంగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న కొందరు వ్యక్తులపై స్థానికులు ఫిర్యాదు చేయగా డిప్యూటీ కమిషనర్‌తో రమేష్ ఫోన్‌లో మాట్లాడి వెంటనే వాటిని తొలగించాల్సిందిగా ఆదేశించారు. పార్క్ లోని చెట్లను కొట్టి మూడు నెలలు అయినా వాటిని తొలగించ లేదంటూ స్థానికులు చెప్పడంతో బండి రమేష్ మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏ బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మణ్, పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజపుత్, సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, చున్ను పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో బండి రమేష్...

కూకట్‌పల్లి: ఏవీబీపురంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా, శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు ఏవీబీపురం వాసులకు ఉండాలని అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారా సింగ్, వాసు, రమణారావు, మేకల రమేష్, రఘువయ్య, వెంకట్ రావు, కిరణ్, పాపారావు తదితరతలు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజ సేవలో నిత్యం నిమగ్నమై ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్పొరేటర్ శనివారం డివిజన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధానంగా డివిజన్ పరిధిలో ప్రజల వర్షాకాలం నేపథ్యంలో బాలానగర్ డివిజన్‌లో ప్రధానంగా నాలా పరివాహక ప్రాంతాలైన కళ్యాణి నగర్, నవజీవన్ నగర్, గీతానగర్ వినాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో అధికంగా వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిం చారు. ముఖ్యంగా వినాయక్ నగర్ నుంచి బోజాయ్ ఫంక్షన్ హాల్ వరకు హిటాచి వాహనం ద్వారా జరుగుతున్న నాలా పూడికతీత పనులను బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. నాలాలో చెత్త, వ్యర్థాలతో నిండిపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని, వర్షాకాలంలో డివిజన్‌లోని నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి అక్కడే వదిలేయడంతో తిరిగి నాలాలలోకి చేరుతున్నాయని కార్పొరేటర్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ఏఈ మహమ్మద్ రషీద్, వర్క్ ఇన్స్పెక్టర్ రాములు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్రా దేవేందర్ రెడ్డి, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, వినాయక్ నగర్ కాలనీ అధ్యక్షులు సిద్ధి రాములు, ప్రధాన కార్యదర్శి శివ, నాయకులు మానేపల్లి కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

క్షవర వృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

50 ఏండ్లు దాటిన క్షవర వృత్తిదారులకు వద్ధాప్య పెన్షన్స్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ క్షవర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్షవర వృత్తిదారులు అనేక సంవత్సరాలుగా వృత్తిని నమ్ముకొని జీవనోపాధి పొందుతూ విద్యాపరంగా సామాజికంగా ఆర్థికంగా రాజకీయ పరంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. క్షవర వృత్తిదారులు కరోనా కాలములో వృత్తి నడవక షాపుల అద్దెలు కట్టలేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు జి బాలరాజు ఎస్ చంద్రయ్య కే వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ అనేది చారిత్రాత్మక నిర్ణయం

- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. శనివారం పత్రికా ప్రకటన ద్వారా ఆయన హర్షం వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ అనేది తెలంగాణ రాష్ట్ర ప్రాంతంలో ఉన్న లక్షల మంది రైతులకు ఎంతో ఉపశమనాన్ని కల్పించినటు వంటి మాట అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంత ఇబ్బంది అయినా ఎంత భారమైన రైతుల పక్షపాతిగా రైతుల పెద్దకొడుకుగా రైతన్నల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. ఇచ్చిన మాట తప్పని ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం రేవంతన్న సర్కార్ అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ గానీ, బీజేపీ గానీ ఎప్పుడూ రైతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజా ప్రభుత్వం రైతులందరికీ రెండు లక్షల దేశంలోనే అత్యధికంగా రైతులకు రుణమాఫీ చేసినటువంటి ప్రభుత్వంగా చరిత్రకి ఎక్కిందన్నారు.

ఉస్మానియా మెడికల్ కళాశాల ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి జూనియర్ డాక్టర్ల ఆందోళన..



- రేపటి నుంచి విధులు బహిష్కరించి సమ్మె.

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ లో శనివారం జూనియర్ డాక్టర్లు కళ్ళకు బ్లాక్ క్లాత్ కట్టుకొని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా స్టైఫండ్ తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనం నిర్మించాలని ఆరేండ్లుగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనానికి శంకుస్థాపన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా హాస్పిటల్‌లో స్థలం లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు కానీ హాస్టల్స్ పెంచడం లేదని అన్నారు. తరుచూ వైద్యులపై దాడులు జరుగుతున్నాయని..వైద్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు.

పోరాటాలు తీవ్రతరం చేద్దాం



- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే .సూర్యం

నవతెలంగాణ-ముషీరాబాద్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కోసం పోరాటాలను తీవ్రతరం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం అన్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ లో జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ. గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకే రకమైన పనిచేస్తున్న మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ వర్కర్లు వేతనాలు ఇవ్వటంలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని అన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా కార్మికుల నిజ వేతనాలను నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్స్ ఇవ్వాలన్నారు. రానున్న వర్షాకాలం సీజన్‌లో గ్రామాలలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించడానికి జనాభా ప్రాతిపదికన కొత్త సిబ్బందిని నియమించాలన్నారు. జీవో నెంబర్ 51ను సవరించి ప్రతి కార్మికుడికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తూ వారిపై పని భారాన్ని తగ్గించాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి అరుణ్ కుమార్ మాట్లాడుతూ జూన్ చివరి వరకు బకాయి పడ్డ వేతనాలను ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి రవి,పి అరుణ్ కుమార్, సాంబశివుడు, బోయినపల్లి గణేష్, ఎదురింటి నరసింహ, కురుమయ్య రామదాసు, వెంకట్ రాములు, నరసింహులు,సుబ్బయ్య గట్టమ్మ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

'మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు రూ. 45 వేల వేతనం చెల్లించాలి'

- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో నేషనల్ హెల్త్ మిషన్ నందు పని చేస్తున్న 'మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు(ఎంఎల్ హెచ్ పీ) నెలకు రూ.45 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎంఎల్ హెచ్‌పీ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్ పీలను దవాఖానాలో ఓపీ చూసే వైద్యులుగా నియమించారని గుర్తు చేశారు.12 రకాల సేవలతో పాటు 14 రకాల కేంద్ర ప్రభుత్వ విధులను వీరితో చేయించుకుంటున్నారని, కానీ ఇతర రాష్ట్రాల్లో ఇచ్చినట్టుగా వేతనాలు ఇవ్వకుండా కేవలం రూ. 29 వేలు మాత్రమే ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వీరికి వర్తించడం లేదని, కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ చేసే పరిస్థితి లేదన్నారు.ప్రజా ఆరోగ్యం, వారి బాగోగులను చూసుకునే వీరికి ఆరోగ్యంపై భద్రత లేకపోవడం దారుణమన్నారు. పల్లె దవాఖానాల్లో పక్కా భవనాలు లేవని భవనాలు ఉన్న ప్రాంతాలలో కనీస వసతులు కల్పించడం లేదని తెలిపారు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలకు ప్రభుత్వమే కిరాయిలు చెల్లించడంతో పాటు ప్రతి పల్లె దవాఖానాకు విద్యుత్ బిల్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలో ఎంఎల్ హెచ్ పీల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తోట రామాంజనేయులు (ఏఐటీయూసీ), అధ్యక్షుడిగా బి.సందీప్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎండి.అస్బియా, ఉపాధ్యక్షులుగా బి.చంద్రకళ, బి.రమ్య, సహాయ కార్యదర్శులుగా జి.రాము, ఎం.సంధ్య, కోశాధికారిగా షేక్ లతీఫ్, కార్యవర్గ సభ్యులుగా ఎం.శ్రీకాంత్, బి.జితేందర్, ఆర్.దీపిక, బి.మురళీలను ఎన్నుకున్నారు.

ఎస్సీలను రాజ్యాధికారానికి దూరం చేసిన మందకృష్ణ



- రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మెన్ చెరుకు రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

30 ఏండ్ల తన ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకష్ణ మాదిగ ఎస్సీలను రాజ్యాధికారానికి దూరం చేశారని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మెన్ చెరుకు రాంచందర్ ఆరోపించారు. జేఏసీ ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి విరుద్ధమని, ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడానికి వీలు కాదని తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని కోరారు. ముఖ్యంగా బీజేపీ, మందకృష్ణ మాదిగ గౌరవించాలన్నారు. కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణను పట్టుకుని వేలాడుతున్న మందకృష్ణ తన వైఖరి మార్చుకోవాలని కోరారు. గత 30 ఏండ్ల నుండి వర్గీకరణ పేరుతో స్వలాభం కోసం కోట్ల రూపాయలకు మాదిగల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. మాలలపై మందకష్ణకు ఉన్న దుర్బుద్ధిని మానుకోవాలన్నారు. మాలల ఎదుగుదలను ఓర్వలేని ఆయనకు మాలలను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కడియం కావ్య మాదిగ సామాజిక వర్గానికి, మాదిగ ఉపకులానికి చెందిన వారేనని ఇది మర్చిపోయి మతి భ్రమించి మందకృష్ణ మాట్లాడుతున్నారన్నారు. గతంలో కడియం శ్రీహరి దగ్గర ఎస్సీ వర్గీకరణ అంశంలో సహాయం తీసుకున్న ఆయన కడియం శ్రీహరి మాదిగ ఉప కులం అని చెప్పి ఇప్పుడు వారిని మర్చిపోయారనేది మందకష్ణ గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మెన్ బేర బాలకిషన్, వైస్-చైర్మెన్ ఎస్.నాను, నేతలు బిట్ల శ్రీనివాస్, దాసరి భాస్కర్, ఆర్.మల్లేష్, రమేష్, నాగేష్, శ్రీకాంత్, తాలూకా అనిల్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి రాబోయే రోజుల్లో కేంద్ర మంత్రిగా గొప్ప పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ నాయకులు కేశబోయిన శ్రీధర్ ఆకాంక్షించారు. కేంద్ర మంత్రిగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్ రెడ్డి మొదటిగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా కేశబోయిన శ్రీధర్ ఆయనకు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కేశబోయిన శ్రీధర్ మాట్లాడుతూ జి.కిషన్ రెడ్డి రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-హిమాయత్ నగర్

చిలకలగూడలో కాల్పుల కలకలం

- మెట్టుగూడ వద్ద డెకాయి ఆపరేషన్

నవతెలంగాణ-బేగంపేట్

చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల కాల్పులు శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేపాయి. వివరాల్లోకెళ్తే.. నగరంలో ఇటీవల పెరుగుతున్న దోపిడీలు, హత్య, లైంగికదాడులు లాంటి సంఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనలతో పోలీసులు డెకాయి ఆపరేషన్‌లను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి చిలకలగూడ పీఎస్ పరిధిలోని మెట్టుగూడ ప్రాంతంలో ఏఆర్, క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. అర్ధరాత్రి 2.40 గంటల ప్రాంతంలో మఫ్టీలో ఉన్న పోలీసులకు నలుగురు యువకులు అనుమానస్పదంగా తిరగడం కనిపించింది. ఈ క్రమంలో వీరిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, వారు పారిపోవడానికి ప్రయత్నించారు. దాంతో ఓ కానిస్టేబుల్ గాలిలో కాల్పులు జరిపి, సదరు నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు యువకులు విద్యార్థులు అని, వారికి ఎలాంటి నేర చరిత్ర లేదని తర్వాత పోలీసుల విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. సెల్‌ఫోన్లు, చైన్ స్నాచింగ్ సంఘటనలతో వీరికి సంబంధం లేదని పోలీసులు తేల్చారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



నవతెలంగాణ-ధూల్ పేట్

విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని హైదరాబాద్ ఆర్చిడియోసిస్ వికార్ జనరల్ వై. బాల్ శౌ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ షాజహాన్ ఆంటోని, ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రదర్ జకార్డులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాల్ రెడ్డి మాట్లాడుతూ... లిటిల్ ఫ్లవర్ స్కూల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలను కలిగేలా ఇక్కడ ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు నేడు దేశ. రాష్ట్ర రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో కొనసాగుతున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీఎల్. బాయ్స్ అండ్ గర్ల్స్, ఎన్సీసీ క్లబ్ సెక్రటరీ, క్లాస్ లీడర్స్, హౌజ్ లీడర్లు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ లీడర్లుగా పలువురు విద్యార్థులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ అధికారి బ్రీజ్ మోహన్, ఫిజికల్ డైరెక్టర్ అజిత్ కుమార్ ఉపాధ్యాయులు సంపత్ కుమార్, రమేష్, శ్రీనివాస్, బాల్రెడ్డి, శ్రీధర్, పుణ్యవతి, దీప్తి జైశ్వాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విభిన్న రూపాలలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి..



- కళా భూమి డాన్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవంలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

విభిన్న రూపాలలో చిన్నారుల నృత్యాలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి అని కళా భూమి డాన్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం వేడుకలో వక్తలు తెలిపారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కాల భూమి డ్యాన్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళా భూమి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు మల్లప్ రెడ్డి శ్రీవల్లి, ప్రసాద్ రావు, నృత్య గురువులు కన్యాకుమారి, శిల్పా చక్రవర్తి, మోహన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాడమీ విద్యార్థులు తమ నత్యం తో ప్రేక్షకులను కట్టిపడేశారని తెలిపారు. ప్రతి మనిషిలోనూ సృజనాత్మక గల కళ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీసినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. చిన్నారులో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కాల భూమి డ్యాన్స్ అకాడమీ కే సొంతం అయిందన్నారు. ఈ అపురూప నత్యాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారులకు చదువుతో పాటు ఆట,పాటల్లో ప్రత్యేక శిక్షణ అందించాలి అని కోరారు.

టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గ్రూప్ ఉద్యోగాలను పెంచాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం టీజీపీఎస్సీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే 25 వేల టీచర్ పోస్టుల భర్తీకోసం మెగా డీఎస్సీని నిర్వహించాలని, జాబ్ క్యాలండర్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు నినాదాలతో హోరెత్తించారు. ధర్నా చేస్తున్న ఆందోళన కారులు టీజీపీఎస్సీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేవైఎం కార్యకర్తలు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం అరెస్టు చేసిన నాయకులను, కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భూమి సరిహద్దు సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- డిఫెన్స్, రెవెన్యూ సర్వే శాఖలు ఉమ్మడి సర్వే నిర్వహించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రక్షణ శాఖ, రెవెన్యూ శాఖ భూముల సరిహద్దులకు సంబంధించిన సమస్యలను ఉమ్మడి సర్వే నిర్వహించి త్వరగా పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం బొల్లారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయ సమావేశం మందిరంలో బ్రిగేడియర్ సోమశంకర్ ఎస్ ఎంతో కలసి రక్షణ, రెవెన్యూ శాఖ అధికారులతో భూమి సరిహద్దు సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 6 అంశాలపై విపులంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. 1. సంయుక్త సర్వేలు, సరిహద్దు నిర్ణయాలు,2.రక్షణ భూ ఆక్రమణలు, 3. అలాట్మెంట్(సైనిక స్కూల్ భూమి వివరాల గురించి),4. రెగ్యులేషన్ (రక్షణ శాఖ భూ ఆక్రమణల క్రమబద్ధీకరణ), 5. ఓటు వివాదాలు(రక్షణ శాఖ సంబంధ భూములు)6. కేటాయింపు కేసులు(కంచన్ బాగ్) సమస్యల పై విపులంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. రక్షణ, రెవెన్యూ భూ వివాదాలు, సరిహద్దు సమస్యలను డిఫెన్స్, రెవెన్యూ సర్వే శాఖలు ఒక తేదీ నిర్ణయించి ఉమ్మడి సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బ్రిగేడియర్ సోమశంకర్ ఎస్ ఎం, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, హైదరాబాద్ సికింద్రాబాద్ ఆర్డీఓలు మహిపాల్, దశరథ్ సింగ్, రక్షణ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి డ్రయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ వ్యాప్తంగా మంచినీటి డ్రయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మంచినీటి సరఫరాలలో ప్రెషర్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంచినీటిలో కలుషిత నీరు చేరడంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. సివరేజీ సమస్య అధికమవుతుందని డ్రయినేజీ పొంగి రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుందని ఎప్పటికప్పుడు డ్రయినేజీ పూడికతీత పనులు చేపట్టాలని అధికారుల ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న, నూతన మంచినీటి అలాగే సివరేజీ పైప్ లైన్‌ల ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో హింసాత్మక ఘటనలు ఎక్కువయ్యాయి

- ఆవాజ్ నాయకులు మహమ్మద్ అలీ
- ఆవాజ్ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-మెహదీపట్నం

ఈ మధ్యకాలంలో నగరంలో హింసాత్మక సంఘటనలు ఎక్కువయ్యాయని ఆవాజ్ నాయకులు మహమ్మద్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో నగరంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచే ఉద్దేశంతో శనివారం ఆవాజ్ నేతత్వంలో మెహిదీపట్నం చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగిన మైకంలో కొందరు హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాబట్టి వ్యక్తులు మద్యం సేవించడం మాని ఆదర్శ జీవితం గడపాలని పిలుపునిచ్చారు. అలాగే కొందరు తాత్కాలిక ఆవేశానికిలోనై హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అట్టివారు తమను తాము అదుపులో పెట్టుకోవాలని, ప్రజలందరూ శాంతియుతంగా జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఇబ్రహీం, నయీం, భాను, సాయిరావేగం జబ్బర్ బాయ్, నయీం, బసిర్ ఖాన్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి..



- బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-ధూల్ పేట్

బోనాల ఉత్సవాల సందర్భంగా గోషామహల్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎమ్ ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను స్థానిక చుడి బజార్ అరుంధతి సేవ సంఘం నాయకులతో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో రానున్న బోనాల పండుగ సందర్భంగా పెండింగ్ పనుల అంశం పై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో అనేక ఆలయాలు ఉన్నాయని, వాటికి అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. నియోజకవర్గంలో కచ్చి మోరి, టెంప్రవరి లైట్స్, ప్యాచ్ వర్క్స్ పెండింగ్ పనులు ఉన్నాయన్నారు. త్వరగా పూర్తి చేసి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన కింది స్థాయి అధికారులకు ఆయా పనులకు సంబంధించిన ఎస్టిమేట్ వేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎమ్ కష్ణ, ఎమ్ ధర్మేందర్, డి వెంకటేష్, టి దేవేందర్, ఓ కిషోర్, ఎమ్ వెంకటేష్, నాగేశ్వర్ రావు, ఎస్ కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో బోనాల పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి..



నవతెలంగాణ-ధూల్ పేట్

ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే పాతబస్తీలోని అన్ని దేవాలయాల వద్ద అభివద్ధి పనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో పాటు ఇంజినీరింగ్ అధికారులను కోరినట్టు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మెన్ గాజుల అంజయ్య తెలిపారు. జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన కో-ఆర్డినేషన్ కమిటి సమావేశంలో తాను పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయని సంబంధిత కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేవాలయాల వద్ద పనులు చేస్తామంటూ టెండర్లు పొందుతున్న కాంట్రాక్టర్లు బోనాల జాతర ఉత్సవాలు ముగిసేంత వరకు కూడా ఆయా పనులను పూర్తి చేయడం లేదన్నారు. గత రెండేండ్లుగా పాతబస్తీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాలలో ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహించ లేదన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బహిష్కరించి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మెన్ రాకేశ్ తివారి, మాజీ ఉపాధ్యక్షులు మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీ హాల్లో ఉన్న డంపింగ్ యార్డును శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో డంపింగ్ యార్డును ప్రజలకు కమ్యూనిటీ హాలుగా ఉపయోగపడేలాగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను గత పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం కూల్చివేసి డంపింగ్ యార్డుగా మార్చటం బాధాకరమని పేర్కొన్నారు. మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలుగా ఏర్పాటు చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఉన్నారు.



నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్.కె. రెసిడెన్సి అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

-నవతెలంగాణ, సుల్తాన్ బజార్

మతోన్మాదం వల్ల మనిషికి స్వేచ్ఛ ఉండదు



- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మతోన్మాదం వల్ల మనిషికి స్వేచ్ఛ ఉండదు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు హెచ్చరించారు. పార్టీ మల్కాజిగిరి మండల సభ్యుల రాజకీయ తరగతులు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాలని పార్టీ మండల కమిటీ భావించింది. దీనిలో భాగంగా శనివారం నిర్వహించిన మొదటి క్లాసు స్కైలాబ్ బాబు, రెండో క్లాసు పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి బోధించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ మాట్లాడుతూ మతం మనిషి మనుగడకు విఘాతం కలిగిస్తుందన్నారు. మహిళల స్వేచ్ఛను హరిస్తుందన్నారు. ప్రధానంగా కులవివక్ష పెరుగుతుందనీ, తద్వారా బలహీన వర్గాల పేదలకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. దేశ అభివృద్ధి కుంటుపడుతుందనీ, ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. మతం, రాజకీయం వేరు వేరుగా చూడాలి, కానీ కేంద్ర ప్రభుత్వం మతాన్ని రెచ్చగొడుతున్నదనీ, మతోన్మాద ఎజెండాను అమలు చేయాలని అని కుట్ర చేస్తున్నదనీ, దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కోమటి రవి నేటి అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల మీద ప్రసంగించారు. దేశంలో అవినీతి, నిరుద్యోగం, పెరిగిందన్నారు. కార్మిక చట్టాలు కుదించబడ్డాయనీ, కనీస వేతనం తీవ్రంగా తగ్గించారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ప్రయివేట్ పెట్టుబడిదారులకు అమ్ముతున్నారన్నారు. పెట్టుబడిదారులు మరింత కుబేరులవుతున్నారని తెలిపారు. మోడీ సర్కారు లక్షలాది కోట్లు రాయితీలు ఇస్తుండటంతో కుబేరులకు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమవుతున్నాయన్నారు. సీపీఐ(ఎం) పార్టీగా ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగడుతూ ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ మల్కాజిగిరి మండల సెక్రెటరీ కృపాసాగర్ అధ్యక్షతన వహించారు. మండల కమిటీ సభ్యులు నర్సింగ్ రావ్, మంగ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శ్రీనివాస్, సుమిత్ర, విజయ్‌కుమార్, నర్సయ్య, సూర్య కుమార్, రాజ్యలక్ష్మీ నాగమని, తదితరులు పాల్గొన్నారు.



'రివార్డ్'లతో వల..

కూపన్లతో ఖాతా ఖల్లాస్



- కష్టపడకుండానే లక్షలు సంపాదిస్తున్న సైబర్ నేరస్తులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా సైబర్ నేరస్తులు వారిపని వారు కానిస్తున్నారు. ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలపై దృష్టి సారిస్తున్నారు. ఇందుకుగానూ మార్కెట్లోకి ఏ అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా దాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రజలు ఏదైనా అవసరమైన సమాచారం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేద్దామన్నా చాలు సైబర్ నేరగాళ్లు ప్రత్యక్షమవుతున్నారు. నిజమైన ఆన్‌లైన్ సేవకులుగా, సర్వీస్ సెంటర్ల నుంచి మాట్లాడుతున్నామని బాధితులను సైబర్ నేరస్తులు నమ్మిస్తున్నారు. వారి నమ్మకంతోనే బాధితులకు తెలియకుండానే వారి వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నారు. తాజాగా షాపింగ్‌మాల్స్, పెట్రోల్ బంక్స్, ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ లేదా మీ షో కూపన్లతో డిస్కౌంట్స్ వస్తాయని అమాయకులను బుట్టలో వేసుకుంటున్నారు. వలలో పడ్డవారిని మాయమాటలతో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరస్తుల బారిన ఉన్నత ఉద్యోగులు, కంపెనీ సీఈఓలు, ఆర్థిక నిపుణులు, బ్యాంక్ అధికారులు, ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం చిక్కుతుండడం గమనార్హం.

నకిలీ పేర్లు - లింక్‌లతో ఫోన్లు హ్యాక్

కష్టపడకుండానే సులువుగా డబ్బులు సంపాదించాలని ఆలోచిస్తున్న సైబర్ నేరస్తులు కూర్చున్న చోటే లక్షలు సంపాదిస్తున్నారు. అందుకు నకిలీ వెబ్‌సైట్లు, లింక్స్, యాప్‌లను తయారు చేస్తున్నారు. ఐటీ నిపుణులు, ఉన్నతాధికారులు సైతం గుర్తుపట్టలేని విధంగా ప్రముఖ బ్యాంకులు, సంస్థలు, ఈ కామర్స్ సైట్లకు చెందిన పేర్లను ఉపయోగిస్తున్నారు. పెద్దఎత్తున సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థల, బ్యాంకుల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. రివార్డులు, ఆఫర్ల కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేసిన వ్యక్తి ఫోన్‌ను క్షణాలల్లో హ్యాక్ చేయడంతోపాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు. ఖాతాలోని డబ్బులను కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతూ లక్షలు వసూళ్ల చేస్తున్నారు.

క్యాష్‌బ్యాక్ అంటూ...

ప్రతి సెల్‌ఫోన్‌లో ఇప్పుడు డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఏదో ఒక యాప్ ఉంటుంది. కొన్ని యాప్‌లు నేరుగా ఖాతాదారుడు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి వివరాలతో ఆపరేట్ చేస్తుండగా, మరికొన్ని సంస్థలు కేవైసీ ఫారాన్ని ఖాతాదారుడు అప్‌లోడ్ చేసిన తర్వాత, ఆయా కంపెనీల వారు నేరుగా వచ్చి ఖాతాదారుడిని కలిసి వెరిఫికేషన్ కూడా చేస్తుంటాయి. ఇలా వేర్వేరు యాప్‌లు డిజిటల్ లావాదేవీల సేవలు అందిస్తున్నాయి. డిజిటల్ లావాదేవీలను ఆసరాగా చేసుకుంటున్న సైబర్‌నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో ఖాతాదారులను మోసం చేస్తున్నారు. క్యాష్ బ్యాలెన్స్ వచ్చిందని లింక్‌లు పంపిస్తున్నారు. లింకులను క్లిక్ చేసి దానిలో వివరాలను పొందుపరిస్తే ఖాతా నెంబర్‌తో పాటు ఓటీపీ వివరాలు కూడా సైబర్‌నేరగాడికి తెలిసిపోతున్నాయి. సైబర్ నేరస్తుల చేతిలో గ్రేటర్ హైదరాబాద్‌లో రోజుకు 20 నుంచి 50 మంది వరకు బాధితులు చిక్కి మోసపోతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి: సైబర్ పోలీసులు

సైబర్ నేరస్తులు రోజుకో తీరులో రెచ్చిపోతున్నారని సైబర్ పోలీసులు తెలిపారు. ముఖ్యంగా దసరా, దీపావళి వంటి పండగలు, స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డేలాంటి సమయాల్లో ఆకర్షణీయమైన సందేశాలను పంపిస్తున్న సైబర్ నేరగాళ్లు అందినకాడికి దండుకుంటున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింక్‌లను క్లిక్ చేయవద్దని, వాటిని వెంటనే డిలీట్ చేయాలని సైబర్‌క్రైం అధికారులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది మరియు గుర్తు చేయునది ఏమనగా, మా క్లయింట్ శ్రీమతి జయశ్రీ గద్దాలే, భర్త : జి.నాగేశ్వరరావు, నివాసం : విజయ హెరాల్డ్స్, హైదరాబాద్-67గారు, ఫ్లాట్ నెం.ఎ-109, బ్లాక్-ఎ, "వెంకట గజానన హెరామ్స్", సర్వే నెం. 119 మరియు సర్వే నెం. 150/సి లో, కొంపల్లి గ్రామం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యొక్క శ్రీ. అయిలా శ్రీనివాస్‌రెడ్డి & ఇతరులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎం/ఎస్. వెంకట గజానన డెవలపర్స్ నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశించారు. విలువైన అమ్మకంను పరిగణనలోకి తీసుకొని, పైన పేర్కొన్న ఆస్తి విషయంలో ఎవరైనా వ్యక్తులకు ఏదైనా హక్కు, టైటిల్ లేదా ఆసక్తి ఉన్నట్లయితే, వారియొక్క అభ్యంతరాలను ఇది ప్రచురితమైన 7 రోజుల్లోగా తెలియజేయాలి లేదా లేదంటే, మా క్లయింట్ ఇష్టతమేరకు లావాదేవీ పూర్తవుతుంది. ఏదైనా అభ్యంతరాలు ఆ తదనంతరం అందినయెడల పరిగణనలోకి తీసుకోబడవు.

అక్షిత్ సంఘీ
అడ్వొకేట్స్,
ఫ్లాట్ నెం. 302, వంశీ టవర్స్,
3వ అంతస్తు, మహేశ్‌నగర్ కాలనీ,
చిరాగ్ అలీలేన్, హైదరాబాద్-500001,
సెల్ నెం : 09963102934.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE cum XIII ADDITIONAL METRO POLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT AT :RAJENDRA NAGAR
O.S.No.42 OF 2023

BETWEEN:
Mrs Kolluru Sujatha 7 others ...Plaintiffs
AND
Tahasildar, Gandipet mandal, and all Concerned ...Defendants

To
All concerned
The public at large are hereby informed that the plaintiffs have filed a suit to declare them as the legal heirs of Late Borra Anjaiah. The persons having any objection for the same may appear **on Date 28-06-2024 at 10-30 AM** before this court, either in person or through advocate along with documents, failing which the matter will be decided according to law.

//BY COURT ORDER//
K.CHANDRA MOULI
Advocate
Suchitra, Hyderabad

IN THE COURT OF THE HONOURABLE XITH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S.NO.556 OF 2022

BETWEEN:
Veerender Devatraj ...Plaintiff
AND
Mr.Sailesh Kumar Gujjar ...Defendant

Mr.Sailesh Kumar Gujjar, S/o Late Nagender Rao Gujjar Aged 55Yrs, Business, at 4-1-42, 43, 45/A, Old Bhoiguda, Secunderabad 500 003 ...Defendant

Whereas the Plaintiff Veerender Devatraj has instituted a suit for recovery of money for Rs.5,14, 000/- against you. You are hereby summoned to appear in the Court of XITH JUNIOR CIVIL JUDG, City Civil Court at Secunderabad in person or through an advocate duly instructed, **on 11-07-2024 at 10.30 A.M.** failing which the matter will be heard and decided Ex-Parte.

(BY ORDER OF THE COURT)
B. Naveen
G.V. Giridhar,
B.N. Radhakrishna Yadav,
B. Naveen Kumar
Advocates
Plot No. 77, Syndicate Bank Colony, West Marredpally, SECUNDERABAD-500026.
Cell. No. 8341742340

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా అండ్ సెషన్ జడ్జి గారి కోర్టు హుజూర్ నగర్‌లో
ఎస్.నెం: 20/2023

మధ్య :
జూలకంటి వెంకటరెడ్డి ...అప్పిలెంట్/వాది
మరియు
జూలకంటి సునీత ...రెస్పాండెంట్/ప్రతివాది

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, నేను అనగా జూలకంటి వెంకట రెడ్డి తండ్రి: నర్సిరెడ్డి, వయస్సు: 58 సం॥లు, వృత్తి: వ్యాపారము., నివాసము: ఇంటి నెం: 1-10/1/1, చెతన్య కాలనీ, హుజూర్ నగర్ టౌన్ & మం॥ సూర్యాపేట జిల్లా. అను నేను పైన తెలిపిన దావాలో రెస్పాండెంట్ అయిన జూలకంటి సునీత భర్త: వెంకటరెడ్డి, వయస్సు: 48 సం.లు., గారిపై మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా అండ్ సెషన్ జడ్జి గారి కోర్టు హుజూర్నగర్‌లో అప్పీల్ దావా వేసి వున్నాను. అట్టి దావా సమన్లు కోర్టు నుండి ఎన్ని సార్లు పంపినా అడ్వకేట్ కమీషన్ ద్వారా పంపిన వారికి సమన్లు ముట్టడం (రిసీవ్) కావడం లేదు. కోర్టు వారు పైన తెలిపిన దావా తేది: 12-07-2024 న వాయిదా వేసి వున్నారు. ఇట్టి దావా కు సంబంధించి రెస్పాండెంట్ తేది: 12-07-2024 ఉదయం గం.10:30ని. వరకు పైన తెలుపబడిన కోర్టు వారి ముందు స్వయంగా గాని వకీలు ద్వారా కాని హాజరు అయ్యి తమ యొక్క సమాధానము దాఖలు చేసుకొనగలరు, లేని పక్షములో రెస్పాండెంట్ /ప్రతివాది ఎక్స్‌పార్టీగా కోర్టు వారు నిర్ణయం తీసుకొనబడుతుంది. కావున తేది:12-07-2024 న ఉదయం గం॥ 10:30ని. వరకు హాజరు కాగలరు. కోర్టు వారి ఆదేశము ఆర్డర్ ప్రకారముగా ప్రకటన ఇవ్వబడినది.

అప్పిలెంట్
జూలకంటి వెంకటరెడ్డి
పార్టీ ఇన్ పర్సన్,హుజూర్ నగర్,
సూర్యాపేట జిల్లా,సెల్:9441464781.

NOTICE OF THE DAY FIXED FOR SETTLING A SALE PROCLAMATION
(Order 21, Rule 66)

IN THE COURT OF THE XXV ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD
E.P.NO.84 OF 2018
IN
A.R.C.NO. 19 OF 2017

Between:
M/s SHRIRAM City Union Finance LTD, (Basheerbagh) Branch, Hyd. ...DECREE HOLDER
AND
Maleka Sultana & another ...JUDGMENT DEBTOR

TO
2.Aziz Bin Abdullah, S/o Abdullah Bin Saleem Ba Makoos Al Dayani, aged about: Major, R/o.D.No: 13-5-404(8), Karwan, Near Mini Mart Super Market, Tellagadda, Ramaiahwadi, Hyd ....JDR NO.02

TO WHOMSOEVER IT MAY BE CONCERN

in the above mentioned E.P., the below mentioned property is brought for sale to realize the Decree Debt of Rs.41,44,623/-. Auction is going to held **on 26.06.2024** at court premises **at 10.30 A.M.** Therefore, whoever is interesting the property can attend and participate in bid which is opened to one and all.

SCHEDULE OF PROPERTY

All that House bearing No. 13-5-404, 13-5-405, Ward-13, Block-5, Extend 168.45q.Yds situated at: Talim Amalpura, under SRO Golconda, Hyd, Telangana State, and bounded as under

NORTH: Neighbors House
SOUTH: ROAD, **EAST:** Lane
WEST: House No.13-5-406

The terms and conditions of the sale may be ascertained from the Bailiff of the said court.

(BY ORDER OF THE COURT)
S.RAVIKANTH
Advocate
Hyderabad COUNSEL FOR DECREE HOLDER

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, CHEVELLA, RANGA REDDY DISTRICT
O.S.NO.155 OF 2024

BETWEEN:
Smt.Sushmita Datta and Another ...Plaintiff
AND
All Concerned and Tahsildar Moinabad ...Defendants 1 & 2

To
D-1.All Concerned
D-2.Tahsildar Moinabad Mandal, R.R. District ...Defendant No.1 &2

Take notice that my client Smt. Sushmita Datta and Sushmit Datta filed the above suit in O.S.No.155 of 2024, which is pending before the Hon'ble Junior Civil Judge, Chevella, Ranga Reddy District, at Chevella. In this case, my clients sought the relief of Suit to declare that the Plaintiffs the only legal heir in respect of land in Sy.Nos.66/U, 66/UU And 66/E Part adm gts 250 Sq. Yards, situated at Chanda Nagar Gram Panchayath and village, Moinabad Mandal, Ranga Reddy District.,
In the above said suit you are arrayed as Defendant No.1 and 2. The above said suit is posted **on 07-06-2024 at 10.30 am**., before the above said court for your appearance. Hence you are required to appear in the above said suit on the above said date and time either in person or through an advocate duly authorized by you. Hence, this notice.

//by order of the court//
B.SURESH
Advocate,
Opp: Government Guest House Court Road, Chevella.
R.R.District.

IN THE COURT OF THE III id CHIEF JUDGE CITY CIVIL COURT. AT : HYDERABAD
O.S. NO. 782 OF 2019

Between:
CANARA BANK, BANJARA HILLS.Hyderabad ....Plaintiff
AND
SRI P. RAVINDER ...Defendant

Suit Summons to Defendant

To.
Sri. P. RAVIDER, S/O Sri. P. Rajaiah r/o HNO. 6-3-270/1, Balapura Basti, Erramanzil colony, Hyderaba -500034. (defendant)

Please take notice that the above mentioned plaintiff filed money suit for recovery of Rs. 19,84,836=12 plus interest from the date of suit against you Hon'ble Court posted the suit **on 01-07-2024 at/10-30 am.** (for your appearance either in person or through an advocate, failing which the suit will be heard and determined exparte.

(BY ORDER OF THE COURT)
K.V. Nageswara Rao
Advocate
COUNSEL FOR Plainitfi
Hyderabad

IN THE COURT OF XII ADDITIONAL DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR
I.A.NO.366 OF 2021
in
O.S.No.661OF 2018

Between:
M.Venkatesh Yadav & others ...Petitioners/Plaintiffs
And
1.Kabiruddin & others ...R1 to R8/D1 toD8
2.MSS Constructions,Represented by its Proprietor M.Somaiah ...Respondents No.9/Prop.D9

To
MSS Constructions, Rep.by its Proprietor M. Somaiah, S/o.Late. M.Kondaiah, aged about 49 yrs, Occ: Business, R/o.H.No.13-06-43 8/140, Satyanarayana Nagar, Gudimalkapur, Hyderabad.

Please take notice that our Clients M.Venkatesh Yadav & 10 others have filed the above Interim Application against you under Order 1 Rule 10 (2) R/w.Section 151 of CPC & Rule 28 of C.R.P to implead you as Defendant No.9 in the above suit and also for consequential amendment of plaint and the same is posted to 19-07-2024 for your appearance. Inspite of this notice if you fail to attend before the above mentioned court **on 19-07-2024 at 10.30 A.M,** you will be set exparty and the Hon'ble Court will be pleased to pass appropriate orders as per the material available on record.

//BY ORDER OF THE COURT//
M/s.D.RAJA AMARESH
K.SRINIVAS
ADVOCATES
Mulgi No. G-1, 5-3- 650/G1, Maheshwari Chambers, Raj Bhavan Quarters Colony, Somajiguda, Hyd-82
Cell No.9346921735.

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD
OP/S.O.P.NO.20 OF 2024

Between:
1) MULUGU SURYANARAYANA RAMESH@ MS RAMESH S/O MULUGU SURYANARAYAYA, Aged about: 61yrs,Occ: Employee, R/o:12-10-664/6, Flat No:201,Sri Nivasam, Road No:1, Indira Nagar Warasiguda, Hyderabad-500061.
2)MULUGU VENKATESHWAR RAO S/O MULUGU SURYANARA YAYA, Aged about: 58yrs,Occ: Employee, R/o:01-07-988/A, Ram nagar X Roads, Azambad, Hyd-20
3)MULUGU NAGARAJU S/O MULUGU SURYANARAYAYA, Aged about: 51yrs, Occ: Un Employee, R/o:01-07-988/A, Ramnagar X Roads, Azambad, Hyderabad-500020 ,
4)MULUGU SATYANARARYANA S/O MULUGU SURYANARAYAYA, Aged about: 49yrs,Occ:Un Employee, R/o:01-07-988/A, Ram nagar X Roads, Azambad, Hyderabad-500020 , ...Petitioners
AND
1)The Depot Manager,TSRTC Cantonment Bus Depot, Secunderabad, Telangana,Pin Code 500026.
2) AllConcerned ...Respondents

To,
ALL CONCERNED.

NOTICE

The above named Petitioners have filed the above suit to for Succession. Declare them as only Successor of the Late.Sri. MULUGU SURYANARAYANA SURESH KUMAR@MS SURESH KUMAR S/o MULUGU SURYANARAYANA who died on28-10-2020 at R/o H.no:1-7-988/A, Hazar galli, Ram Nagar, Hyderabad. The said case stands posted **to 15-07-2024 at 10-30 A.M.** If anybody has got any objection for grant of the above relief in favour of the said Petitioners, they may file their objections before the Hon'ble III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD on the said date. Otherwise, the matter will be heard and decided as per the Procedure.

//By Order//
-Sd-
Sathish Perla, Advocate for Petitioners,
R/o H.no, 9-5-54 Bowenpally, Secunderabad-500009.

IN THE COURT OF THE HON'BLE ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDL METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S.NO.356 OF 2023

BETWEEN:
M/s.South Indian Bank Ltd. ...Plaintiff
AND
Mr.Ammireddy Venender ...Defendant

To,
Mr.Amireddy Venendar Reddy S/o Amireddy Srinivas Reddy, aged 34yrs, Occ; Self Employed, R/o.Plot No.70 SP,2nd Floor, 4th Portion, Sriram Nagar,BN Reddy Nagar, Hyd, Telangana - 500079 ...DEFENDANT

Whereas the above-named Plaintiff has filed the above suit for Recovery of Rs.10,73,928.59/- against you and you are hereby directed to appear either in person or through an advocate duly instructed **on 24-06-2024** before the above court **at 10.30 A.M** in the forenoon to show cause against the above suit, failing which the said suit will be heard and determined in your absence.

//BY ORDER OF THE COURT//
M.SUNIL KUMAR
Advocate
Off :#52,52,SMR SAR TAJ PLAZA,Jupiter Colony Sikh Road, Secunderabad-500009
Mobile:9246504190

IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE AT: HAYTHNAGAR
O.S.NO.148 OF 2024

Between:
T.Manohara & Others ...Plaintiffs
And
Tahsildar/MRO. Abdullapurmet Mandal & All Concern ...Defendants

NOTICE

Please take noticed that, the above plaintiffs have filed suit for declaration to declare them as Legal Heirs of Smt. Gowridevi Mangamma W/o Gowridevi Eshwariah was died on 26-10-2019, who acquired the open land bearing Plot No 233, of Ganesh Residency, Admeasuring 200.Sq. Yards or 167.23 Sq. Mtrs, in survey No.510/A, a, E, and 511/A,a,E, Situated at Manne Mutyala kunta, H/o Turkayamjal Village, Haythnagar Revenue Mandal, and know change as Abdullapurmet Mandal, Ranga Reddy District. And bounded by: **NORTH:** 50'Wide Road, **SOUTH:** Plot No.234/1, **EAST:** Plot No. 232, **WEST:** Plot No.233/1, and the said suit is posted on 22-07-2024 for the objections from all concerned. Who are having any objections, therefore it is to inform to the general public that. If anybody having any objection related to above facts, and may be appear before this Hon'ble court **on 22-07-2024 at 10.30 AM,** either in person are through on Advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

//By Order of the Hon'ble Court //
P.VITTAL
ADVOCATE
H-NO.9-3-79, Champapet, Hyderabad-500079
Ph.No:9246578782

IN THE COURT OF THE HON'BLE JUNIR CIVIL JUDGE AT: HAYATHNAGAR
O.S.No.314 OF 2024

BETWEEN:
1.Mariganti.Krishnama Chary S/O Ramchandrachary Aged above 64yrs Occ: Pujari
2.Mariganti.Sai Prakash S/O Krishnama Chary Aged above 34yrs Occ: Pvt employee
3.Mariganti.Sai Prasad S/O Krishnama Chary Aged above 34yrs Occ: Pvt employee
4.Mariganti.Sai Chand S/O Krishnama Chary Aged above 32yrs Occ: Pvt employee
All are Resident at 1-6-202/18/24 Mushirabad,BapujiNagar Secundrabad Hyderabad Telangana; 500061 ...Plaintiffs
AND
1.All concened
2.The Mandal Tahasildhar officer Hayath Nagar Having office at Hayath Nagar village & Mandal. R.R Dist .Telangana pin 501505 ..Defendant/s

Sirs,
Whereas the above-named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of Paruchuri Ravindranath Tagore. Therefore, all concerned are hereby requested to appear before the Hon'ble court **at 10.30 A.M. on 26-06-2024** either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise, the matter will be heard and decided exparte in your absence.

SCHEDULE OF PROPERTY

All that Piece And Parcel of Plot No .27, Admeasuring 210 Sq.Yards. Equivalent to 175.58 Sq mtrs. in Survy No.71/2, Ward No.5, Block 2, Of L.B.Nagar Municipality, Situated at Saheb Nagar Colany Village, Hayathnagar Rev Mandal, Ranga Reddy Dist., Under SRO and Hayathnagar Registration and Bounded By;

NORTH: Land of belongs to Laxmi pathi., **SOUTH :** Plot No.28
EAST : Plot No.431
WEST : 30 ft wide road

Bumanandham Ganji
ADVOCATE,
Hayathnagar, Hyd.
Ph: 9392552949,

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎట్ : సూర్యాపేట సమక్షములో
O.S.NO.9/2022

బిట్వీన్:
మండల్‌రెడ్డి కుశలవరెడ్డి ...పీటీషనర్/పిటిషనర్
మరియు
మండల్‌రెడ్డి నాగార్జున్‌రెడ్డి మరియు ఇతరులు ...రెస్పాండెంట్/రెస్పాండెంట్స్

టూ,
శ్రీమతి మేకల హల్య భర్త : మేకల రాంరెడ్డి (లేట్), @ తండ్రి కొండల్ రెడ్డి (లేట్) వయస్సు : 60 సవత్సరాలు , నివాసం : ఫ్లాట్ నెంబర్ 501, వైష్ణవి, ఎస్ఆర్ఆర్‌వి, ఎజెన్సీ, ఆర్.కె.పురం, సరూర్ నగర్ హైదరాబాద్-పిన్:500035. ...రెస్పాండెంట్ నెం.3

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా! పైన తెలిపిన ఓ. ఎస్. 9/2022లో మీ హాజరుకై తేది:26-07-2024 నాడు ఉదయం గం॥ 10-30 ని॥లకు పైన తెలిపిన గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూర్యాపేట వారి సమక్షంలో వాయిదా కలదు. కావున మీరు వ్యక్తిగతముగా కానీ లేక న్యాయవాది ద్వారా హాజరై మీ అభ్యంతరాలు / ఆక్షేపణలు తెలుపుకొన వచ్చును. లేనిచో తదుపరి చర్యలు గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు చట్ట ప్రకారముగా చేపట్టుదురు.
(గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి అనుమతితో)

ఇట్లు
నూకల సుదర్శన్‌రెడ్డి న్యాయవాది
బి.కాం.,ఎల్ఎల్‌బి.
ఇంటి.నెంబర్.1-6-141/9/2/10,
విద్యానగర్,రోడ్ నెం.3,H
సూర్యాపేట-508213.
సూర్యాపేట జిల్లా,సెల్:9848398224.
తేది:22-06-2024
సూర్యాపేట.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎట్ : సూర్యాపేట సమక్షములో
O.S.No.16 OF 2016

బిట్వీన్:
కట్లా సరిత ....పీటీషనర్/పిటిషనర్స్
మరియు
కేసగాని మారయ్య మరియు ఇతరులు ....రెస్పాండెంట్/రెస్పాండెంట్స్

టూ,
శ్రీ పాశం గోపాల్ రెడ్డి, తండ్రి పాశం మోహన్ రెడ్డి, వయస్సు 65 సవంత్సరాలు, వృత్తి : బిజినెస్, నివాసం : ఫ్లాట్ నెంబర్ 302, సాయి శుభం రెసిడెన్సీ, మారుతినగర్, కొత్తపేట, హైదరాబాద్- పిన్ : 500035. (రెస్పాండెంట్ నెం.5)

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా! పైన తెలిపిన ఓ.ఎస్. 16/2016 లో మీ హాజరు కై తేది:11-07-2024 నాడు ఉదయం గం॥10-30 ని॥లకు పైన తెలిపిన గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూర్యాపేట వారి సమక్షంలో వాయిదా కలదు. కావున మీరు వ్యక్తిగతముగా కానీ లేక న్యాయవాది ద్వారా హాజరై మీ అభ్యంతరాలు/ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో తదుపరిచర్యలు గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు చట్ట ప్రకారముగా చేపట్టుదురు.
(గౌరవ శ్రీ మహారాజ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి అనుమతితో)

ఇట్లు
నూకల సుదర్శన్‌రెడ్డి న్యాయవాది
బి.కాం.,ఎల్ఎల్‌బి.
ఇంటి.నెంబర్.1-6-141/9/2/10,
విద్యానగర్,రోడ్ నెం.3,H
సూర్యాపేట-508213.
సూర్యాపేట జిల్లా,సెల్:9848398224.
తేది:22-06-2024
సూర్యాపేట.

IN THE COURT OF HON'BLE V ADDL, JR. CIVIL JUDGE-CUM-V ADDL, M.M.. R.R.DISTRICT AT: L.B.NAGAR
E.A.NO.02 OF 2024
IN
E.P.No.3 OF 2023
IN
O.S.No.1569 OF 2021

BETWEEN:-
Smt.S.Annapurna, ...Decree-Holder/ Plaintiff
AND
M/s.A.R.Fashions, Rep.by its Partner, Sri.K.Ramesh. & another ...Judgment-Debtors/ Defendants

COURT NOTICE

To.
1.M/s.A.R.Fashions, Rep.by its Partner, Sri.K.Ramesh, S/o K.Vaikuntam, Aged about 41-Yrs, Occ: Business, Shop bearing H.No.13-17-2, (17-2), Sri Krishna Nagar, Road No.1, Sai Baba Temple Road, Dilsukhnagar, Hyd-500 060 (T.S.).
2.Bri.K. Ramesh, S/o K.Vaikuntam Aged about 41-Yrs, Occ:Business, R/o H.No. 3-1-485/1, Nimboli gadda, Hyderabad-500 013 (T.S). ...Judgment-Debtors

That the Decree-Holder had filed the above Suit for Eviction & Arrears of Rent against You No.1& 2 in respect of M/s A.R.Fashions, consisting of one Big Room situated in H.No.17-2 (New No: 13-17-2), Sri iKrishna Nagar, Near Sai Baba Temple, Dilsukhnagar, Saroornagar Revenue Mandal, R.R. District and obtained Judgment against you both. Sub Subsequently, the above E.P. has been filed against You both for Eviction and took the delivery of possession of the said Premises from the Court Bailiff under Eviction Warrant. Now, since you are avoiding to receive Court Notice in the above-said Petition filed for Public auction of the attached movables of Cloths, etc. as per Inventory of the Court Bailiff, and as per orders of this Hon'ble Court, this Publication is made against You for your appearance in the above matter **on 15.07.2024 at 10.30 AM.**
Therefore, You No. 1&2 are hereby directed to appear either in person or through Advocate duly instructed to appear on your behalf to answer the above Petition **on "15.07.2024 at 10.30 AM"** in the above Hon'ble Court at L.B.Nagar, R.R District or else the matter will be heard and decided in your absence by setting You Ex. Parte.

// By order of the Court //
Sd/-
M/s.Machiraju Gopala Rao, & G.Ravinder Goud,
Advocates
H.No.11-8-117(New), Plot No.9, Ratna Machala, Vikas Nagar, Kranthi Nagar, SRNR, HYD-35.Cell: 9440836112

IN THE COURT OF THE HON'BLE 1st PRL. SENIOR CIVIL JUDGE, AT: L.B NAGAR
O.S.No.1061 OF 2018

Between:-
Smt.Jaya Lakshmi ...Plaintiffs/Petitioner
AND
Veeraganti Kishore Kanth, & Ors ...Defendants /Respondents

To
1)Mr.Abdul Javeed Jabbar S/o Abdul Jabbar, Age about: 30yrs,
2)Mr.Abdul Khader S/o Abdul Jabbar, age about: 35yrs,
(Defendant both 3 and 4 R/o.12-1-922/40, Asif Nagar, Hyderabad.) ...Defendant No 3 & 4

Please take Notice that the above named Plaintiff s have filed a suit for cancellation of document against you, Vide OS No.1061/ 2018 and the same stand posted **on 05-08-2024** Hence you are directed to appear before the Hon'ble either in person or by your Proxy failing which the Hon'ble court will proceed the matter as per Law.

//By Order of the Hon'ble Court//
Mirza Mahmood Ali Baig
Advocates High Court
Office Chamber at:8-1-43/1/A/2 Shaikpet, Hyd-08
Cell: 9989230157, 9393091541

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు ఎట్ సూర్యాపేట గారి సముఖమున
ఏ.ఎస్.నెం.19/2023

మధ్యలో:
ధరావత్ శంకర్ ...అప్పిలెంట్
మరియు
ధరావత్ గోప (సిన్స్ డీసీజుడ్) మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం.12 : మెస్సర్స్ శ్రీ సురక్షిత ఎస్టేట్స్, హైదరాబాద్. రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్టనర్ పంజాల రామాంజనేయులు గౌడ్ తండ్రి నారాయణ, వయస్సు :63 సం॥లు వృత్తి : వ్యాపారము, నివాసము :ఇం.నెం.4-7-10/10/9, రాఘవేంద్ర నగర్ ,నాచారం, హైదరాబాద్.

పై అప్పిలెంట్ మీ పై వేసిన అప్పీల్ సూట్లో కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నో సార్లు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా అప్పీల్ నోటీసులు పంపినను. మీకు ముట్టినట్లు సమాచారము లేనందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం అప్పీల్ నోటీసులను ఈ పత్రిక ద్వారా ప్రచురించనైనది. అప్పీల్ సూట్ తేది 25-07-2024న ఉదయం 10-30 గం॥లకు కలదు.

కావున వాయిదా తేదీ రోజున మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా హాజరు అయి మీ వ్రాత పూర్వకమైన అభ్యంతరములను తెలియజేయగలరు. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షములో తీర్పును ఇవ్వగలరు.

వాయిదాతేది: 25-07-2024న ఉదయం 10-30 గం॥లకు
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కట్కూరి రఘుపతిరెడ్డి
న్యాయవాది:సూర్యాపేట.
సెల్:9396812280.
తేది:23-06-2024
సూర్యాపేట.

IN THE COURT OF THE HON'BLE XIV ADDL. METROPOLITAN MAGISTRATE CUM JUNIOR CIVIL JUDGE : AT: HAYATHNAGAR
O.S.NO.360 OF 2024

Between:-
1.Bogoju Vasuda, W/o Late B.Suresh Kumar, Aged about 44yrs , Occ: House Wife R/o H.No. 4-7-393/2, Raghavendra Nagar Colony, Hayathnagar, K.V.Ranga Reddy, Telangana-501 505.
2.Bogoju Sanjana Sthithi, D/o Late B.Suresh Kumar, Aged about 15yrs, Occ: Student,R/o H.No.4-7-393/2, Raghavendra NagarColony, Hayathnagar, K.V.Ranga Reddy, Telangana – 501 505.
3.Bogoju Saketh Vasav, S/o Late B.Suresh Kumar, Aged about 9yrs, Occ: Student, R/o H.No.4-7-393/2, Raghavendra Nagar Colony, Hayathnagar, K.V.Ranga Reddy, Telangana – 501 505.
4.Bogoju Narsimha Chary S/o Late suryanarayana Chary Age about 75Yrs Occ: Nil. R/o H.No.4-7-393 /2, Raghavendra Nagar Colony, Hayathnagar, K.V.Ranga Reddy, Telangana – 501 505.
5.Bogoju Kousalya W/o Bogoju Narsimha Chary Age about 69 Yrs Occ:Nil. R/o H.No.4-7-393/2, Raghavendra Nagar Colony, Hayathnagar, K.V.Ranga Reddy, Telangana – 501 505. ...Plaintiffs
And
1.All Concerned
2.The Mandal Revenue officer,, Hayathnagar Mandal, Rangareddy District, T.S ...Defendants

PUBLIC NOTICE

Take notice that the plaintiffs herein had filed the above suit for declaration of legal heirs declare them as they are legal heirs of late.Bogoju Suresh Kumar, son of B.Narasim ha Char property bearing residential flat situated at Sy. No. 102, First Floor, of "VENKY's S.S.Residency."an extent of 830 square feet (inclusive of common areas and balconies) and includes a 100-square-foot car parking space and possesses an undivided share of land measuring 34.0 square yards or 28.42 square meters (out of a total of 600 square meters) which is constructed on land identified as Plot Nos. 58 and 59.and forming part of Sy.No.12. This property is located in Kamala nagar Co-Operative Housing Colony, Phase-II of Saheb Nagar Kalan Villages, Hayath Nagar Revenue Mandal, under Ward No. 5, Block No. 4 of L.B. Nagar Circle No. III of G.H.M.C., Ranga Reddy District, Registration District: Ranga Reddy (East), Sub-District: Vanasthalipuram. Hereafter, this property will be referred to as the

SUIT SCHEDULE PROPERTY.
BOUNDARIES OF THE PLOT
NORTH : Plot No.57;, **SOUTH :** Plot No.60;, **EAST :** 30' Wide Road; **WEST :** Plot Nos.106 107.
BOUNDARIES FOR FLAT NO.102 IN FIRST FLOOR
NORTH : Flat No.103; **SOUTH :** Stair-case and Corridor; **EAST :** Corridor; **WEST :** Open to Sky.

The above suit is posted **on 27-6-2024** for your appearance of defendant No.1, If any person interest in respect of the claims made by the plaintiff may appear before the said Hon'ble court **at 10.30 A.M.** by person or through an advocate failing which the matter will be decided on merits.

//By the order of the court//
M/S S.P. LAW COSULTANCY
SRINIVAS PENDOTA &
T. Padmakar
Advocates.
Shop No.31, Rajani Gandha Complex, Kamala Nagar, Gaddi annaram, Chaitanyapuri, Hyd-60., Advocate, Hyderabad.

14
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

బోనాల ఏర్పాట్లపై డీసీపీ సమీక్ష



నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్‌లో ప్రతిష్టాత్మక ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరను పురస్కరించుకొని నార్త్ జోన్ డీసీపీ సాధనరష్మి పెరుమాళ్ శనివారం మహంకాళి దేవాలయం ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో డీసీపీ మాట్లాడుతూ.. జాతర ఏర్పాట్లలో నిర్వహించే బందోబస్తుపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈఓ మనోహర్ రెడ్డి, అడిషనల్ డీసీపీ, జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీఎంహెచ్ఏ వెంకటి, ఏసీపీసుబ్బయ్య మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపాశంకర్ అనేకమంది అధికారులు పాల్గొన్నారు.

డ్రయినేజీని పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ శనివారం స్ట్రీట్ నెంబర్ 01 లో సుప్రభాత్ హోటల్ పక్క వీధిలో కాలనీ యజమానుల ఫిర్యాదు మేరకు డ్రయినేజీ సమస్యలు, శానిటేషన్ , వెటర్నరీ సమస్యలు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సంబంధిత సమస్యలపై అధికారులతో కలిసి డ్రయినేజీని పరిశీలించారు. ఆ తర్వాత ఈ సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ఆసిఫ్ , సానిటేషన్ డీఈ చందన ,ఏఈ సాయికిరణ్ మరియు అధికారులు పాల్గొన్నారు.



నీట్‌ను రద్దు చేయాలని చనగాని దయాకర్ ఆమరణ దీక్ష

- విరమింప చేసిన ఓయు ప్రొఫెసర్లు కాసిం, కొండ నాగేశ్వర్ రావు

నవతెలంగాణ-ఓయూ

నీట్ ఫలితాలు వచ్చి నేటికి 18 రోజులు అవుతున్నా కేంద్ర ప్రభుత్వం లీకేజీకి పాల్పడిన దోషులను శిక్షించడంలో విఫలమైందని, ఎన్టీఏ డైరెక్టర్ ను పూర్తిగా తొలగించాలని, 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్డీ విద్యార్థి చేనాగని దయాకర్ అన్నారు. నీట్ దోషులను శిక్షించాలని శనివారం ఓయూ డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రెరీ ఎదుట దయాకర్ ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి ఎన్టీఏ నీట్ నిర్వహణలో అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవరించిందని, యూజీసీ నెట్ లీకేజీ అయిందని చెప్పగానే రద్దు చేశారు కానీ నీట్‌ను ఎందుకు రద్దు చేయరని ప్రశ్నించారు. నీట్ లీకేజీ లో బీజేపీ ఎంపీ ల హస్తం ఉందని, నీట్ లీకేజీలో అవినీతి తిమింగలాలూ ఉన్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కంటే లీకేజీ పాల్పడిన వారు బీజేపీ కి ముఖ్యమా? అంటూ దయాకర్ ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా ఆయనకు ఓయూ అధ్యాపకులు ప్రో. కాసిం ,ప్రో. కొండ నాగేశ్వరావు లు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. వారు మాట్లాడుతూ నీట్ నిర్వహణలో చాలా లోపాలు కనబడుతున్నాయన్నారు. నీట్ రద్దు తోనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. దీక్షకు ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య సంఘీభావం పలికారు.దీక్షలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మెడ శ్రీనివాస్ , వినయ్, సాయి గౌడ్, సుమన్

డిగ్నిటీ కోసం కాళ్లరిగేలా తిరిగినా....

- 'డబుల్'కు అర్హులే అన్నారు.. ఇప్పటికీ దిక్కులేదు
- ప్రజావాణిలో నాలుగు సార్లు వినతి
- కలెక్టర్‌కు, జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని అధికారులు
- న్యాయం చేయాలని ఇన్‌చార్జి మంత్రి పొన్నంకు వినతి





నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలు గౌరవంగా జీవించేలా డిగ్నిటీ ఇండ్లను రూపొందించామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. పేదల డబుల్ బెడ్ రూం ఇండ్ల కల నెరవేరుస్తామని పెద్దఎత్తున ప్రచారం చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో 24 నియోజకవర్గాల్లో 9 ప్రాంతాల్లో మొత్తం 61,784 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. ఒక్కొక్క నియోజకవర్గంలో 500 మంది చొప్పున ఎంపిక జరిగింది. అవినీతి, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ జరుగుతుందని అప్పటి మంత్రులు, పాలకులు, అధికారులు చెప్పడంతో లబ్దిదారులు ఎంతో సంతోష పడ్డారు. కానీ, చివరకు అవినీతి అక్రమాలు షరా మామూలే అవ్వడంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఆందోళనలూ జరిగాయి. ముఖ్యంగా లబ్దిదారుల ఎంపికలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలనే పాటించలేదు.

పేదలకు ఇండ్లపై అనేక ఆశలు చూపించి, లబ్దిదారులందరికీ ఇండ్లు కట్టించి ఇస్తామని వాగ్దానం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం కొద్ది మందికే ఇండ్లు కేటాయించింది. ఎంపిక చేసిన వారిలోనూ చాలామందికి ఇండ్లు దక్కలేదు. ఇదే క్రమంలో హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గంలో మూడో ఫేజ్‌లో 1472 లబ్దిదారులను ఎంపిక చేశారు. అందులో 146 నుంచి 1472 సీరియల్ నెంబర్ వరకూ కొల్లూర్‌లో అలాట్‌మెంట్ పేపర్స్‌ను అందజేశారు. కానీ 1 నుంచి 145 సీరియల్ నెంబర్ వరకున్న 145 మందిని పక్కన పెట్టేశారు.

145 మందికి ఇప్పటికీ ఇవ్వలే..

నగరంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం మొదటి ఫేజ్‌లో 11,700, రెండో ఫేజ్‌లో 13,200 మందిని, మూడో ఫేజ్‌లో 36,884 మందిని ఎంపిక చేశారు. మొత్తం 61,784 మంది లబ్దిదారుల్లో 61,639 మందికి అలాట్‌మెంట్ పేపర్లను అందజేశారు. అయితే గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 1472 మంది లబ్దిదారుల్లో 145 మందికి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. మూడో ఫేజ్‌లో వారిని ఎంపిక చేసినా ఇండ్ల పేపర్స్ (అలాట్‌మెంట్) ఇవ్వలేదు. దాంతో బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. ధూల్‌పేట్‌లోని గంగాబోలీలో నిర్మించిన ఇండ్లను ఎస్సీ, మైనార్టీ, వికలాంగులకే కేటాయిస్తామని, అందులో 145మందికి కూడా డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పినట్టు బాధితులు తెలిపారు. కానీ అక్కడికి వెళ్తే స్థానిక ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని, వారి అనుచరులకే ఇండ్లు కేటాయిస్తామని, తమను అక్కడికి రావద్దంటూ బెదిరిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రజావాణిలో దరఖాస్తు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని 145 మంది బాధితులు ప్రజావాణిలో నోడల్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. గోషామహల్ ఎమ్మెల్యేకు మూడు సార్లు, కలెక్టర్‌కు మూడు సార్లు, జీహెచ్ఎంసీ, ఎంఆర్వో అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని బాధితులు వాపోయారు.

అద్దె గదుల్లో జీవనం..

తాము అద్దె గదుల్లో జీవిస్తున్నామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు గౌరవంగా జీవించేలా డిగ్నిటీ ఇండ్లను కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో తమ జీవితాలు భాగుపడ్తాయని ఆశపడ్డామన్నారు. 145 మందిలో ఎస్సీ, మైనార్టీ, వికలాం గులమే ఉన్నామని, తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలంటూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన బాధితులు వారి గోడును వెళ్లబోసుకున్నారు. బడుగు, బలహీన వర్గా లకు చెందిన తమకు, రెక్కాడితేగానీ డొక్కాడదని, చిన్నచిన్న గదులకు సైతం అద్దెలు చెల్లించలేక పోతున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

'పది'లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని సెయింట్ జాన్స్ హై స్కూల్ విద్యార్థులు 2023-24 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని స్కూల్ ప్రిన్సిపాల్ కేఆర్.ధరణిరాణి తెలిపారు.

పలువురి స్ఫూర్తితో..

జాతీయతా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి ఎందరో మహానుభావుల పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు బోధిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను బట్టి విద్యా బోధన నిర్వహిస్తూ, నైపుణ్యం గల ఉపాధ్యాయులతో బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల మన్ననతో దినదినాభివృద్ధి చెందుతూ క్రమ శిక్షణ గల నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యా బుద్ధులు నేర్పుతూ వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక సేవలో సంస్కారవంతమైన విద్యను అందిస్తూ భావితరమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

ఉన్నత ప్రమాణాలే పెట్టుబడిగా..

లాభాపేక్ష లేకుండా ఉన్నత ప్రమాణాలే పెట్టుబడిగా నామినల్ ఫీజులతో విద్య బోధన చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణకు నాణ్యమైన చదువులకు మారుపేరు, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రత్యేక అని స్కూల్ ప్రిన్సిపాల్ ధరణిరాణి తెలిపారు. తమ విద్యార్థులు దేశ విదేశాల్లో సాఫ్ట్‌వేర్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లుగా వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటం తమ స్కూల్‌కి ఎంతో గర్వ కారణం అని ధరణిరాణి హర్షం వ్యక్తం చేశారు. నర్సరీ నుంచి టెన్త్ వరకు అడ్మిషన్లు జరుగుతున్నట్టు తెలిపారు.

భవిష్యత్తుకు సోపానం
కృష్ణవేణి టాలెంట్ స్కూల్



నవతెలంగాణ-కంటోన్మెంట్

విద్యార్థుల భవిష్యత్తుకు మంచి సోపానం అని కష్ణవేణి టాలెంట్ స్కూల్ కార్ఖానా బ్రాంచ్ చూపిస్తోంది. పాఠశాల ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే ఫలితాల్లో విద్యార్థులు వారి ప్రభంజనం చూపిస్తున్నారు. ఇందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడం.. ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు బోధనలు చేయడమే కారణమని పాఠశాల ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్ ఎస్ చెప్పారు. ఐదో తరగతి నుంచి సీబీఎస్ఈ, ఐఐటి ఒలంపి యాడ్ బోధిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు కేవలం చదువే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడల పట్ల తర్ఫీదు ఇస్తున్నట్టు, అలాగే విహారయాత్రలకు కూడా విద్యార్థులను తీసుకుపోతుంటామని యాజమాన్యం పేర్కొంది. దానివల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెరుగుతుందని అన్నారు.

శ్రీసాయి విద్యార్థి స్కూల్ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు

- 100 శాతం ఉత్తీర్ణత
- స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కె.ప్రసాద్, అడ్మిన్ సావిత్రి


ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కె.ప్రసాద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

1999లో ప్రారంభించిన సికింద్రాబాద్‌లోని తుకారం గేట్ వద్ద ఉన్న శ్రీ సాయి విద్యార్థి స్కూల్ 25 ఏండ్లుగా ఎందరో విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కె.ప్రసాద్, అడ్మిన్ సావిత్రి తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని హర్షం వ్యక్తం చేశారు. తమ స్కూల్‌లో పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఫీజులు ఉంటాయని తెలిపారు. నవతెలంగాణతో వారి స్కూల్ గురించి పలు విషయాలను పంచుకున్నారు.

స్కూల్ ప్రిన్సిపాల్ దాతృత్వం

ప్రతి ఏడాదీ 100 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు లేని, తండ్రి ఉండి తల్లి లేకపోయిన, ఇద్దరూ ఉండి నిరుపేదలైన విద్యార్థులకు బుక్స్‌తోపాటు మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

విలువలతో కూడిన విద్య

ఎలాంటి లాభాపేక్ష లేకుండా కార్పొరేట్ విద్యకు దీటుగా నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో టాప్ 10 స్కూల్స్‌లో ఒకటిగా తమ స్కూల్ విద్యార్థులు సత్తా చాటిన ట్లు తెలిపారు. ఉన్నత ప్రమాణాలే పెట్టుబడిగా విద్యార్థుల మానసిక పరిస్థితులను బట్టి వారికి విద్యా బోధన అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. స్కూల్ వేళల అనంతరం ఉచిత ట్యూషన్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్వో ఫ్యూరిఫైడ్ వాటర్‌ను అందిస్తామన్నారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక క్రీడలు

నేటి కాలం విద్యార్థుల వింత పోకడలను దృష్టిలో ఉంచుకుని మొబైల్‌కు దూరంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దల పట్ల ఉపాధ్యాయులతో ఎలా మెలగాలో తెలియజేస్తున్నామని తెలిపారు. దేశభక్తి, దైవభక్తి, యోగా, మంచి క్రమశిక్షణ ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సాంస్కృతిక రంగాలతోపాటు క్రీడలు నేర్పుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్నామన్నారు. మానసిక ఉల్లాసం కోసం కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ క్రీడలల్లో తర్ఫీదునిస్తూ గతేడాది కబడ్డీలో స్టేట్ లెవెల్‌లో సెకండ్ బహుమతికి సాధించి స్కూల్ సత్తా చాటారు. తమ విద్యార్థులు ఆయా రంగాల్లో డాక్టర్లు, లాయర్లు, ఏఏఎస్, ఐపీఎస్ గా ఉన్నత శిఖరాలకు ఎదగడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దే బంగారం సేవలు..

- గ్రామీణా ప్రాంతాల్లో మొబైల్ సేవలు
- క్యాప్స్ గోల్డ్ సంస్థ 'వాల్యూ గోల్డ్' స్కీం ప్రారంభం
- మొబైల్ సేవలను ప్రారంభించిన సినీనటి అనసూయా





నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశపు అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ అయిన 'క్యాప్స్ గోల్డ్' మరో అడుగుముందుకేసింది. అస్థిరమైన బంగారం ధరల మధ్య తన కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి 'వాల్యూ గోల్డ్ పాలసీ'ని అందుబాటులోకి తీసుకొచ్చింది. బంగారం వ్యాపారంలో అగ్రామీగా ఉన్న పురాతన బులియన్ వ్యాపారి-1901 నుండి ప్రారంభించబడిన 'క్యాప్స్ గోల్డ్ ఇండియా' సంస్థ తన సేవలను దేశవ్యాప్తంగా విస్తరించింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల కోసం మొట్టమొదటి సారిగా మొబైల్ గోల్డ్ కొనుగోలు సేవలను ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన వాహనాన్ని అమీర్‌పేట్‌లోని సారథీ స్టూడియోలో శనివారం ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ అభిషేక్ చెందాతో కలసి సినీనటి అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ చింతల్‌లో తమ వాల్యూ గోల్డ్ 5వ బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉప్పల్, కూకట్‌పల్లి, బంజారాహిల్స్‌తోపాటు సికింద్రాబాద్‌లో బ్రాంచ్‌లున్నాయని, ప్రజల నుంచి మంచి ఆధరణ లభిస్తుందన్నారు. అన్ని బ్రాంచ్‌ల్లో బంగారం, వెండి నాణేలను రిటైల్‌లో అమ్మడానికి అందుబాటులో ఉంచామన్నారు. గోల్డ్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో ప్రభంజనం సృష్టించామన్నారు. ఇక్కడ సాటిలేని రాబడి, మెరుగైన బంగారు మూల్యాంక నంతోపాటు తక్షణ నగదుతో సాఫీ ప్రక్రియ జరుగుతుందన్నారు. వాల్యూ గోల్డ్ వద్ద బంగారు మార్పిడి ప్రక్రియ అనేది ఒక శతాబ్దానికి పైగా దాని వారసత్వంగా నడుస్తోందని తెలిపారు. కస్టమర్లు తమ బంగారాన్ని తీసుకొచ్చి స్వచ్ఛత కోసం పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. కుదవ పెట్టిన బంగారానికి విలువైన నగదును పొందవచ్చన్నారు. లేదా ఇతర సంస్థలో కుదవపెట్టిన బంగారాన్ని మార్కెట్ విలుక కట్టి విడుదల చేస్తామని తెలిపారు.

గ్రామీణా ప్రాంతాల్లో మొబైల్ సేవలు

'వాల్యూ గోల్డ్ పాలసీ' సేవలను తమ కస్టమర్ల కోసం మొదటి సారీగా గ్రామీణా ప్రాంతాలల్లో విస్తరిస్తున్నామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా తమ బ్రాంచ్‌ను కరీంనగర్ జిల్లాలో సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కరీంనగర్ పట్టణంలో జూన్ 24 నుంచి 27వ తేదీ వరకు రెవెన్యూగార్డెన్‌లో ప్రారంభిస్తామన్నారు. అంతేకాకుండా 28 నుంచి 29 వరకు పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వం బాలుర జూనియర్ కాలేజీలో, జూలై 1 నుంచి 3 వరకు హుజూరాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 4 నుంచి 5 వరకు సిరిసిల్లా పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో, 6 నుంచి 8 వరకు సిద్ధపేట పట్టణంలోని మున్నూర్‌కాపు సంక్షేమ సంఘంలో మొబైల్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

శ్రీసాయి విద్యాలయ విద్యార్థుల జయకేతనం



With Best Compliments from : TRSMA - MSRD.



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని శ్రీసాయి విద్యాలయ విద్యార్థులు వరుస విజయాలతో విజయకేతనం ఎగరేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ముషీరాబాద్ మండలంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్ తెలిపారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పదో తరగతిలో మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులకు విద్యాశాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులను ప్రతి ఏడాదీ అందజేస్తున్నారు. స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో ఎంతో గర్వకారణంగా ఉందని స్కూల్ వ్యవస్థాపకులు వెంకటేశ్ తెలిపారు. 37 ఏండ్లుగా విద్యా రంగంలో ఉంటూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత శ్రీసాయి విద్యా సంస్థలకు దక్కుతుందన్నారు.

సామాజిక సేవలో..

ఎంతో మంది విద్యార్థులకు విద్యాదానం చేస్తూ, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా చదువుతోపాటు బుక్స్ అందిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకటేశ్ తెలిపారు. సాధారణ విద్యార్థుల్లో అసాధారణ ఫలితాలు సాధిస్తూ, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నామినల్ ఫీజులు తీసుకుంటున్నామని తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు

క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహ దారుఢ్యానికి ఉపయోపడుతూ, వారిలో ఉన్న మేధా శక్తిని పెంచే విధంగా దోహదపడుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. వీక్లీ ఆఫ్ డే క్రీడలను ప్రోత్సహిస్తున్నామని, హాకీ, కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌తోపాటు సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న కళానైపుణ్యాన్ని వెలికి తీస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

అత్యుత్తమ హెూదాలో విద్యార్థులు

సువిశాలమైన భవనాల్లో క్లాస్ రూంలు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల మానసికి పరిస్థితిని బట్టి వెనుకబడిన విద్యార్థులకు అదనంగా క్లాసులు బోధిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. మెరిట్ విద్యార్థులకు దీటుగా వారిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తమ స్కూల్‌లో చదివిన ఎందరో విద్యార్థులు దేశ, విదేశాల్లో, వివిధ రంగాల్లో అత్యుత్తమ హెూదాల్లో ఉండటం చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కట్టమైసమ్మ బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ నియోజకవర్గం బస్తీ పర్యటనలో భాగంగా శనివారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ కట్ట మైసమ్మ కృష్ణ నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ కట్టడాలను అధికారులతో కలిసి పరిశీలిం చారు. అదేవిధంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ పనులును కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అర్హులైన వారికి కొత్త పెన్షన్‌లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అమలు సమస్యపై సికింద్రాబాద్ తాసిల్దార్ పందు నాయక్‌తో మాట్లాడారు. ఈ విషయంపై చర్చించారు. అదేవిధంగా మురుగు నీరు, తాగునీరు వేరు చేసే ప్రక్రియ, డ్రయినేజీ పొర్లి పొంగడం సమస్యపై శానిటైజేషన్ సానిటరీ సూపరింటెండెంట్ మహేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. విద్యుత్ విభాగం ఏఈ అర్పితా రెడ్డితో మాట్లాడి అర్హులైన వారికి 200 ఉచిత విద్యుత్ యూనిట్లు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు,శ్రీనివాసు ముప్పిడి గోపాల్, సాంసంగ్ రాజ్,బాలరాజ్,మల్లేష్ యాదగిరి,నాగేష్,కరీం,యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ హైదర్ తదితరులు పాల్గొన్నారు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి నగరానికి వచ్చిన సందర్భంగా వారిని జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులు బడుగు సతీష్, బి జ్ఞానేశ్వర్, అనంతలక్ష్మి,.షర్మిల జాదవ్ ,తదితరులు ఉన్నారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రోజుకు రెండు....



మన వంటింట్లో ఎప్పుడూ అందుబాట్లో ఉండే లవంగాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. రోజుకి రెండు లవంగాలను తీసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి.

లవంగాలలో విటమిన్ బి1, విటమిన్ సి, బీటా కెరోటిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ కె, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు కూడా సమృద్ధిగా ఉన్నాయి. అలాగే సోడియం, జింక్, మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి.

జలుబు, దగ్గు, ముక్కు కారటం వంటి సీజనల్ సమస్యలతో బాధపడుతున్న వారు లవంగాలు తీసుకోవడం వలన ఉపశమనం కలుగుతుంది. ఎందుకంటే దీనిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. లవంగాలను రోజూ తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలనూ దూరం చేసుకోవచ్చు.

ఒలింపిక్స్‌లో మెరిసిన తొలి మహిళ



అది 2000, సెప్టెంబర్ 19... ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం... ఒలింపిక్స్ బహుమతి ప్రధానోత్సవ వేదికపై పాతికేండ్ల అచ్చ తెలుగు అమ్మాయి సగర్వంగా నిలబడింది. భారతదేశం మొత్తం ఆమె గురించే చర్చించుకుంటోంది. దానికి కారణం ఒలిపింక్స్‌లో దేశానికి పతకం తెచ్చిపెట్టిన మొదటి భారతీయ మహిళ ఆమే కావడం. అలా ప్రపంచ చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో భారత అభిమానుల అంచనాల భారాన్ని మోస్తూ బరిలోకి దిగి ఆ వేదికపై కాంస్యం అందుకుంది. ఆమే ప్రముఖ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి. ఈ రోజు ఒలింపిక్స్ డే సందర్భంగా ఆమె స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...



మల్లీశ్వరి 1975లో శ్రీకాకుళం జిల్లాలోని వూసవానిపేటలో జన్మించారు. తల్లి శ్యామల, తండ్రి మనోహర్. తండ్రి వ్యాపారరీత్యా వీరు ఆముదాలవలసలో స్థిరపడ్డారు. వీరి కుటుంబానికి క్రీడలంటే ఎంతో అభిమానం. ఈమెకు నలుగురు అక్కలు. వీరంతా వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. తల్లి శ్యామల క్రీడల్లో తన బిడ్డలను ఎంతో ప్రోత్సహించేవారు. తండ్రి ఫుట్‌బాల్ ప్లేయర్. అటువంటి కుటుంబంలో పుట్టిన మల్లీశ్వరి 12 ఏండ్ల వయసులో వెయిట్ లిఫ్టింగ్‌ను ప్రారంభించారు.

కోచ్ తిరస్కరించారు

ఆట మొదలుపెట్టిన కొత్తలో పరిస్థితులు చాలా భిన్నంగా ఉండేవి. అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే పాతకాలపు పరికరాలతోనే వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన మొదలుపెట్టారు. ఈ క్రీడలో భవిష్యత్తు ఎలా ఉంటుందో ఎవరికీ నమ్మకం లేని సమయంలో తన అక్కను చూసి మల్లీశ్వరి ఆకర్షితురాలయ్యారు. ఆరంభంలో బలహీనంగా ఉందంటూ కోచ్ నీలంశెట్టి అప్పన్న ఆమెను తిరస్కరించారు. ఆమెలోని పట్టుదల చూసిన తర్వాత అవకాశం కల్పించారు. తల్లి శ్యామల మల్లీశ్వరికీ ఎంతో అండగా నిలబడ్డారు.

అంచనాలు లేవు

సిడ్నీ ఒలింపిక్స్‌లోనే మహిళల వెయిట్ లిఫ్టింగ్‌ను తొలిసారి ప్రవేశపెట్టారు. మల్లీశ్వరి అప్పటికే అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి తానేంటో రుజువు చేసుకున్నారు. అయినా సరే ఒలింపిక్స్ పతకంపై ఆమెకు అంచనాలు లేవు. ఇతర ఈవెంట్లలో ఎన్ని ఘనతలు సాధించినా ఒలింపిక్స్‌లో మన ప్లేయర్లు తడబటం అప్పటికే ఎన్నో సార్లు కనిపించింది. అయితే మల్లీశ్వరి వెయిట్ కేటగిరికి ఇది పూర్తిగా భిన్నం కావడంతో ఎలాంటి ఆశా లేకుండాపోయింది. 1993, 94, 95, 96లలో వరుసగా నాలుగేండ్ల పాటు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మల్లీశ్వరి పతకాలు గెలుచుకున్నారు. ఇందులో రెండు స్వర్ణాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. దీంతో పాటు 1994 హిరోషిమా ఆసియా క్రీడల్లో కూడా రజతం సాధించారు. అయితే ఇవన్నీ 54 కేజీల విభాగంలో వచ్చాయి. ఆ తర్వాత కొంత బరువు పెరిగిన ఆమె 63 కేజీల కేటగిరికి మారి 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లోనూ కాంస్యం సాధించారు. అయితే ఒలింపిక్స్‌కు వచ్చే సరికి 69 కేజీల కేటగిరిలో పోటీ పడాల్సి వచ్చింది. అప్పటి వరకు ఆమె ఆ విభాగంలో ఎలాంటి అంతర్జాతీయ ఈవెంట్‌లో పాల్గొనకపోగా, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించి కూడా నాలుగేండ్లు అవుతుంది. దాంతో మల్లీశ్వరి గెలుపుపై సందేహాలే నెలకొన్నాయి. ఈ అంచనాలన్నింటినీ తారుమారు చేస్తూ ఒలింపిక్స్‌లో కాంస్యాన్ని అందుకుని భారతీయ తొలి మహిళగా చరిత్ర సృష్టించారు.

అసలైన మార్పు

80ల్లో మన దేశ క్రీడాకారిణులు మంచి ఫలితాలు సాధించడం మొదలుపెట్టారు. ఉష, షైనీ విల్సన్, కుంజరాణిలాంటి ప్లేయర్లు పెద్ద వేదికలపై రాణించారు. అయితే మల్లీశ్వరి విజయంతోనే అసలైన మార్పు వచ్చింది. 2000 తర్వాతే మహిళలకు అన్ని క్రీడల్లో ప్రాతినిధ్యం పెరుగుతూ వచ్చింది. 'ఒలింపిక్స్‌లో సైనా, సింధు, మెరీకోమ్ వంటి విజేతలు వచ్చేందుకు మల్లీశ్వరి విజయమే కారణం' అని అథ్లెట్ దిగ్గజం అంజూ జార్జ్ చెప్పడం ఆ పతకం విలువను చెప్పింది. సిడ్నీలో భారత్ సాధించిన ఏకైక పతకం కూడా అదే. రెజ్లింగ్‌లో స్టార్లను అందించిన మహావీర్ ఫొగాట్‌కు తన కూతుళ్లు ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని మల్లీశ్వరి విజయం అందించిందట. ఈ విషయాన్ని స్వయంగా రెజ్లర్ గీతా ఫొగాట్ ప్రకటించడం విశేషం. 'మల్లీశ్వరి గెలిచినపుడు విజయం స్థాయి ఏంటో మాకు అర్థం కాలేదు కానీ నాన్న మాత్రం అదే మేలిమలుపుగా చెప్పుకునేవారు. ఆమె గురించి ట్రెనింగ్‌లో మాకు మళ్లీ మళ్లీ చెప్పేవారు. నాన్నకు సంబంధించి మల్లీశ్వరి సాధించిన విజయం చాలా గొప్పది. ఆమె సాధించిన ఘనత ఒక తరంలో పెద్ద సంఖ్యలో ఆడపిల్లలను ఆటల వైపు మళ్లించిందనడంలో సందేహం లేదు' అంటూ కొనియాడారు.

మొదటి వైస్ చాన్స్‌లర్‌గా...

తోటి వెయిట్‌లిఫ్టర్ రాజేశ్‌త్యాగిని వివాహం చేసుకున్న తర్వాత ఆమె హరియాణా లోని యమునా నగర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓ కొడుకు ఉన్నాడు. అక్కడే ఓ అకాడమీని నిర్వహిస్తోన్న ఆమె ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఉద్యోగిగా కొంత కాలం పని చేశారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఈమె ప్రదర్శనకు అర్జున, ఖేల్‌రత్న, పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో ప్రారంభిం చిన స్పోర్ట్స్ యూనివర్సిటీకి మొదటి వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విజయ ప్రస్థానం

1990 ఆసియా క్రీడలకు ముందు జాతీయ క్యాంప్‌లో అక్కను కలిసేందుకు వెళ్లిన మల్లీశ్వరిలో ప్రతిభను కోచ్ లిచెనిడ్ తారానెంకో గుర్తించి సరైన సూచన చేశారు. దాంతో బెంగళూరులోని సాయ్ కేంద్రంలో ఆమెకు అవకాశం దక్కింది. అక్కడ చేరిన తర్వాత జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రికార్డులు నెలకొల్పి సీనియర్ నేషనల్స్‌లో రజతం సాధించడంతో మల్లీశ్వరి విజయ ప్రస్థానం మొదలయింది. అప్పటి నుండి వరుస అవకాశాలు అందిపుచ్చుకొని వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో సంచలన ప్రదర్శనలతో పలు ఘనతలు తన పేరిట లిఖించుకున్నారు. 12 ఏండ్ల వయసులో తొలి వరల్డ్ చాంపియన్‌షిప్ పతకంతో మొదలు పెట్టి ఈ ప్రయాణం చివరకు ఒలింపిక్స్ మెడల్ వరకు సాగింది.



- సలీమ

జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ !

(మొదటిపేజి తరువాయి)

ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆర్థిక మంత్రులు పయ్యావుల కేశవ్, భట్టి విక్రమార్క, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక కార్యదర్శులు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. జీఎస్టీ కిందికి ఇంధన వనరులను తీసుకొస్తే తాము మరింతగా నష్టపోతామని, చీటికి మాటికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుందనేది రాష్ట్రాల వాదన. ఈ విషయంలో జీఎస్టీ చట్టానికి సవరణ అవసరం లేదని సీతారామన్ అన్నారు. రేట్ల హేతుబద్ధీకరణపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఒఎం) ఆగస్టులో నిర్వహించే జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వనుందని అన్నారు. వడ్డీ లేని కాపెక్స్ రుణాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలు కోరాయని, మధ్యంతర బడ్జెట్‌లో దీనిని రూ.1.30 లక్షల కోట్లకు పెంచినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

కొన్నింటిపై పన్ను రేట్లు స్వల్పంగా తగ్గించారు. మరికొన్నింటికి మినహాయింపు ఇచ్చారు. జీఎస్టీ కౌన్సిల్‌లో ఎజెండాలో చాలా అంశాలు ఉన్నాయని, సమయాభావం కారణంగా కొన్నింటిని చర్చించలేకపోయామని ఆర్థిక మంత్రి చెప్పారు. వచ్చే 54వ జీఎస్టీ సమావేశం ఆగష్టులో జరగనుందని తెలిపారు. అప్పుడు మిగిలిన ఎజెండాపై చర్చిస్తామని అన్నారు. సెక్షన్ 73 కింద కేసులకు వడ్డీ, పెనాల్టీని మాఫీ చేయాలని కౌన్సిల్ సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. 2017-18, 2018-19, 2019-20కి సంబంధించి డిమాండ్ నోటీసుల కోసం 2025 మార్చి 31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ, జరిమానా మినహాయించబడుతుందని తెలిపారు.

జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అప్పీలు దాఖలు చేసేందుకు హైకోర్టుకు రూ. 1 కోటి, సుప్రీంకోర్టుకు రూ. 2 కోట్ల పరిమితిని కౌన్సిల్ సిఫారసు చేసిందని అన్నారు. సిజిఎస్టి ప్రీ-డిపాజిట్‌కు అప్పీలేట్ అథారిటీ ముందు అప్పీల్‌ను దాఖలు చేయడానికి గరిష్ట మొత్తం రూ. 25 కోట్ల నుండి రూ. 20 కోట్లకు తగ్గించునట్లు తెలిపారు. తక్కువ పన్ను చెల్లింపుదారులకు సహాయం చేయడానికి, కౌన్సిల్ 2024-25 కోసం రిటర్న్‌లను దాఖలు చేయడానికి జిఎస్టిఆర్4 కోసం జూన్ 30న సిఫారసు చేసిందని అన్నారు. ఫేక్ ఇన్‌వాయిస్‌లను దశల వారీగా తనిఖీ చేయడానికి బయోమెట్రిక్ ప్రామాణీకరణ పాన్-ఇండియా అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపు

"ఉక్కు, ఇనుము, అల్యూమినియం వంటి అన్ని మిల్క్ క్యాన్‌లపై జీఎస్టి 18 నుండి 12 శాతానికి తగ్గిస్తూ మండలి సిఫార్సు చేసింది. అయితే వాటిని ఎక్కడ వాడినా ఆ రేటు వర్తిస్తుంది. ఎటువంటి వివాదాలు తలెత్తవు. అన్ని అట్టపెట్టెలు (కార్టన్ బాక్సులు), ముడతలు లేని కాగితం లేదా పేపర్ బోర్డు రెండింటిపై ఏకరీతి జీఎస్టి రేటును 18 నుంచి 12 శాతం తగ్గించినట్లు కౌన్సిల్ సిఫార్సు చేసింది. ఇది ప్రత్యేకంగా హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లో యాపిల్ పెంపకందారులకు సహాయం చేస్తుందని కౌన్సిల్ కూడా స్పష్టం చేసింది. ఫైర్ వాటర్ స్ప్రింక్లర్‌లతో సహా అన్ని రకాల స్ప్రింక్లర్‌లపై జీఎస్టీని 18 నుండి 12 శాతానికి తగ్గిస్తూ సిఫారసు చేసింది" అని పేర్కొన్నారు. అన్ని సోలార్ కుక్కర్లపై 12 శాతం నిర్ణయించినట్లు తెలిపారు. భారతీయ రైల్వే సామాన్యులకు అందించే సేవలు, ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల విక్రయం, రిటైరింగ్ రూమ్‌లు, వెయిటింగ్ రూమ్‌ల సౌకర్యం, బ్యాటరీతో నడిచే కార్ల సేవలను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు పేర్కొన్నారు. ఇంట్రా-రైల్వే సరఫరాలకు కూడా మినహాయింపు ఇవ్వబడుతుందని అన్నారు. విద్యా సంస్థల పరిధిలో ఉన్న విద్యార్థుల కోసం హాస్టళ్లకు ఇప్పటికే మినహాయింపు ఉంది. ఇప్పుడు విద్యాసంస్థల్లో లేని విద్యార్థుల కోసం ఉన్న హాస్టళ్లకు కూడా జీఎస్టీ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

ఎరువులపై జీఎస్టీ తగ్గించాలనే అభ్యర్థన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఒఎం) పంపారు. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ ఉంది. దీనినిజీరో జీఎస్టీ స్థాయికి తీసుకురావాలని ఎరువుల పరిశ్రమ డిమాండ్ చేస్తోంది.

గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తర్వాత జరగాల్సిన కౌన్సిల్ భేటీని, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో కౌన్సిల్ మీటింగ్‌ను నిర్వహించారు.

పేపర్ లీక్‌కు పాల్పడితే..

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నీట్, నెట్ సహా పలు పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకేజీలు వ్యవహారంలో కేంద్రంలోని మోడీ సర్కారుకు విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ఈ నేపథ్యంలో పేపర్ లీక్‌కు పాల్పడినవారిపై చట్టపరంగా కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024'ను తీసుకొచ్చింది. ఈ చట్టం జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్టు శుక్రవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాస్తవానికి ఈ చట్టాన్ని లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలోనే చేశారు. కానీ, సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ మొదలవటంతో అమలు తేదీని ప్రకటించలేదు. నీట్, నెట్ వివాదంపై గురువారం జరిగిన మీడియా సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీనిపై మాట్లాడారు. చట్టం గురించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తున్నదనీ, త్వరలో నోటిఫై చేస్తామని మీడియా ప్రతినిధులకు బదులిచ్చారు. ఆయన ప్రకటన చేసిన 24 గంటల్లోనే ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీచేయటం గమనార్హం.గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. చట్టవిరుద్ధంగా పరీక్ష పత్రాలను అందుకున్నా, ప్రశ్నలు, సమాధాలు లీక్ చేసినా, పరీక్షకు హాజరయ్యేవారికి అనుచిత సాయం చేసినా, సాంకేతికత సాయంతో కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహణ, నకిలీ హాల్‌టిక్కెట్లు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. అందుకు బాధ్యులైవారికి కనీసం మూడేండ్ల, గరిష్ఠంగా 10 ఏండ్ల వరకు జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశమున్నది. ఇందులో భాగస్వాములైనవారు వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్టు రుజువైతే ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు. అంతేకాదు, పరీక్ష నిర్వహణకు అయిన మొత్తాన్ని వారి నుంచి వసూలు చేస్తారు. ఇకపై పేపర్ లీకేజీలపై కొత్త చట్టం కింద నాన్-బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయనున్నారు. అధికారుల పాత్ర ఉంటే వారికి మూడేండ్ల జైలు.. రూ.కోటి జరిమానా విధించే అవకాశం ఉంటుంది.వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీ 2024 విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మే 5న నీట్ నిర్వహించిన ఎన్టీఏ.. ఫలితాలను షెడ్యూల్ కంటే 15 రోజుల ముందే ప్రకటించింది. అంతేకాదు, 1,500 మందికిపైగా గ్రేస్ మార్కులు ఇవ్వడం, 67 మంది మంది మొదటి ర్యాంకు రావడం పేపర్ లీక్ అయినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై సుప్రీంకోర్టులో పలువురు విద్యార్థులు కేసులు వేసి... పరీక్షను రద్దుచేయాలని కోరారు. అటు, యూజీసీ నెట్ ప్రశ్నాపత్రం కూడా పరీక్షకు రెండు రోజుల ముందే లీక్ కావడం గమనార్హం.

రాష్ట్రానికి నిధులివ్వండి

(మొదటిపేజి తరువాయి)

ప్రస్తావించారు."రాష్ట్రాల మూలధన వ్యయానికి ప్రత్యేక ఆర్థిక సహాయం పథకాన్ని ఏడాదికి రూ. 2.5 లక్షల కోట్లకు పెంచి కొనసాగించాలి. ఈ పథకంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు బ్రాండింగ్ వంటి షరతులు, ఇతర

పరిమితులు లేకుండా నిధులను విడుదల చేయాలి. వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలను పున: సమీక్షించి, అనవసరమైన పథకాలను తొలగించి, ఆప్షనల్‌గా కొత్త పథకాలను ప్రవేశపెట్టాలి. దేశం ఎదుర్కొంటున్న అత్యవసర సవాళ్లలో పెరుగుతున్న నిరుద్యోగం, ఆదాయ పంపిణీలో అసమానతలు ప్రధానమైనవి. ఈ బడ్జెట్‌లో ఈ రెండు సమస్యలపై కొత్త పథకాలను ప్రవేశపెట్టి వాటికి ఎక్కువ నిధులను కేటాయించాలి" అని కోరారు. "దేశ యువత నైపుణ్య స్థాయి నిరుద్యోగంతో సంబంధం ఉన్న ప్రధాన సమస్య. వారికి ఉద్యోగ అవకాశాలు అందించడానికి నూతన నైపుణ్యాలలో శిక్షణ మెరుగుపరచడం అవసరం. రాష్ట్రాలలో ఉన్న పారిశ్రామిక శిక్షణ సంస్థలను ప్రత్యేక ఆర్థిక సహాయంతో ఆధునీకరించాలి. రాష్ట్రాలకు ఆర్థిక సంఘాల సిఫార్సుల ప్రకారం పన్ను విభజనలో వారి వాటా తగ్గింది. సెస్‌లు, సర్ చార్జీలతో సేకరించిన మొత్తం పెరగడం వల్ల రాజ్యాంగ సంస్థల సిఫార్సులు మాత్రమే కాకుండా రాష్ట్రాల ప్రయోజనాలను కూడా ప్రభావితం చేసింది. అందుకని, మొత్తం పన్ను ఆదాయానికి శాతంగా సెస్‌లు, సర్ చార్జీల వాటా 10 శాతం మించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. "బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలోనే రాష్ట్రాలకు నికర రుణ పరిమితిని సీలింగ్ ని తెలియజేయాలి. ఫలితంగా రాష్ట్రాలు అభివృద్ధి కార్యక్రమాలపై తమ వనరులను సమర్థవంతంగా ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోగలుగుతాయి" అని అన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలు

"తెలంగాణ అనేక రంగాలలో గొప్ప పురోగతిని సాధించడంతో పాటు, జాతీయ ఆర్థిక వ్యవస్థకు విలువైన భాగస్వామిగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే పరిష్కారం అవసరమైన సమస్యలను ఎదుర్కొంటోంది. ఇతర రాష్ట్రాల మాదిరిగా, మా రాష్ట్రం రెండు ప్రధాన సమస్యలను ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద విడుదలయ్యే నిధుల తగ్గింపు. కేంద్ర పన్నుల వాటాను పంచుకునే ఆర్థిక సంఘం సూత్రం" అని అన్నారు. "కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను అన్ని రాష్ట్రాలకు జనాభా నిష్పత్తి ప్రకారం విడుదల చేయాలి. ఏకపక్షంగా లేదా కొన్ని రాష్ట్రాలపట్ల ఎటువంటి పక్షపాతం లేకుండా చూడాలి. మా తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకుంటే, 2023-24లో కేంద్ర ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసిన మొత్తం రూ.4,60,000 కోట్లలో తెలంగాణ రాష్ట్రానికి కేవలం రూ.6,577 కోట్లు మాత్రమే వచ్చాయి. అంటే 1.4 శాతం మాత్రమే. ఇది జనాభా నిష్పత్తి ప్రకారం చాలా తక్కువగా ఉంది. అందువల్ల, సీఎస్ఎస్ కేటాయింపులు జనాభా నిష్పత్తి ప్రకారం, నిర్ణీత సమయంలో చేయాలి" అని కోరారు.

"ఏపీ పునర్విభజన చట్టం- 2014 ప్రకారం సెక్షన్ 94(2) కింద, రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.450 కోట్లను ఇవ్వాల్సి ఉంది. అయితే రూ.2,250 కోట్లు ఇంకా విడుదల కాలేదు. అందువల్ల, రూ.2,250 కోట్లు విడుదల చేయాలి. హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించిన నేపథ్యంలో ఈ గ్రాంటును వచ్చే ఐదేండ్ల పాటు పొడిగించాలి" అని కోరారు.

"రాష్ట్రం ఏర్పాటైన మొదటి ఏడాదిలో, తెలంగాణ కోసం మంజూరైన రూ.495.21 కోట్ల సిఎస్ఎస్ గ్రాంట్లు పొరపాటుగా ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేశారు. ఈ మొత్తం కేంద్రం ద్వారా తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం. ఉపాధి హామీ కింద నిధుల వినియోగంపై రాష్ట్రాలపై విధించిన పరిమితులను తొలగించాలి" అని కోరారు.

"పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం మూసి రివర్ డెవలప్మెంట్ కోసం అధిక నిధులు కేటాయించాలి. ఏజెన్సీల నుండి నిధుల సేకరించడానికి పిపిఆర్ లు సమర్పించాం. రీజనల్ రింగ్ రోడ్ పూర్తి చేసేందుకు నిధులు కేటాయించి సహకరించాలి. తెలంగాణకు మరిన్ని నవోదయ పాఠశాలలను కేటాయించాలి. ప్రధాని సూర్యఘర్‌లో విద్యుత్ సబ్సిడీ - ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద సబ్సిడీ నిధులను రూటింగ్ చేయడానికి కేంద్రం సహకరించాలి" అని అన్నారు.

"ప్రభుత్వ పాఠశాలల నిర్మాణంపై జీఎస్టి మినహాయించాలని కోరారు. అదనపు న్యూట్రల్ ఆల్కహాల్ ని జీఎస్టీ పరిధి నుంచి మినహాయించాలి. పన్ను, జరిమానా వడ్డీ మినహాయించాలి. రేట్ రేషనలైజేషన్ కమిటీ నివేదిక సమర్పించాలి" అని కోరారు.

ఏపీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

(మొదటిపేజి తరువాయి)

ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఒకే నామినేషన్ దాఖలైనందున అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవమైంది.

అనుభవానికి ప్రత్యేక గౌరవం

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న అయ్యన్నపాత్రుడుకి నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉంది. 1983లో తెదేపా ఆవిర్భావంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన ఒకసారి ఎంపీగా పనిచేశారు. పదిసార్లు నర్సీపట్నం నుంచి పోటీచేసి ఏడుసార్లు గెలిచారు. ఇప్పటివరకూ ఐదు ప్రభుత్వాల్లో సాంకేతిక విద్య-క్రీడలు, రహదారులు-భవనాలు (రెండు సార్లు), అటవీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవమూ ఆయనకు ఉంది.

లీకుల వేళ నిపుణుల కమిటీ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ రచ్చగా మారిన నేపథ్యంలో.. సరిగ్గా పార్లమెంట్ సమావేశాలకు ముందు కేంద్రం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. పరీక్షల సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇస్రో మాజీ చైర్మెన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కమిటీని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నియమించి శనివారం ప్రకటించింది. ఈ కమిటీ రెండు నెలల్లో దర్యాప్తు నివేదికను అందజేస్తుందని తెలిపింది. నీట్, నెట్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీలపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పరీక్షలను సజావుగా, న్యాయబద్ధంగా నిర్వహించడం, యంత్రాంగాన్ని మెరుగుపరచడం, డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను మెరుగుపరచడం, ఎన్టీఏ పనితీరుపై ఈ కమిటీ సిఫారసులు చేయనుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ బిజె రావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కె.రామమూర్తి, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా, ఐఐటీ ఢిల్లీ డీన్ ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్, కేంద్ర విద్యా శాఖ జాయింట్ సెక్రెటరీ గోవింద్ జైశ్వాల్, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదికను విద్యా మంత్రిత్వ శాఖకు సమర్పించనుంది.

చంద్రబాబుతో పోటీపడతా

(మొదటిపేజి తరువాయి)

ఒప్పించి, మెప్పించి ఆస్పత్రికి అంకురార్పణ చేశారని గుర్తు చేశారు. బసవతారకం ఆస్పత్రి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఎన్టీఆర్ కుటుంబంలో క్యాన్సర్ కారణంగా విషాదం అలుముకుందని, అలాంటి పరిస్థితి మరో కుటుంబంలో కలుగకూడదని ఆలోచించారని తెలిపారు. నిస్వార్థంగా, లాభాపేక్ష లేకుండా తలపెట్టిన పని తెలుగు ప్రజలతో పాటు దేశంలోని ఎందరో నిరుపేదలకు సేవలందిస్తోందని ప్రశంసించారు. ఆస్పత్రి లీజ్‌తో పాటు ఇతర సమస్యలు తన దృష్టికి తీసుకురాగానే పరిష్కరించినట్టు సీఎం గుర్తుచేసుకున్నారు.

ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ పేదలకు సేవ చేయాలనే స్ఫూర్తిని తనతో పాటు అనేక మందిలో నింపిందని రేవంత్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని ఆరోగ్యరంగంలో ప్రత్యేకంగా నిలబెట్టాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచంలోని ఎలాంటి రోగానికైనా చికిత్స అందించేలా హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఇందుకు శంషాబాద్ చుట్టూ 500 నుంచి వెయ్యి ఎకరాల స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆరోగ్య సంస్థలను ఈ హబ్‌కు ఆహ్వానించనున్నట్టు చెప్పారు. ఆ హబ్‌లో బసవతారకం ఆస్పత్రికి కూడా స్థలం కేటాయిస్తామని హామీనిచ్చారు. ఎన్టీఆర్ ఆలోచనలను చంద్రబాబు, బాలకృష్ణ కొనసాగించారనీ, ఇప్పుడు మూడో తరం లోకేష్, భరత్ ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రి సేవలను మరింత ఎక్కువ మందికి అందించేందుకు విస్తరించనున్నట్టు తెలిపారు. తమపై నమ్మకంతో ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయనీ, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు చైర్మెన్ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు మరిన్ని సేవలందించేందుకు ఆస్పత్రికి 10 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు నోరి దత్తాత్రేయుడు, ఎం.భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌పై వేటు

న్యూఢిల్లీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్ (డీజీ) సుబోధ్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ ప్రదీప్ సింగ్ ఖరోలా ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తారు. ప్రదీప్ సింగ్ ఖరోలా కర్నాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్‌గా ఉన్నారు. ఇటీవల ఎన్టీఏ పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ వైఫల్యాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక చర్య తీసుకుంది.

ఆగని నరమేధం

ఇజ్రాయిల్ దాడుల్లో 42మంది పాలస్తీనియన్లు మృతి



- షాటి శరణార్థ శిబిరంపై దాడిలో 24మంది
- తుఫా ప్రాంతంపై దాడిలో 18మంది
- పౌర లక్ష్యాలపై దాడుల పట్ల హమాస్ ఆందోళన

గాజా : గాజాలో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల్లో 42మంది పాలస్తీనియన్లు మరణించారు. షాటి శరణార్థ శిబిరంలోని ఏడు నివాసాలపై జరిగిన దాడిలో 24మంది చనిపోగా, తుఫా ప్రాంతంలో జరిగిన దాడిలో 18మంది మరణించారని గాజా మీడియా కార్యాలయం ప్రకటించింది. ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన,గాయపడిన వారిని చేరుకోవడం కూడా చాలా కష్టంగా మారిందని గాజా పౌర రక్షణ దళాల ప్రతినిధి వ్యాఖ్యానించారు. జరుగుతున్న విధ్వంసం స్థాయితో పోల్చుకుంటే తమ పౌర రక్షణ సామర్థ్యం చాలా పరిమితంగా వుందని ఆయన పేర్కొన్నారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం శిధిలాల కింద సహాయక బృందాలు ఇంకా గాలిస్తున్నాయని చెప్పారు. ఎంతమంది శిధిలాల కింద పడి వున్నారో కూడా తెలియదన్నారు.

ఈ దాడితో మొత్తం ఆ నివాస ప్రాంగణమంతా దుమ్ము ధూళితో నిండి శిధిలాల కుప్పగా మారింది. వాటిని చూస్తేనే దాడి తీవ్రత అర్ధమవుతోంది. ఆ శరణార్థ శిబిరంలోని అనేక నివాస భవనాలను ఇజ్రాయిల్ జెట్‌లు లక్ష్యంగా చేసుకున్నాయి.

ఇలా పౌరులను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకోవడం పట్ల హమాస్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. నిస్సహాయులైన సామాన్యులను ఇలా కిరాతకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, తాజాగా షాటి శరణార్థ శిబిరంపై ఊచకోత మొదలు పెట్టారని విమర్శించింది. ఈ మేరకు హమాస్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇటువంటి దారుణ నేరాలను ఖండిస్తూ అంతర్జాతీయ సమాజం సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని పేర్కొంది. ఇజ్రాయిల్ నేరాలను, ఉల్లంఘనలను, ఆక్రమణలను తక్షణమే ఆపాలని కోరింది. పాలస్తీనియన్లపై అన్ని రకాలుగా ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ ఇందుకు తగ్గ మూల్యాన్ని చెల్లించాలని హమాస్ పేర్కొంది. ఎంత జరిగినా పాలస్తీనియన్ల సంకల్పాన్ని మార్చలేరని స్పష్టం చేసింది.

మరోవైపు పశ్చిమ రఫాలో మరింత లోపలకు ఇజ్రాయిల్ ట్యాంకులు చొచ్చుకుపోతున్నాయి. నగరంపై అటు యుద్ధ విమానాలు ఇటు శతఘ్ని ట్యాంకులు నిరంతరాయంగా దాడులు కొనసాగిస్తునే వున్నాయి. సురక్షిత ప్రాంతంగా ప్రకటించిన అల్‌మవాసిపైన, అల్ అక్సా ఆస్పత్రిపైనా కూడా దాడులు జరుగుతునే వున్నాయని ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై పోయిందని డబ్ల్యుహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు 37,551మంది మరణించగా, 85,911మంది గాయపడ్డారు. వారం రోజుల వ్యవధిలో నలుగురు పిల్లలు పోషకాహార లోపంతో మరణించారని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ తెలిపారు.

సహకారం మరింత బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానంతో సహా పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించు కోవడంపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విదేశీ నేత భారత్‌లో జరిపిన అధికారిక పర్యటన ఇదే. రెండు రోజుల పర్యటన నిమిత్తం హసీనా శుక్రవారం ఢిల్లీ వచ్చారు. గత ఐదేళ్ళ కాలంలో ఇరువురు నేతలు పదిసార్లు సమావేశాలు జరిపారని, వీటివల్ల ద్వైపాక్షిక సంబంధాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. శనివారం ఉదయమే రాజ్‌ఘాట్‌ను సందర్శించిన హసీనా మహాత్మునికి ఘనంగా నివాళి అర్పించారు. చర్చలకు ముందు హసీనాకు రాష్ట్రపతి భవన్ వద్ద సాదర స్వాగతం లభించింది.



వాణిజ్యం, అనుసంధానం, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చేందుకు ఈ చర్చలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

పొరుగుదేశాలకు ప్రాధాన్యతా విధానం కింద భారత్‌కు బంగ్లాదేశ్ కీలకమైన భాగస్వామి. భద్రత, వాణిజ్యం ఇంధనం, సైన్స్ అండ్ టెక్నాలజీ, రక్షణ, సముద్ర జల వ్యవహారాలు తదితర రంగాల్లో సహకారం ఇప్పటికే వుంది. దక్షిణాసియాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బంగ్లాదేశ్ వుంది. ఆసియాలో బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా వుంది.

అమెరికాలో సూపర్ మార్కెట్ వద్ద కాల్పులు

- ముగ్గురు మృతి, 10మందికి గాయాలు

లిటిల్ రాక్, ఆర్కాన్సాస్ : అమెరికాలోని ఆర్కాన్సాస్ రాష్ట్రంలో ఒక సరుకుల దుకాణం వద్ద ఒక వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు చనిపోగా, 10మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కాల్పులతో స్టోర్ తలుపులకు, అక్కడ పార్క్ చేసిన కార్ల అద్దాలకు బుల్లెట్ గుర్తులు కనిపిస్తున్నాయి. బయట నేలపై ఖాళీ తూటాలు పడి వున్నాయి. కాల్పుల కలకలంతో ఆ దారిన వెళ్ళేవారు లోపల, అక్కడ పార్కింగ్ స్థలంలో దాగుండేందుకు ప్రయత్నించారు. కాల్పులు జరిపిన వ్యక్తిపై వెంటనే అక్కడ గల పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు కూడా గాయపడ్డారని రాష్ట్ర పోలీసు విభాగం తెలిపింది. లిటిల్ రాక్ నగరానికి దక్షిణంగా ఫోర్డీస్ పట్టణంలో మాడ్ బుచర్ గ్రోసరీ స్టోర్‌లో శుక్రవారం ఉదయం 11.30గంటల సమయంలో కాల్పులు జరిగాయని తెలిపారు. తొలుత కాల్పుల శబ్దం వినిపించినపుడు బాణాసంచా కాల్పులని భావించామని, తర్వాత ఒక వ్యక్తి తుపాకీ పట్టుకుని కాల్చడం చూసి భయంతో పరిగెత్తామని ఒక మహిళ తెలిపారు. అమెరికాలో ఇలా కాల్పులు జరగడం చాలా ఎక్కువ. 2022లో బఫెలో సూపర్ మార్కెట్‌లో జరిగిన కాల్పుల్లో 10మంది మరణించగా, గతేడాది కొలరాడోలో జరిగిన సంఘటనలో మరో పది మంది చనిపోయారు.

నీట్ పేపర్ లీక్ సూత్రధారి సంజీవ్ ముఖియా..

- అక్రమాలు, అవకతవకలపై సీబీఐ దర్యాప్తు..?



న్యూఢిల్లీ : వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశపరీక్ష 2024 లో ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రచ్చగా మారింది. ఈ కేసులో ఇప్పటివరకు మధ్యవర్తులు, విద్యార్థులు సహా 14 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. వీరందరినీ విచారించగా ఓ వ్యక్తి పేరు ప్రధానంగా వినిపించింది. అతడే సంజీవ్ ముఖియా ఈ లీకేజ్ రాకెట్ వెనుక ప్రధాన కుట్రదారు అతడేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అతడ్ని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే దీని వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉన్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఎన్టీఏ నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలపై కేంద్రం సీబీఐతో దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్టు సంకేతాలు వస్తున్నాయి.

బిజినెస్

రిలయన్స్ డైరెక్టర్‌గా యాసిర్‌పై వాటాదారుల విముఖత..!



న్యూఢిల్లీ : సౌదీ అరామ్‌కో ఛైర్మన్ యాసిర్ ఒత్మాన్ హెచ్ అల్ రుమయ్యాన్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో స్వతంత్ర డైరెక్టర్‌గా పునర్నియమించడాన్ని 16 శాతం మంది వాటాదారులు వ్యతిరేకించారు. అయితే.. మెజారిటీ ఇన్వెస్టర్లు 83.97 శాతం మద్దతు పలకడంతో ఐదేళ్ల పాటు కంపెనీ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ పిఎంఎస్ ప్రసాద్‌ను మరో ఐదేళ్ల పాటు డైరెక్టర్‌గా మళ్లీ నియమించేందుకు వాటాదారులు ఆమోదం తెలిపారు. యాసిర్‌కు బోర్డ్ లేదా కమిటీల సమావేశాలకు హాజరైనందుకు రుసుము, ఇతర సమావేశాలలో పాల్గొనడానికి అయ్యే ఖర్చుల రీయింబర్స్‌మెంట్, లాభానికి సంబంధించిన కమీషన్ ద్వారా రెమ్యునరేషన్ చెల్లించనుంది.

స్టాన్లీ లైఫ్‌స్టైల్ ఐపిఒకు బ్రోకరేజల మద్దతు

ముంబయి : సూపర్ ప్రీమియం, లగ్జరీ ఫర్నిచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్ స్టైల్స్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు ప్రముఖ బ్రోకరేజ్‌ల నుండి సబ్‌స్క్రైబ్ రేటింగ్‌ను అందుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 21న తెరువబడిన ఈ ఐపిఒ జూన్ 25తో ముగియనుంది. ఈ ఇష్యూలో రూ.537 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.161.11 నిధులు సమీకరించింది. అనేక రకాల గృహ పరిష్కారాలతో పాటుగా విస్తృత శ్రేణి లగ్జరీ ఫర్నిచర్ వస్తువులను ఈ కంపెనీ అందిస్తుంది.

ఉత్తమ పని ప్రదేశంగా సింక్రోనీ

హైదరాబాద్ : ఉత్తమ పని ప్రదేశాల్లో ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ దేశంలోనే అత్యుత్తమ కంపెనీలలో రెండవ స్థానంలో నిలిచింది. సిబ్బందికి సానుకూల పని కేంద్రంగా ఈ అవార్డును 'ది గ్రేట్ ప్లేస్ టు వర్క్' ఇన్స్‌ట్యూషన్ నుంచి వరుసగా ఏడవ సంవత్సరం సాధించినట్లు సింక్రోనీ ఇండియా హెడ్ రచనా బహదూర్ పేర్కొన్నారు. తమ సంస్థలో ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడం, అందరికీ ఒకే స్థాయిలో ప్రోత్సాహం ఉంటుందన్నారు.

సింక్రోనీలో 51 శాతం పైగా మహిళ ఉద్యోగులతో పాటుగా, 106 మంది వైకల్యం వ్యక్తులు, 50 శాతం పైగా నిపుణులు తమ కార్యాలయంలో పని చేస్తున్నారన్నారు.

కేంద్రానికి బిఒఎం రూ.857 కోట్ల డివిడెండ్



పూణె : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) కేంద్ర ప్రభుత్వానికి రూ.857 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2023-24గాను ఆ మొత్తానికి విలువ చేసే చెక్కును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు బిఒఎం ఎండి, సిఇఒ నిధు సక్సేనా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే అందజేశారు. ప్రతీ ఈక్విటీ షేర్‌పై 14 శాతం డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించింది. 2023-24లో బిఒఎం నికర లాభాలు రికార్డ్ స్థాయిలో 55.84 శాతం పెరిగి రూ.4,055 కోట్లకు చేరాయి. ఇంతక్రితం 2022-23లో రూ.2,602 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది.

అమర రాజాకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' అవార్డు

హైదరాబాద్ : అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు 'ది గ్రేట్ ప్లేస్ టు వర్క్' ఇన్స్‌ట్యూషన్ నుంచి అవార్డు దక్కింది. మెరుగైన పని ప్రదేశాల్లో 68వ ర్యాంక్‌తో ప్రశంసను పొందింది. తమ సంస్థలో ఉద్యోగులకు సానుకూల, సంతృప్తికర పని వాతావరణం కల్పనకు కట్టుబడి ఉన్నామని అమర రాజా గ్రూపు హెచ్ఆర్ ప్రెసిడెంట్ జైక్రిష్ణ బి తెలిపారు.

రేపటి నుంచి అమెజాన్ 'బిజినెస్ వెల్యూడేస్'

బెంగళూరు : అమేజాన్ బిజినెస్ వ్యాపార కస్టమర్స్ కోసం జూన్ 24 నుండి 30 వరకు 'బిజినెస్ వేల్యూ డేస్'ను ప్రకటించినట్లు అమెజాన్ ఇండియా తెలిపింది. ఇందులో వ్యాపార కస్టమర్లకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. అనేక ఉత్పత్తులపై 70 శాతం వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు పేర్కొంది. బిజినెస్ కస్టమర్స్ అదనంగా 10 శాతం లేదా రూ.9999 వరకు క్యాష్‌బ్యాక్ కూడా పొందవచ్చని తెలిపింది. స్మార్ట్ వాచెస్, గృహోపకరాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై భారీ ఆఫర్స్‌ను అందిస్తున్నట్లు వెల్లడించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అడవి బిడ్డలకు చదువు అసంపూర్ణమేనా?





ఎం.ధర్మనాయక్
9490098685

'ప్రతి మనిషి జీవితంలో వెలుగు నింపేదే చదువు. అదే మన ఆయుధం, దాని అసలు లక్ష్యం సమాధానాలందించడం కాదు, మరిన్ని ప్రశ్నలను సంధించడం.' అని అమెరికన్ రచయిత, ఉపాధ్యాయురాలైన హెలెన్ కిల్లర్ అన్నారు. దీన్నిబట్టి విద్య ప్రాధాన్యతను మనం అర్థం చేసుకోవచ్చు. సమాజానికి దూరంగా, కొండకోనల్లో అడవుల మధ్య జంతువులతో సమానంగా జీవిస్తున్న అడవి బిడ్డలకు విద్యనందించడంలో ప్రభుత్వాలు నేటికీ విఫలమవుతూనే ఉన్నాయి. 2011లెక్కల ప్రకారం గిరిజనులకు అందిన విద్య 49.51శాతం. అంటే సగానికి సగం ఇంకా చదువుకు దూరంగానే ఉన్నారన్నది వాస్తవం. మరి వారిక్కూడా సంపూర్ణంగా అందాలంటే ఇంకెంకాలం పడుతుందో! స్వతంత్ర భారతావనిలో బయటి ప్రపంచమంటే తెలియకుండానే గిరిజనులు నేటికీ జీవిస్తున్నారు. వారు తమ మాతృభాష(లిపి) రావడానికే ఐదారేండ్లు పడుతుంది. ఎందుకంటే గిరిజనులు వారి పిల్లలతో నిరంతరం ఉండరు. జీవనోపాధి కోసం నిరంతరం పనుల్లో ఉంటారు. ఉదయాన్నే అడవి, వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటారు. గిరిజనుల్లో వలసలు కూడా ఎక్కువే! తక్కువ సమయమే పిల్లలతో గడుపుతారు. కడుపునిండా భోజనం కూడా వారికి సరిగా దొరకదు. అప్పుడు పిల్లలతో మాట్లాడే భాష పరిమితమే కాబట్టి మాతృభాష మీద పట్టు రావడానికి చాలా సమయం పడుతుంది. అందుకే లంబాడి, గోండు, కోయ, ఎరుకల భాషలోనే తెలుగులో పుస్తకాలు ప్రింట్ చేసి ప్రాథమిక స్థాయిలో విద్యను అభ్యసిస్తున్నారు. ఇది అరకొరగానే అందుతుంది.

రాష్ట్రంలో బడిబయట పిల్లలు వేల సంఖ్యలో ఉన్నారని పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడవుతున్నాయి. గిరిజనుల విద్యార్థులకు విద్యనందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సరి పోవడం లేదు. డిమాండ్‌కు అనుగుణంగా గురుకులాలు, సీట్ల సంఖ్య లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. హైదరాబాద్‌లో గిరిజన గురుకులం సెక్రటరీ కార్యాలయానికి వందల సంఖ్యల్లో గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు పట్టుకుని సీట్ల కోసం పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉన్నది. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ చివరికి సీట్లు రాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్న వారు అనేకమంది. ఇలాంటి తంటాలు పడకుండా

కొంతమంది ఇంటిదగ్గరే ఉండిపోయేవారు మరికొంతమంది. రెసిడెన్షియల్/ గురుకులం సీట్ల కోసం ప్రయత్నం చేసి రాకపోవడంతో దళారుల చేతుల్లో మోసపోతున్నటువంటివారూ ఇంకొందరు. ఇలా చాలామందికి ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవడం మన విద్యారంగం పట్ల అనాసక్తి కోల్పోయి చదువుకోవాలనుకునే వారు నష్టపోవాల్సి వస్తున్నది. గిరిజన విద్యార్థులందరికీ సీట్లు ఇచ్చి చదువును కొనసాగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో చదువు విలువ తెలియకపోవడంతో గిరిజనులు ఆ కాలంలో దాని ప్రాధాన్యత గుర్తించలేదు. ఈరోజు గిరిజనులు తమ పొట్ట పోసుకుంటూ తమ పిల్లలే ఆస్తిగా భావించి చదివించుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి అడవి బిడ్డలకి వారు అడిగిన ప్రాంతంలో స్కూళ్లలో విద్యనందించే వెసులుబాటు కలిగించి సీట్లివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

తెలంగాణ రాష్ట్రంలో గిరిజన రెసిడెన్షియల్/ గురుకులాలు మొత్తం 183 ఉన్నాయి. 86 పాఠశాలలు, 23 జూనియర్ కళాశాలలు, 22 డిగ్రీ కళాశాలలు, 29 మినీ గురుకులాలు, 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో మొత్తం 81,320 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో ప్రతిఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న దానికి అనుగుణంగా చదువుతున్న తరగతులలో సీట్ల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉన్నది. ప్రీ మెట్రిక్ హాస్టల్ 138 ఉండగా ఇందులో 19,782 మంది విద్యార్థులు చదువుతున్నారు. 322ఆశ్రమ పాఠశాలలు 88,230 మంది విద్యార్థులు చదువుతున్నారు. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 163 ఉన్నాయి 24,896 మంది విద్యార్థులు చదువుతున్నారు. లా, బీఈడీ, డైట్ కళాశాలల విద్యార్థుల సంఖ్య పెంచి మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నది. ప్రయివేటు స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ -బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో దాదాపుగా 15వేల మంది దరఖాస్తు చేస్తే కేవలం 700 సీట్లు మాత్రమే కేటాయిస్తున్నా రు. దీంతో ఎక్కువ మంది విద్యా ర్థులు నష్టపోవా ల్సి వస్తున్నది. హైదరాబాద్, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్లో కూడా సీట్ల సంఖ్యను, మెనూను పెంచాల్సిన అవసరం ఉన్నది. దీంతోపాటు ప్రత్యేకంగా హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటినుంచో విన్నవిస్తున్నారు.

ఇప్పటికే అందుతున్న సగం విద్యద్వారానైనా ఎంతోమంది గిరిజనులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నది కూడా నిజం. ఎందుకంటే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నా, సౌకర్యాలలేమితో జీవనం సాగిస్తున్నా చాలామంది తమ ఉన్నతమైన ఆశయాలతో కలెక్టర్లుగా, పోలీసులుగా, ఇతర రంగాల్లో కూడా రాణించినవారిని చూస్తున్నాం. ప్రభుత్వం మరింత ముందడుగు వేసి గిరిజన తండాలు, గుడాలలో ఉన్న పాఠశాలను మెరుగుపరుస్తూ బలోపేతం చేస్తే గిరిజన విద్యార్థులు మరెన్నో అవకాశాలతో అభివృద్ధి అవుతారన్న విషయం పాలకులు గ్రహించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 90శాతం మంది అధికారులు ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందిన వాళ్లు ప్రభుత్వ స్కూల్ నుండి వచ్చిన వాళ్లేనని ఒక మీటింగ్‌లో చెప్పారు. అది వాస్తవమే అయితే గనుక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, టీచర్ల కొరత లేకుండా, బోధన సక్రమంగా అందేలా చూడాలి. విద్యకు అధికంగా నిధులు కేటాయించాలి. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల పిల్లలు దరఖాస్తు చేసుకున్న అందరికీ సీట్లు కేటాయించాలి. ఎందుకంటే సీట్లు రాకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లల విద్య కోసం వారికున్న అరకొర వ్యవసాయమో, లేదంటే ఆస్తిపాస్తులనో అమ్ముకుని ప్రయివేటులో చదివిస్తున్న పరిస్థితి ఉన్నది. అక్కడ యూనిఫామ్, అడ్మిషన్, బుక్స్, ఇలా ఫీజుల రూపంలో దండిగా దండుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య కోసం గిరిజనులు ఆసక్తి చూపుతుంటే సీట్లు దొరక్క ప్రయివేటు స్కూళ్లలో వారి పిల్లలను చేర్పించి ఆర్థికంగా మరికొంతమంది తల్లిదండ్రులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పూర్తిగా ఉచితంగా అందించే విధంగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉన్నది. అప్పుడు పేద, ధనిక అనే తేడా లేకండా అందరూ ఒకేచోట చదువుకుంటారు. దేశ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ✦

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 90శాతం మంది అధికారులు ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందిన వాళ్లు ప్రభుత్వ స్కూల్ నుండి వచ్చిన వాళ్లేనని ఒక మీటింగ్‌లో చెప్పారు. అది వాస్తవమే అయితే గనుక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, టీచర్ల కొరత లేకుండా, బోధన సక్రమంగా అందేలా చూడాలి. విద్యకు అధికంగా నిధులు కేటాయించాలి. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల పిల్లలు దరఖాస్తు చేసుకున్న అందరికీ సీట్లు కేటాయించాలి. ఎందుకంటే సీట్లు రాకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లల విద్య కోసం వారికున్న అరకొర వ్యవసాయమో, లేదంటే ఆస్తిపాస్తులనో అమ్ముకుని ప్రయివేటులో చదివిస్తున్న పరిస్థితి ఉన్నది. అక్కడ యూనిఫామ్, అడ్మిషన్, బుక్స్, ఇలా ఫీజుల రూపంలో దండిగా దండుకుంటున్నారు.

భారమవుతున్న చదువులు

పిల్లలు ఆడే మైదానాలు, సరిపడా టీచర్స్, స్కూల్‌లో ఆన్‌లైన్ సదుపాయం, డిజిటల్ లైబ్రరీలు, ఇతర సరిపడా నైపుణ్యాలు నేర్పే పరికరాలు లేకుంటే ఏ విధంగా మన విద్యార్థులు పోటీ ప్రపంచంలో నెట్టుకురాగలరు? కనీస మరుగుదొడ్లు లేని పాఠశాలల వల్లే అనేకమంది తల్లిదండ్రులు ఆడపిల్లలను బడులకు పంపించడం లేదనే కఠోర వాస్తవం ప్రభుత్వాలకు తెలియదా? 'బంగారు తెలంగాణ', 'వెండి తెలంగాణ' అని గత ప్రభుత్వంలా కబుర్లు చెప్పకుండా... అన్ని విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి. ఆరు వేల ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం తాగడానికి ఇప్పటికీ మంచి నీటి వసతి లేదంటే పిల్లలు ఎలా చదువుకోవాలి? మౌలిక సదుపాయాల కల్పన జరిగినప్పుడే ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులు చేసిన త్యాగాలకు ఫలితం దక్కేలా చేసినట్టు అవుతుంది.



డా. నర్రా సుఖేందర్ రెడ్డి
9394000030



ప్రయివేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చాయి. ఫీజులు, డొనేషన్లు, పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు అంటూ యథేచ్ఛగా వసూలు చేస్తున్నాయి. ఫీజుల నియంత్రణ పాటించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నా అవి పట్టించుకోవడంలేదు. విచ్చలవిడిగా లక్షల రూపాయలను ఫీజుగా తీసుకుంటున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను విక్రయించొద్దని నిబంధనలున్నా అనేక పాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ వాటిని అమ్ముతున్నారు. ప్యాకేజీల రూపంలో ఎల్‌కేజీ నుంచి యూకేజీ వరకు రూ.7వేలు, ఆ పై తరగతులకు రూ.10 వేలపైనే ముక్కుపిండి దండుకుంటున్నారు. ఈ దోపిడీపై సర్వత్రా ఆరోపణలొస్తున్నా కట్టడి మాత్రం జరుగడంలేదు. 2023-24కి గాను పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజలు భారీగా పెంచనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 6 నుంచి 20 శాతం వరకు పెంచే ఆలోచనలో యాజమాన్యాలు ఉన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. అంతేకాకుండా ఈ విద్యా సంవత్సరం వార్షిక పరీక్షలు ఇంకా ముగియకముందే వచ్చే ఏడాదికి కట్టాల్సిన స్కూల్ ఫీజుల విషయంలో కొన్ని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు వాట్సాప్ మెసెజ్‌లు, నోటీసులు, మెయిల్స్ పంపడం గమనార్హం. విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్ 121సీ ప్రకారం.. ప్రయివేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు చట్టం అమలెందుకు కాలేదని ఇటీవల హైకోర్టు ప్రశ్నించింది. కేంద్రం రూపొందించిన విద్యా హక్కు చట్టం-2009 అమల్లోకి వచ్చినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ఎందుకు ఇంప్లిమెంట్ చేయలేదని అడిగింది. చట్టం అమలు చేస్తే ఆ వివరాలను ఎందుకు అందజేయలేదని నిలదీసింది.

ప్రత్యేకరాష్ట్రంలోనూ దయనీయమే...

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తమ బతుకులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మారతాయని ఆశించి ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ ప్రజలు పాల్గన్నారు. అయితే ఈ ఉద్యమంలో ప్రత్యేక పాత్ర పోషించింది మాత్రం అణగారిన కులాల ప్రజలు. అలాగే విద్యార్థుల పాత్రా మరువరానిది. అయితే ఉద్యమంలో కేవలం యూనివర్సిటీల విద్యార్థులు మాత్రమే పాల్గొన్నట్లు చెబుతూ ఇతర విద్యార్థుల పాత్రను ప్రస్తావించరు చాలామంది. తెలంగాణలోని స్కూల్స్, జూనియర్ కాలేజీలు, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో చదివేవారూ సొంత రాష్ట్ర సాధనలో నిస్వార్థ కృషి చేశారు. స్వరాష్ట్రం సిద్ధించినా పాఠశాలల పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉందని చెప్పడానికే విద్యార్థుల త్యాగాలను ఇప్పుడు గుర్తు చేయవలసి వస్తున్నది.రాష్ట్రం మొత్తంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు కలిపి సుమారు 43,083 ఉన్నాయి. అందులో మొత్తం 69,15,241 విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారు 3,20,894 ఉపాధ్యాయులున్నారు. ఈ లెక్కన సగటున ఒక పాఠశాలకు కేవలం ఏడుగురు టీచర్స్ మాత్రమే ఉన్నారన్న ఆందోళనకరమైన సంగతి స్పష్టమవుతున్నది. రాష్ట్రంలో కేవలం 31,716 పాఠశాలలకే పిల్లలు ఆటలు ఆడుకునే మైదానాలుండగా కేవలం 772 బడులలో మాత్రమే డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

తాగేందుకు మంచినీళ్లూ కరువే...

మన విద్యార్థులకు కావాల్సిన టాయిలెట్స్ విషయానికి వస్తే... కేవలం 33,428 పాఠశాలల్లో మాత్రమే బాలికలకు అత్యవసరమైన టాయిలెట్స్ సదుపాయాలు ఉన్నాయి. సుమారు 10 వేల పాఠశాలల్లో కనీసం టాయిలెట్స్ లేవు. మగపిల్లలకు కేవలం 29,137 పాఠశాలల్లో టాయిలెట్స్ సదుపాయాలు ఉన్నాయి. తాగునీరు అందుబాటులో లేని పాఠశాలలు 6 వేలకు పైగా ఉన్నాయి. టాయిలెట్, స్కూల్ లైబ్రరీలు, పిల్లలు ఆడే మైదానాలు, సరిపడా టీచర్స్, స్కూల్‌లో ఆన్‌లైన్ సదుపాయం, డిజిటల్ లైబ్రరీలు, ఇతర సరిపడా నైపుణ్యాలు నేర్పే పరికరాలు లేకుంటే ఏ విధంగా మన విద్యార్థులు పోటీ ప్రపంచంలో నెట్టుకురాగలరు? కనీస మరుగుదొడ్లు లేని పాఠశాలల వల్లే అనేకమంది తల్లి దండ్రులు ఆడపిల్లలను బడులకు పంపించడం లేదనే కఠోర వాస్తవం ప్రభుత్వాలకు తెలియదా? 'బంగారు తెలంగాణ', 'వెండి తెలంగాణ' అని గత ప్రభుత్వంలా కబుర్లు చెప్పకుండా... అన్ని విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి. ఆరు వేల ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం తాగడానికి ఇప్పటికీ మంచి నీటి వసతి లేదంటే పిల్లలు ఎలా చదువుకోవాలి? మౌలిక సదుపాయాల కల్పన జరిగినప్పుడే ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులు చేసిన త్యాగాలకు ఫలితం దక్కేలా చేసినట్టు అవుతుంది.

బ్యాగులు, షూలు..అన్నీ భారమే..

మార్కెట్‌లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్, ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరడగం తల్లిదండ్రులకు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటే తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదన్న భావించే తల్లిదండ్రులు పిల్లలకు కావాల్సిన అన్ని వస్తువులు ఖరీదు ఎంతైనాసరే కొనుగోలు చేసి ఇస్తున్నారు. మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరగడంతో దాని ప్రభావం కుటుంబాలపై పడుతోంది. పాఠశాలల యాజమాన్యలు పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు బ్యాగులను కూడా తమ వద్దనే కొనాలనే నిబంధలు విధిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పని పరిస్థితుల్లో అక్కడే కొనాల్సి వస్తుంది.నిబంధనల ప్రకారం పుస్తకాల సంచి బరువు ఆ విద్యా ర్థి శరీర బరువులో పదో వంతు మాత్రమే ఉండాలి. ఈ నిబంధనలు పాటిస్తున్న పాఠశాలలు చాలా తక్కువ. ఫలితంగా వయసుకు మించిన పుస్తకాల భారాన్ని మోస్తూ సాయంత్రానికి ఇంటికి వచ్చేసరికి విద్యార్థులు నీరసించి పోతున్నారు.బండెడు పుస్తకాల బరువు మోయలేక పిల్లలు అలవికాని రోగాల బారి నపడుతున్నారు. ఇంతకుముందు 2015లో కూడా బ్యాగుల బరువు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినా ఆ ఆదేశాలు ఎక్కడా అమలు కాలేదు. కానీ గత మేలో మద్రాస్ హైకోర్టు పాఠశాల విద్యార్థుల బ్యాగుల బరువు నియంత్రణపై ఆదేశాలు జారీచేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ స్కూలు బ్యాగుల బరువు తగ్గించే చర్యలు చేపట్టింది. అయితే 'ఆదేశాలు ఇచ్చాం మా పని అయిపోయింది' అని కాకుండా కచ్చితమైన వ్యవస్థను ఏర్పాటు చేసి అమలులోకి తేవాల్సిన అవసరం ఉన్నది. ✦

గోదావరి బేసిన్లో లేని ప్రాంతం ఈ క్రిందివానిలో ఏది?



1. భౌగోళికంగా తెలంగాణ ప్రాంతం ఈ క్రిందివాటిలో దేనిలో అంతర్భాగము?
1) బుందేల్ఖండ్ పీఠభూమి 2) మాల్వా పీఠభూమి
3) దక్కన్ పీఠభూమి 4) ఏదీకాదు

2. ఉనికి రీత్యా తెలంగాణ ప్రాంతం ఉన్న గోళార్థం?
1) ఉత్తరార్ధగోళం 2) దక్షిణార్ధగోళం
3) పై రెండు 4) ఏదీకాదు

3. ఉనికి రీత్యా తెలంగాణ ప్రాంతం ఈ క్రిందివాటిలో ఏ ప్రాంతంలో అంతర్భాగము?
1) ఉత్తర ఆసియా 2) దక్షిణాసియా
3) పశ్చిమ ఆసియా 4) తూర్పు ఆసియా

4. తెలంగాణ ప్రాంతం యొక్క సాధారణ ఎత్తు ఈ క్రింది విధంగా ఉంటుంది?
1) పడమర దిశనుండి తూర్పు దిశవైపుకు తగ్గుచున్నట్లు
2) తూర్పు దిశ నుండి పడమర దిశవైపు తగ్గుచున్నట్లు
3) పై రెండు
4) ఏదీ కాదు.

5. తెలంగాణ ప్రాంతంలో సముద్ర మట్టం నుండి 600 మీటర్లు ఆపైన ఎత్తుగల ప్రాంతంలో లేనిది ఏది?
1) హైద్రాబాద్ 2) రంగారెడ్డి
3) మెదక్ 4) నిజామాబాద్

6. తెలంగాణ రాష్ట్ర భూభాగం ఈ క్రింది ఆకారంలో కలదు?
1) సమబాహు త్రిభుజం
2) అసమబాహు త్రిభుజం
3) సమద్విబాహు త్రిభుజం
4) చతురస్రం

7. తెలంగాణ రాష్ట్రంలో ఈ క్రింది వాటిలో అతిపెద్ద ప్రాంతం ఏది?
1) గోదావరి బేసిన్ 2) తెలంగాణ పీఠభూమి
3) కృష్ణ బేసిన్ 4) ఏదీకాదు

8. జిల్లాల విభజన తర్వాత సత్నాల కొండలు దేనిలో అంతర్భాగము?
1) ఆదిలాబాద్ 2) మంచిర్యాల
3) కుమురంభీం ఆసిఫాబాద్ 4) నిర్మల్

9. రాఖీ కొండలు ఏ జిల్లాలో కలవు?
1) పెద్దపల్లి 2) జగిత్యాల
3) కరీంనగర్ 4) ఏదీకాదు

10. యల్లండ్లపాడు గుట్టలు, రాజు గుట్టలు ఏ జిల్లాలలో కలవు?
1) ఆదిలాబాద్, మంచిర్యాల
2) నల్గొండ, సూర్యాపేట
3) నిజామాబాద్, కామారెడ్డి
4) ఖమ్మం, భద్రాద్రి భువనగిరి

11. అమ్రాబాద్ కొండలు ఏ జిల్లాలో కలవు?
1) నాగర్ కర్నూల్ 2) మహబూబ్‌నగర్
3) వనపర్తి 4) జోగులాంబ గద్వాల్

12. అనంతగిరి విస్తరించి ఉన్న జిల్లా?
1) హైద్రాబాద్ 2) ఖమ్మం
3) వికారాబాద్ 4) నల్గొండ

13. రాచకొండలు విస్తరించి ఉన్న జిల్లాలు
1) నల్గొండ 2) వికారాబాద్
3) మహబూబ్‌నగర్ 4) పైవన్నీ

14. హైద్రాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో వ్యాపించి ఉన్న కొండలు ఈ క్రింది పర్వతాలకు చెందినవి?
1) బాలాఘాట్ పర్వతాలు
2) పాలఘాట్ పర్వతాలు
3) పై రెండు
4) ఏదీకాదు

15. నల్లమల కొండలు ఏ జిల్లాలో కలవు?
1) మహబూబ్‌నగర్ 2) వనపర్తి
3) నాగర్ కర్నూల్ 4) జోగులాంబ గద్వాల్

16. సిర్పూర్ కొండలు ఏ జిల్లాలో కలవు?
1) కుమ్రంభీం ఆసిఫాబాద్ 2) మంచిర్యాల
3) జగిత్యాల 4) నిర్మల్

17. రామగిరి కొండలు ఏ జిల్లాలలో కలవు?
1) జగిత్యాల 2) పెద్దపల్లి
3) నిర్మల్ 4) ఆదిలాబాద్

18. తూర్పు కనుమలు నిర్మాణం దృష్ట్యా తూర్పు కొండలుగా తెలంగాణ రాష్ట్రంలోని మొదటగా ఏ జిల్లాలో విస్తరిస్తాయి?
1) మహబూబ్ నగర్ 2) వనపర్తి
3) నాగర్‌కర్నూల్ 4) ఏదీకాదు

19. కందికల్ కొండలు ఏ జిల్లాలో కలవు
1) జయశంకర్ 2) మహబూబ్‌నగర్
3) వరంగల్ అర్బన్ 4) ఏదీకాదు

20. తెలంగాణ ప్రాంతం సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 480 నుండి 600 మీటర్లు
2) 200 నుండి 400 మీటర్లు
3) 250 నుండి 550 మీటర్లు
4) 200 నుండి 500 మీటర్లు

21. తెలంగాణలో తూర్పు కనుమల్లో ఎత్తైన కొండ లక్ష్మీదేవిపల్లి ఏ జిల్లాలలో కలదు?
1) మెదక్ 2) మహబూబ్‌నగర్
3) సిద్ధిపేట 4) జోగులాంబ-గద్వాల్

22. గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం
1) నేలబొగ్గు 2) ఇనుము
3) బంకమన్ను 4) బెరైటీస్

23. తెలంగాణ పశ్చిమ కనుమలలో ఎత్తైన శ్రేణి?
1) సత్నాల 2) లక్ష్మీదేవిపల్లి
3) సోలామైల్ 4) మహబుబ్ ఘాట్

24. బసాల్ట్ లావాతో ఏర్పడిన కోత మైదానాలు ఏ జిల్లాల్లో వ్యాపించి ఉన్నాయి?
1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
3) పై రెండు 4) ఏదీకాదు

25. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ సముద్రమట్టం నుండి ఎంత ఎత్తులో ఉంది?
1) 600 మీటర్లు 2) 650 మీటర్లు
3) 500 మీటర్లు 4) 550 మీటర్లు

26. సిర్నాపల్లి కొండలలో ఉండే తెగ ఏది?
1) కోయలు 2) వాల్మికీ బోయ
3) పర్ధాన్‌లు 4) ఖైతి (KsTTr) లంబాడీలు

27. గోదావరి బేసిన్లో లేని ప్రాంతం ఈ క్రిందివానిలో ఏది?
1) ఏటూరు నాగారం 2) మెట్‌పల్లి
3) భీమ్‌గల్ 4) మిర్యాలగూడ

28. ఈ క్రింది వాటిలో ఏ కొండలు సిర్నాపల్లి నుండి ఆర్మూర్ వరకు విస్తరించి ఉన్నాయి?
1) సిర్నాపల్లి కొండలు 2) రాతి కొండలు
3) బూజు కొండలు 4) ఏదీకాదు

29. ఈ క్రింది వాటిలో నీస్, గ్రానైట్ శిలలు లేని జిల్లా ఏది?
1) నిజామాబాద్ 2) కామారెడ్డి
3) సంగారెడ్డి 4) ఏదీకాదు

30. పాండవుల గుట్టలు ఏ జిల్లాలలో కలవు?
1) వరంగల్ అర్బన్ 2) మహబూబ్‌నగర్
3) జయశంకర్ భూపాలపల్లి 4) వనపర్తి

31. కింది వాటిలో జియోలాజికల్ సర్వే ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన శిలలు ఏవి?
1) వింధ్య శిలలు
2) గోండ్వానా, ద్రవిడియన్ శిలలు
3) ఆర్కియన్ శిలలు
4) పైవన్నీ

32. మెసోజోయిక్ కాలానికి చెందిన దక్కన్ ట్రాప్‌లు ఏ శిలలతో నిర్మితమైనవి?
1) బసాల్ట్ శిలలు 2) ఆర్కియన్ శిలలు
3) ద్రవిడియన్ శిలలు 4) రూపాంతర శిలలు

33. లక్ష్మిదేవిపల్లి కొండలు ఏ జిల్లాలో ఉన్నాయి?
1) కామారెడ్డి 2) సిద్ధిపేట
3) మెదక్ 4) నిర్మల్

34. తెలంగాణలోని పశ్చిమ కనుమలను ఏమని పిలుస్తారు?
1) అనంతగిరి 2) సహ్యాద్రి/సత్నాల
3) బాలాఘాట్ 4) ఏదీకాదు

35.తెలంగాణాలో పశ్చిమ కనుమల్లో ఎత్తైన శ్రేణి-మహబూబాఘాట్ ఏ జిల్లాల్లో ఉంది?
1) నిర్మల్ 2) జయశంకర్
3) కొమురంభీం 4) ఆదిలాబాద్

36. తెలంగాణ ప్రాంతం సముద్రమట్టం నుండి ఎత్తైన ప్రదేశం ఉండటం వలన ఉష్ణోగ్రత ఏ విధంగా ఉంటుంది?
1) ఉష్ణోగ్రత తక్కువ 2) ఉష్ణోగ్రత ఎక్కువ
3) ఉష్ణోగ్రత సమానంగా 4) ఏదీకాదు

37. తెలంగాణ శీతోష్ణస్థితి ఏ రుతుపవన శీతోష్ణస్థితి అంటారు?
1) ఉప ఆయన రేఖ 2) ఆయన రేఖ
3) పై రెండు 4) ఏదీకాదు

38. కొప్పెన్ శీతోష్ణస్థితి వర్గీకరణ ప్రకారం తెలంగాణ ప్రాంతం ఈ కింది వాటిలో ఏ రకానికి చెందినది?
1) ఆర్ధ ఉపశుష్క 2) అనర్ధ ఉపశుష్క
3) ఉపశుష్క 4) ఏదీకాదు

39. వేసవికాలంలో క్యుములోనింబస్ మేఘాలవల్ల అప్పుడప్పుడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతాన్ని ఏమంటారు?
1) పర్వతీయ వర్షపాతం 2) సంవాహన వర్షపాతం
3) చక్రవాత వర్షపాతం 4) ఏదీకాదు

40. తెలంగాణ ప్రాంతం వడగాలులు ఎక్కువగా ఏ నెలలో వీస్తాయి?
1) మే 2) ఏప్రిల్
3) జూన్ 4) ఫిబ్రవరి

41. తెలంగాణ ప్రాంతంలో సాధారణంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే ప్రాంతం?
1) భద్రాద్రి కొత్తగూడెం 2) కామారెడ్డి
3) రామగుండం 4) ఏదీకాదు

42. తెలంగాణ ప్రాంతంలో సాధారణంగా అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అయ్యే ప్రాంతం ఏది?
1) ఆదిలాబాద్ 2) నిజామాబాద్
3) ఖమ్మం 4) హైద్రాబాద్

43. ఏ నెలను వర్షాకాలానికి మరియు శీతాకాలానికి మధ్యయ సంధిమాసంగా వ్యవహరిస్తారు?
1) సెప్టెంబర్ 2) నవంబర్
3) డిసెంబర్ 4) అక్టోబర్

44. ఈశాన్య ఋతుపవన కాలంలో అత్యధిక వర్షపాతం పొందే జిల్లా ఏది?
1) హైద్రాబాద్ 2) రంగారెడ్డి
3) మెదక్ 4) కరీంనగర్

45. ఈశాన్య ఋతుపవన కాలంలో అత్యల్ప వర్షపాతం పొందే జిల్లా ఏది?
1) హైద్రాబాద్ 2) ఆదిలాబాద్
3) ఖమ్మం 4) పాత కరీంనగర్

46. ఈశాన్య ఋతుపవన కాలంలో ఏ రకము వర్షపాతం కల్గుతుంది?
1) సంవాహన వర్షపాతం
2) పర్వతీయ వర్షపాతం
3) చక్రవాత వర్షపాతం
4) ఏదీకాదు

47. తెలంగాణ మొత్తం మీద అత్యధిక వర్షపాతం సంభవించే జిల్లా ఏది?
1) ఆదిలాబాద్ 2) పెద్దపల్లి
3) ఖమ్మం 4) భద్రాద్రి కొత్తగూడెం

48. తెలంగాణ మొత్తం మీద అత్యల్ప వర్షపాతం సంభవించే జిల్లా ఏది?
1) సిద్ధిపేట
2) పాత మహబూబ్‌నగర్
3) జగిత్యాల
4) పెద్దపల్లి

49. తెలంగాణలో ఎక్కువగా వర్షాలు కురిసే ప్రాంతం
1) మానేరు బేసిన్ 2) పాలేరు బేసిన్
3) సీలేరు బేసిన్ 4) శబరి బేసిన్

50. నైరుతి ఋతుపవన కాలం
1) జూన్ నుండి సెప్టెంబర్
2) జూన్ నుండి అక్టోబర్
3) జూలై నుండి అక్టోబర్
4) ఏదీకాదు

51. సాధారణంగా నైరుతి ఋతుపవనాలు తెలంగాణ ప్రాంతానికి ఎప్పుడు చేరుకుంటాయి?
1) జూన్ మొదటివారం
2) జూన్ రెండవ వారం
3) పై రెండు 4) ఏదీకాదు

52. దక్షిణ తెలంగాణ ప్రాంతం నుండి ఉత్తర తెలంగాణ ప్రాంతానికి వెళ్లేకొలది వర్షపాతం?
1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
3) ఎలాంటి మార్పు ఉండదు 4) ఏదీకాదు

సమాధానాలు

1. 3	2.1	3.2	4.1	5.4
6.3	7.2	8.1	9. 2	10.4
11.1	12.3	13.4	14.1	15.3
16.1	17.2	18.1	19. 3	20.1
21.3	22.1	23.4	24.3	25.1
26.4	27.4	28.1	29.4	30.3
31.4	32.1	33.2	34.2	35.1
36.1	37.2	38.3	39.2	40.1
41.3	42.1	43.4	44.1	45.4
46.3.	47.1	48.2	49.3	50.1
51.3	52.2			